


ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో **ఒక పూర్తి పేజీ**

epaper.vaartha.com WWW.VAARTHA.COM

# వార్త
తెలుగు జాతీయ దినపత్రిక

తిరుపతి

: fb.com/vaartha Digital

Published from Tirupathi, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

17-9-2026 గురువారం సంపుటి: 32 సంచిక: 228 పేజీలు: 10+4 వెల: 6.50




ప్రముఖ కన్నడ నటుడు అనంత్‌నాగ్‌కు
## దాదాసాహెబ్ ఫాల్కే
22న గుజరాత్‌లో ప్రదానం 2లో

**పోలీసు ఉద్యోగార్థులకు శుభవార్త**

## 2,050 పోస్టుల భర్తీకి
# నోటిఫికేషన్

**మొత్తం పోస్టుల వివరాలు ఇవే**

- ఎస్ఐ (ఎస్‌పిఎఫ్) పోస్టులు: 9
- ఎస్ఐ (కమ్యూనికేషన్) పోస్టులు: 50
- ఎస్ఐ (పిటిఒ) పోస్టులు: 10
- సైంటిఫిక్ అసిస్టెంట్ (ఎఫ్ఎస్ఎల్) పోస్టులు: 43
- పిసి (సివిల్, ఎఆర్) పోస్టులు: 827
- ఫైర్‌మెన్ పోస్టులు: 158
- వార్డర్ పోస్టులు: 171
- పిసి (కమ్యూనికేషన్) పోస్టులు: 200
- పిసి (మెకానిక్స్, డ్రైవర్లు) పోస్టులు: 213




**విజయవాడ, సెప్టెంబరు 16 ప్రభాతవార్త ప్రతినిధి:** పోలీసు ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శుభవార్త అందించింది. రాష్ట్రంలో పోలీసు, అగ్నిమాపక, జైళ్లు, ఫోరెన్సిక్ తదితర విభాగాల్లో భారీగా ఉద్యోగాల భర్తీకి చర్యలు చేపట్టింది. 2026 జాబ్ క్యాలెండర్‌లో పోలీసు, అనుబంధ శాఖలకు సంబంధించిన పలు పోస్టులను చేర్చింది. మొత్తం 2,050 పోస్టుల భర్తీకి ఆంధ్రప్రదేశ్ స్టేట్ లెవల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు (ఎపిఎస్ఎల్‌పిఆర్‌బి) నోటిఫికేషన్లు జారీ చేసింది. పోలీసు శాఖలో మొత్తం 438 సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ) పోస్టులు ఉన్నాయి. వీటిలో సివిల్‌విభాగంలో 253, ఆర్మ్‌డ్ రిజర్వ్‌లో 116, స్పెషల్ ప్రొటెక్షన్ >>2

## రూ.1.45 లక్షల కోట్లతో
# బిపిసిఎల్ రిఫైనరీ

రామాయపట్నం పోర్టు వద్ద అల్ట్రా మెగా ప్రాజెక్టుగా ఏర్పాటు

త్వరితగతిన ప్రాజెక్టు పనులు ప్రారంభించాలన్న సిఎం చంద్రబాబు

ముఖ్యమంత్రితో బిపిసిఎల్ ఎండి సంజయ్ ఖన్నా సమావేశం

రిఫైనరీ సమీపంలో 1,500 ఎకరాల్లో పెట్రోకెమికల్స్ పార్క్


బుధవారం సచివాలయంలో బిపిసిఎల్ ఎండి సంజయ్ ఖన్నాను సన్మానించిన సిఎం చంద్రబాబు. చిత్రంలో అధికారులు

**అమరావతి, సెప్టెంబరు 16 ప్రభాతవార్త ప్రతినిధి:** రామాయపట్నం పోర్టు సమీపంలో భారత్ పెట్రోలియం కార్పోరేషన్ లిమిటెడ్ (బిపిసిఎల్) చేపట్టనున్న గ్రీన్ ఫీల్డ్ రిఫైనరీ కమ్ పెట్రోకెమికల్ ప్రాజెక్టు పనులు త్వరితగతిన ప్రారంభించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టంచేశారు. రిఫైనరీ సమీపంలో పెట్రో కెమికల్ పార్కును కూడా ఏర్పాటు చేయాలని సిఎం ప్రతిపాదించారు. భారత్ పెట్రోలియం కార్పోరేషన్ సిఎండి సంజయ్ ఖన్నా బుధవారం సిఎం చంద్రబాబుతో సమావేశం అయ్యారు. ప్రకాశం నెల్లూరు జిల్లాల మధ్య ఏర్పాటు కానున్న బిపిసిఎల్ రిఫైనరీ ప్రాజెక్టు వ్యయం దాదాపు రూ.1.45 లక్షల కోట్లకు చేరిందని ఆయన ముఖ్యమంత్రికి తెలిపారు. యేడాదికి 9 మిలియన్ టన్నుల సామర్థ్యంతో ఇంటిగ్రేటెడ్ గ్రీన్ ఫీల్డ్ రిఫైనరీని ఏర్పాటుచేస్తున్నామని వివరించారు. ప్రాజెక్టుకు తుది పర్యావరణ అనుమతి సెప్టెంబరు చివరి >>2

### ఆధ్యాత్మికతకు ప్రపంచ స్థాయి నమూనాగా తిరుమల 2లో

భక్తుల అనుభూతిని పెంచేలా ఎక్స్‌పీరియన్స్ సెంటర్

రూ.104 కోట్లతో ఆధునీకరించిన ఎస్వీ మ్యూజియం ప్రారంభం

తిరుమల వచ్చే భక్తులకు ఎల్ఐసి ఆధ్వర్యంలో రూ.2 లక్షల బీమా

రాష్ట్రంలో 5 వేల శ్రీవారి ఆలయాల నిర్మాణం లక్ష్యం: సిఎం చంద్రబాబు

### అర్హులందరికీ రుణాలందితేనే ఫలితం

టిడ్కో గృహాలకు రుణాలపై కార్యాచరణ

రుణాల మొత్తం పెరిగినా లక్ష్యాలకు దూరంలో బ్యాంకులు

సిఎం చంద్రబాబు అధ్యక్షతన 236వ ఎస్ఎల్‌బిసి సమావేశం

రుణాల చెల్లింపుల్లో ఎస్‌హెచ్‌జి మహిళలు ఆదర్శం

వచ్చే ఎస్ఎల్‌బిసి నుంచి బ్యాంకులు, జిల్లాలు, విభాగాల వారీగా సమీక్ష 3లో



## పిఎఫ్ వేతన పరిమితి
# రూ.25 వేలకు పెంపు

- అదనంగా 51లక్షలకు పైగా ఉద్యోగులకు ప్రయోజనం
- ఉద్యోగులకు ఇపిఎఫ్ పెన్షన్, బీమా ప్రయోజనాలు
- కేంద్రంపై యేటా రూ.11,339 కోట్లు అదనపు భారం
- కేంద్ర మంత్రివర్గ సమావేశంలో కీలక నిర్ణయం
- వివరాలు వెల్లడించిన కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్

2లో



బుధవారం నెల్లూరులో ఆర్ఎస్ఆర్ హైస్కూలు ప్రారంభిస్తున్న మంత్రి లోకేష్

## ప్రైవేటు పాఠశాలలతో పోటీ పడాలి

ప్రభుత్వ పరంగా అన్ని సౌకర్యాలు కల్పిస్తాం

విద్యార్థుల హాజరు, ఉత్తీర్ణత పెంచాలి


నెల్లూరులో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్

ఆధునీకరించిన పాఠశాలలను ప్రారంభించిన మంత్రి 2లో




17-9pg2exHMNWJQE:17-9pg2exHMNWJQE.qxd 9/17/2026 12:37 AM Page 1





బుధవారం మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి షిండే నివాసంలో జరిగిన గణపతి పూజకు హాజరైన మహారాష్ట్ర సీఎం ఫడ్నవిస్, బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్

# నేడు వారణాసికి సిఎం చంద్రబాబు

**అమరావతి, సెప్టెంబరు 16 ప్రభాతవార్తప్రతినిధి:** ప్రధానమంత్రి నరేంద్రమోదీ 25ఏళ్ల ప్రజాసేవా ప్రస్థానాన్ని పురస్కరించుకుని వారణాసిలో నిర్వహిస్తున్న 'సేవా సంకల్ప్ అభియాన్' కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొనున్నారు. ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా ప్రజా జీవితంలో నరేంద్ర మోదీ చేసిన సేవలను పురస్కరించుకుని దేశవ్యాప్తంగా నెల రోజుల పాటు వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా కాశీ నగరంలో వారణాసి-వాద్నగర్ 'సేవా యాత్ర'ను చేపట్టారు. ప్రధాని మోదీ ప్రజా జీవితంతో ప్రత్యేక అనుబంధం ఉన్న వారణాసి,వాద్నగర్‌ను అనుసంధానిస్తూ ఈ 'సేవా సంకల్ప్ అభియాన్'లో సీఎం చంద్రబాబు పాల్గొంటారు. యువత, ప్రజా ప్రతినిధులు, 'సేవా ప్రతినిధుల భాగస్వామ్యంతో' ఈ సంకల్ప్ అభియాన్ చేపట్టారు. దేశ అభివృద్ధి ప్రయాణంలో ప్రజా భాగస్వామ్యం, సేవా భావం, సామాజిక బాధ్యత కీలకమనే సందేశాన్ని 'సేవా సంకల్ప్ అభియాన్' ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లనున్నారు. ప్రతీ గ్రామం, ప్రతి కుటుంబం, ప్రతి యువత, ప్రతి మహిళ అభివృద్ధి ప్రక్రియలో భాగస్వామి కావాలనే స్ఫూర్తితో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి సీఎం చంద్రబాబు హాజరు కానున్నారు. ఆయన శుక్రవారం ఉదయం విజయవాడ విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో వారణాసి బయలుదేరి వెళ్తారు.

## దసరా పనుల నిర్వహణకు పాలకమండలి ఆమోదం

**ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 16, ప్రభాతవార్త:** దుర్గమ్మవారి ఆలయంలో దసరా ఉత్సవాలకు సంబంధించిన పలు ఏర్పాట్లకోసం నిర్ణయాలు తీసుకున్నారు. బుధవారం జరిగిన పాలక మండలి సమావేశంలో ఈ నిర్ణయాలపై ఆమోదం తెలిపారు. ముఖ్యంగా కాంట్రాక్టు పద్ధతిన బస్సు డ్రైవర్లు, కండక్టర్లను నియమించడం, లడ్డూపోటులో నూతన సౌకర్యాలు, దసరా ఉత్సవాల్లో రెయిన్‌ప్రూఫ్ షామియానాలు, ఎలక్ట్రికల్ మెటీరియల్‌పైకు, పలు సాంకేతిక అంశాల పనుల టెండర్లు, క్యూలైన్ల పనులు, సీసీ టీవి ఏర్పాట్లు, శ్రీ మల్లేశ్వర స్వామివార్ల ఆలయం చుట్టూ 55 ప్లేటలతో రక్షణ ఏర్పాటు వంటి తీర్మానాలను ఆమోదించారు. ఆదేవిధంగా ఆస్ట్రేలియాలో శ్రీదుర్గామల్లేశ్వర స్వామివార్ల కళ్యాణం నిర్వహించడానికి ఆరుగురు వైదిక సిబ్బందిని డిప్యుటేషన్‌పై పంపుటకు పాలకమండలి ఆమోదం తెలిపింది. కార్యక్రమంలో ఇఒ వికె శీనా నాయక్, ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ, పాలకమండలి సభ్యులు, అధికారులు పాల్గొన్నారు. ఇంద్రకీలాద్రి పై వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా శ్రీ లక్ష్మీగణపతి ఆలయంలో ప్రతిష్టించిన గణపతికి బుధవారం ప్రత్యేక పూజలు జరిపారు. ఉత్సవ ముగింపు సందర్భంగా నటరాజస్వామి వారి ఆలయ ప్రాంగణంలో స్థానాచార్య వి శివ ప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో పూర్ణాహుతి నిర్వహించారు.

## నివాస పత్రాల జారీకి మళ్లీ ఓకే

### ప్రభుత్వం ఉత్తర్వులు జారీ

**విశాఖపట్నం, సెప్టెంబరు 16 ప్రభాతవార్త:** రెసిడెన్స్ సర్టిఫికెట్ల జారీని మళ్లీ పునరుద్దరిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బుధవారం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు తాజాగా తహశీల్దార్ల ద్వారా నివాస ధ్రువీకరణ పత్రాల (రెసిడెన్స్ సర్టిఫికేట్స్) జారీ ప్రక్రియను తక్షణమే పునరుద్ధరిస్తూ ఉత్తర్వులు (జీ.ఓ.ఎంఎస్ నం.592) జారీ చేసింది. ఉద్యోగాలు, విద్య, ఆధార్ నమోదు, ఓటరు జాబితా సవరణల కోసం ప్రజలకు నివాస ధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా మారడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. లోగడ నివాస పత్రాల జారీని నిలిపివేస్తూ 2015లో ఇచ్చిన ఉత్తర్వులను (జిఒ ఆర్‌టి నం. 581)ను రద్దు చేశారు. ఇకపై ప్రజలు తక్షణమే ఆధారాలతో తహశీల్దార్‌కు దరఖాస్తు చేసుకోవచ్చునని సూచించింది. ఆధారాలు లేని పక్షంలో స్థానిక విచారణ జరిపి తహశీల్దార్ సర్టిఫికెట్ మంజూరు చేయాలని తాజా జిఒ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

## ప్రముఖ కన్నడ నటుడు అనంత్‌నాగ్‌కు

# దాదాసాహెబ్ ఫాల్కే

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 16:** భారతీయ చలనచిత్ర రంగంలో అత్యున్నత పురస్కారం దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు 2024 సంవత్సరానికిగాను అధికారికంగా ప్రకటించారు. కన్నడ మూవీ ఇండస్ట్రీతో పాటు భారతీయ సినిమాకు చేసిన విశిష్టమైన సేవలను గుర్తించి, ప్రముఖ నటుడు అనంత్ నాగ్‌ను ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారానికి ఎంపిక చేసినట్లుగా కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. అనంత్ నాగ్ తన మొత్తం కెరీర్‌లో 300లకు పైగా సినిమాల్లో నటించి అందరి మన్ననలను పొందారు. కేవలం కన్నడలోనే కాకుండా వివిధ భాషల్లో విభిన్న పాత్రలు పోషిస్తూ, తన సహజమైన నటనతో దశాబ్దాలుగా ప్రేక్షకుల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. ఈనెల 22న గుజరాత్‌లోని కేవడియాలో జరిగే 72వ జాతీయ చలనచిత్ర అవార్డుల కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆ పురస్కారాన్ని అనంత్ నాగ్‌కు ప్రదానం చేయనున్నారు. దాదాసాహెబ్ ఫాల్కే అవార్డుకు ఎంపికైన అనుభవజ్ఞుడైన నటుడు అనంత్ నాగ్‌కు ప్రధాని నరేంద్ర మోదీ ప్రత్యేక అభినందనలు తెలిపారు. అనంత్ నాగ్ ఓ అసాధారణమైన నటుడని ఆయన అంకితభావం, అద్భుతమైన నటనా ప్రతిభ ఆయనను ఈ అత్యున్నత పురస్కారానికి అర్హుడిని చేశాయని కొనియాడారు. భారతీయ సినీ రంగానికి ఆయన అందించిన సేవలు ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని ప్రధాని ప్రశంసించారు. 1948 సెప్టెంబరు 4న జన్మించిన అనంత్ నాగ్ (అనంత్ నాగరకట్టె) తన సుదీర్ఘ కెరీర్‌లో 300కు పైగా చిత్రాల్లో నటించారు. వీటిలో 250కి పైగా కన్నడ చిత్రాలే ఉన్నాయి. ఆయన కన్నడతోపాటు హిందీ, తెలుగు, తమిళం, మరాఠీ, మలయాళం, ఇంగ్లీష్ భాషల్లోనూ తన నటనతో ప్రేక్షకులను మెప్పించారు. వెండితెరపైనే కాకుండా ఆర్‌కె నారాయణ్ కథల ఆధారంగా దూరదర్శన్‌లో ప్రసారమైన మాల్గుడి డేస్ సీరియల్‌తో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందారు. తన నటనకుగాను పదుసార్లు కర్ణాటక రాష్ట్ర చలనచిత్ర పురస్కారాలు అందుకున్న అనంత్ నాగ్‌కు గత యేడాది భారత ప్రభుత్వం దేశంలోనే మూడవ అత్యున్నత పౌర పురస్కారమైన పద్మభూషణ్‌తో సత్కరించింది. దశాబ్దాలుగా భారతీయ సినిమాకు ఆయన చేస్తున్న సేవలకు ఫాల్కే అవార్డు సరైన గౌరవమని సినీ ప్రముఖులు అభిప్రాయపడుతున్నారు.

# బిపిసిఎల్ రిఫైనరీ

>>నాటికి వచ్చే అవకాశం ఉందని బిపిసిఎల్ సిఎండి సిఎంకు తెలిపారు. ఇంజినీరింగ్ ఇండియా లిమిటెడ్ చేపట్టిన అధ్యయన నివేదిక వచ్చిన వెంటనే ఈ యేడాది అక్టోబరు నెలలోనే తుది పెట్టుబడి వ్యయం ఖరారు అవుతుందని వివరించారు. ఆ తదుపరి రిఫైనరీ నిర్మాణ పనుల్ని ప్రారంభిస్తామని స్పష్టం చేశారు.

**పెట్రో కెమికల్ పార్కు ఏర్పాటుపై సూచన**

ప్రాజెక్టులో భాగంగా రిఫైనరీ నుంచి యూరో6 ప్రమాణాలతో కూడిన ఇంధనం ఉత్పత్తి అవుతుందని బిపిసిఎల్ సిఎండి ముఖ్యమంత్రికి వివరించారు. మోటార్ స్పిరిట్, హైస్పీడ్ డీజిల్, ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ కలిపి సుమారు 5.4 మిలియన్ టన్నులు ఉత్పత్తి కానున్నట్టు తెలియచేశారు. ఇతర పెట్రోకెమికల్స్ ఉత్పత్తులు సుమారుగా 3.2 మిలియన్ టన్నులు ఉంటుందన్నారు. ఉప ఉత్పత్తులుగా హెచ్‌డిపిఇ, ఎల్‌డిపిఇ, ఎల్ఎల్‌డిపిఇ, పాలీప్రొపైలీన్, పాలీ విన్సైల్ క్లోరైడ్ వంటి బై ప్రోడక్ట్స్ కూడా వస్తాయని వివరించారు. బిపిసిఎల్ రిఫైనరీ నిర్మాణం కోసం అవసరమైన 6 వేల ఎకరాల భూమిలో 75 శాతాన్ని ఇప్పటికే అప్పగించామని ముఖ్యమంత్రి తెలిపారు. మిగిలిన భూమిని అక్టోబరు రెండో వారంలోగా అప్పగిస్తామన్నారు. ప్రాజెక్టుకు సంబంధించిన ప్రక్రియలను వేగవంతం చేసి వీలైనంత త్వరగా పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు బిపిసిఎల్ ప్రతినిధులను కోరారు. రిఫైనరీ సమీపంలో సుమారు 1,500 ఎకరాల్లో డౌన్‌స్ట్రీమ్ పెట్రోకెమికల్స్ పార్క్ ఏర్పాటుకు బిపిసిఎల్, ఎపిఐఐసి కలిసి ప్రణాళిక రూపొందించాలని సిఎం సూచించారు.

**భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తులు**

భారత్‌లో పట్టణీకరణ, తయారీ రంగం విస్తరణతో పెట్రోకెమికల్స్‌కు డిమాండ్ వేగంగా మారుతోందని సిఎం చంద్రబాబు వివరించారు. దేశ పెట్రోకెమికల్ ఇంటెన్సిటీ ఇండెక్స్ ప్రస్తుతం 5 శాతం నుంచి వచ్చే దశాబ్దంలో 15-20 శాతానికి పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని రిఫైనరీని నిర్మించాల్సిన అవసరం ఉందని సిఎం అభిప్రాయం వ్యక్తం చేశారు. ముడి చమురును కేవలం ఇంధనంగా వినియోగించకుండా ఇథిలీన్, ప్రొపైలీన్ వంటి రసాయన ముడి పదార్థాల ఉత్పత్తిని పెంచే విధంగా ఆధునిక రిఫైనరీల రూపకల్పన జరగాలని సిఎం సూచించారు. ప్రాథమిక పాలిమర్లకే పరిమితం కాకుండా అధునాతన మెటీరియల్ విభాగాల్లో పెరుగుతున్న డిమాండ్‌ను కూడా పరిగణనలోకి తీసుకోవాలని తెలిపారు. దేశంలో కెమికల్, పెట్రోకెమికల్ రంగం 2040 నాటికి 1 ట్రిలియన్ డాలర్లకు చేరుతుందని, ఆ అవసరాలను తీర్చే దిశగా బిపిసిఎల్ పనిచేస్తుందని సిఎండి సంజయ్ ఖన్నా తెలిపారు. సమావేశంలో బిపిసిఎల్ డైరెక్టర్ ఫైనాన్స్ విఆర్‌కె గుప్తా, ఎపి రిఫైనరీ ఇడి రాజీవ్, జిఎం రిటైల్ టి.చతుర్వేది, పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్ ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



బుధవారం కోవూరులో ఎన్టీఆర్ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి నారా లోకేష్

# ప్రైవేటు పాఠశాలలతో పోటీ పడాలి

## నెల్లూరులో ఆధునీకరించిన పాఠశాలలను ప్రారంభించిన మంత్రి లోకేష్

**నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 16 ప్రభాతవార్త:** కార్పోరేట్ హంగులతో నెల్లూరులో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారుతున్నాయి. విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో శిథిలావస్తలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలను సిఎస్ఆర్ నిధులతో అభివృద్ధి చేసి కార్పోరేట్ స్కూళ్లను తలపించేలా సకల సౌకర్యాలతో అందుబాటులోకి తీసుకువస్తున్నారు. నెల్లూరు నగరంలో మొత్తం 15 ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చే ప్రయత్నంలో భాగంగా ఇప్పటికే విఆర్‌సి స్కూల్‌ను ఆధునీకరించడం జరిగింది. ఈ నేపథ్యంలో బుధవారం నెల్లూరు పట్టణం స్టోన్ హౌస్ పేటలో ఆధునీకరించిన ఆర్ఎస్ఆర్ మున్సిపల్ కార్పోరేషన్ హైస్కూల్‌ను విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ముందుగా పాఠశాల ప్రాంగణానికి చేరుకున్న మంత్రి లోకేష్‌కు నెల్లూరు ఎంపి, విపిఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపక ఛైర్మన్ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆధునీకరించిన ఆర్ఎస్ఆర్ ప్రభుత్వ పాఠశాల భవనాలను రిబ్బన్ కట్ చేసి మంత్రి ప్రారంభించారు. అనంతరం పాఠశాల మొత్తం కలియతిరిగి తరగతి గదులు, ల్యాబ్‌లు, డైనింగ్ హాల్‌ను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు. మధ్యాహ్న భోజనం నాణ్యతపై ఆరాతీశారు. బాగా చదువుకుని తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని ఈ సందర్భంగా ఆకాంక్షి ంచారు.

ఆధునీకరించిన పాఠశాలను ప్రారంభించిన అనంతరం పాఠశాల పనితీరుపై పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కే.ప్రసాద్, ఇతర అధికారులతో మంత్రి సమీక్షి ంచారు. లెర్నింగ్ అవుట్ కమ్స్‌లో స్కూల్ వెనుకబడి ఉందని, ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. గతేడాది పదో తరగతిలో 60.19 శాతం ఉత్తీర్ణత సాధించారని, ఈ ఏడాది ఉత్తీర్ణత శాతం పెంపుపై దృష్టి సారించాలన్నారు. స్టూడెంట్ ఎన్‌రోల్‌మెంట్ కూడా తగ్గిందని, ప్రైవేటు పాఠశాలలతో పోటీ పడాల్సిన అవసరం ఉందని చెప్పారు. విద్యార్థుల హాజరు తక్కువగా ఉండటంపైనా మంత్రి ఆరా తీశారు.

**డిఎస్ఆర్ పాఠశాలను ప్రారంభించిన మంత్రి లోకేష్**

నెల్లూరు మూలాపేటలో ఆధునిక వసతులతో పునర్ నిర్మించిన డిఎస్ఆర్ (దేవిరెడ్డి శారద) ప్రభుత్వ ఉన్నత పాఠశాలను విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ప్రారంభించారు. దేవిరెడ్డి శారద ఛారిటబుల్ ట్రస్ట్ రూ.13.41 కోట్ల సిఎస్ఆర్ నిధులతో పాఠశాలను అభివృద్ధి చేయడం జరిగింది. ముందుగా పాఠశాల ప్రాంగణానికి చేరుకున్న మంత్రి లోకేష్‌కు దేవిరెడ్డి శారద ఛారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్, మేనేజింగ్ ట్రస్టీ డి.సుధాకర్ రెడ్డి, జాయింట్ మేనేజింగ్ ట్రస్టీ డి. ప్రభాకర్ రెడ్డి, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆధునీకరించిన డిఎస్ఆర్ గవర్నమెంట్ హైస్కూల్‌ను రిబ్బన్ కట్ చేసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని, దేవిరెడ్డి శారద విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం తరగతి గదులను పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడారు.

పాఠశాల భవనాలను ప్రారంభించిన అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు యు.పద్మలత, అధికారులతో మంత్రి సమీక్షించారు. విద్యార్థుల హాజరు తక్కువగా ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇందుకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. స్కూల్ లెర్నింగ్ అవుట్ కమ్స్ పై దృష్టిపెట్టాలని ఈ సందర్భంగా ఆదేశించారు. గతేడాది కంటే విద్యార్థుల ప్రవేశాలు పెరగడంపై హర్షం వ్యక్తం చేశారు. పదో తరగతి పరీక్షల్లో కూడా మంచి ఫలితాలు సాధించాలని ప్రశంసించారు. మధ్యాహ్న భోజనంపై ఉపాధ్యాయుల ఫీడ్ బ్యాక్ వందశాతం ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, రాజ్యసభ ఎంపి బీద మస్తాన్‌రావు, మంత్రి పి.నారాయణ, నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ పి.షరణి, ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

**కోవూరులో ఎన్టీఆర్ కాంస్య విగ్రహం ఆవిష్కరణ**

నెల్లూరు నుంచి కోవూరు చేరుకున్న మంత్రి లోకేష్‌కి నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు శాసనసభ్యులు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, యువ నాయకులు, డా.అర్జున్ రెడ్డితో కలిసి భారీ సంఖ్యలో కార్యకర్తలు, ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం అభిమానులు, కార్యకర్తల భారీ జనసందోహం నడుమ దారిపొడవునా ర్యాలీగా తరలివెళ్లి, ఎన్టీఆర్ కాంస్య విగ్రహాన్ని మంత్రి లోకేష్ ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన కేడర్ మీటింగ్‌లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు, నెల్లూరు జిల్లా టిడిపి అధ్యక్షులు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, జిల్లా ఇన్‌చార్జ్

# 10 మంది మావోయిస్టులకు ఉరిశిక్ష

## చత్తీస్‌గఢ్‌లో 2013 నాటి దాడి ఘటనలో ఎన్ఐఎ కోర్టు సంచలన తీర్పు

### నాటి దుర్ఘటనలో 29 మంది మృతి

**హైదరాబాద్, సెప్టెంబరు 16, ప్రభాతవార్త:** ఛత్తీస్‌ఘడ్‌లో బస్తర్ జిల్లా జీరం ఘాటిలో 2013 మే 25వ తేదీన కాంగ్రెస్ పార్టీ చేబట్టిన పరివర్తన్ యాత్ర కాన్వాయ్‌పై మావోయిస్టులు జరిపిన భీకర దాడికి సంబంధించి జగ్‌దల్‌పూర్‌లోని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) ప్రత్యేక కోర్టు పది మంది నక్సలైట్లకు ఉరిశిక్ష విధిస్తూ బుధవారం నాడు సంచల తీర్పును వెలువరించింది. దేశ వ్యాప్తంగా సంచలనం రేపిన జీరం ఘాటి ఘటనలో కాంగ్రెస్ సీనియర్ నాయకులతో పాటు సామాన్యులు మొత్తం 29 మంది చనిపోయారు. మాజీ కేంద్ర మంత్రి విద్యాచరణ్ శుక్లా, అప్పటి పిసిసి అధ్యక్షుడు నందకుమార్ పటేల్, నక్సలైట్లకు వ్యతిరేకంగా సల్వాజుడుం అనే సంస్థను స్థాపించి, గ్రామీణ యువకులకు ఆయుధాలు అందేలా చేసిన మహేంద్ర కర్మ, మాజీ ఎంఎల్ఎ ఉదయ్ ముదలియార్ తదితర ప్రముఖులు మరణించిన వారిలో వున్నారు. ఈ దాడితో ఛ త్తీస్‌ఘడ్‌లో అప్పట్లో కాంగ్రెస్ పార్టీ నాయకత్వం పూర్తిగా తుడిచి పెట్టుకు పోయింది. అప్పట్లో ఛత్తీస్‌ఘడ్‌లోని అనేక ప్రాంతాలలో నక్సలైట్ల ప్ర భావం తీవ్రంగా వుండేది. మావోయిస్టులు 200 మంది వరకు కాంగ్రెస్ పార్టీ నాయకులను లక్ష్యంగా చేసుకుని వారు ప్రయాణించిన మార్గంలో ముందుగానే మందు పాతరలు అమర్చారు. కాన్వాయ్ ఈ ప్రాంతానికి రాగానే వాటిని పేల్చారు. అనంతరం కాన్వాయ్‌లో వున్న వారిపై విచక్ష ణారహితంగా కాల్పులు జరిపారు. నక్సలైట్ల దాడిలో 29 మంది మరణించగా వంద మంది వరకు గాయపడ్డారు. గాయపడ్డవారిలో చాలా మంది ఏళ్ల తరబడి ఆసుపత్రుల్లో చికిత్స పొందారు. ఈ దాడి దరిమిలా సిఆర్‌పిఎఫ్ బలగాలు, రాష్ట్ర బలగాలు రంగంలో దిగి జీరం ఘాటి ప్రాంతాన్ని నిర్బంధించి కొన్ని నెలలపాటు కూంబింగ్ నిర్వహించాయి. ఈ సందర్భంగా పలుచోట్ల ఎదురు కాల్పులు జరిగాయి. ఇందులో నక్సలైట్లతోపాటు పోలీసులుకూడా ప్రాణాలు కోల్పోయారు. ఈ కేసును మొదట స్థానిక పోలీసులు విచారించగా ఆ తరువాత ఎన్ఐఎ విచారణ చేబట్టి ంది. జగ్‌దల్‌పూర్‌లో ఏర్పాటైన ఎన్ఐఎ కోర్టులో జీరం ఘాటి ఘటనకు సంబంధించి 13 ఏళ్లకు పైగా విచారణ జరిగింది. ఈ దాడికి సంబంధించి ఎన్ఐఎ పోలీసులు 20 మందికి పైగా మావోయిస్టులను నిందితులుగా చేర్చి వారిపై అభియోగాలు మోపారు. ఇందులో కొందరు మరణి ంచగా మరికొందరు అజ్ఞాతంలో వెళ్లారు. చివరగా దీనిపై బుధవారం నాడు ఎన్ఐఎ కోర్టు తీర్పు చెబుతూ పది మంది మావోయిస్టులను దోషు లుగా తేలుస్తూ వారికి ఉరిశిక్ష విధించింది. భారత శిక్షా స్మృతిలోని హత్య, కుట్ర సెక్షన్లతో పాటు చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం కింద ఎన్ఐఎ కోర్టు నక్సలైట్లకు ఉరిశిక్ష విధించింది. భారత రాజకీయ, భద్రతాపరమైన చరిత్రలో ఇది అతిపెద్ద దాడిగా పోలీసులు అభివర్ణించా రు. ఉరిశిక్ష పడ్డ మావోయిస్టులు ప్రమీల మోడియం, చైతు లేకం అలియాస్‌మున్నా, సుమిత్రా పునెం మోడియం, ముక్కా మాండవి, కోసా కవాసి, అయి తా మార్కం, మడకమి దేవా, జోగా మడ్కమి, టాంజామి సన్నా, మహాదేవ్‌లు వున్నారు. ఎన్ఐఎ కోర్టు తీర్పును ఛత్తీస్‌ఘడ్ సర్కారు స్వాగతించింది. ప్రజాస్వామ్య దేశంలో హింసకు తావులేదని పేర్కొంది. 13 ఏళ్ల తరువాతైనా బాధితులకు న్యాయం జరిగిందని, దోషులకు శిక్ష పడిందని ఆ రాష్ట్ర సర్కారు వెల్లడించింది.

## వారం - వర్జ్యం

17-09-2026, గురువారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
భాద్రపద మాసం, దక్షిణాయణం,
వర్ష ఋతువు, శుక్లపక్షం, ఉత్తర కార్తె,
తి.షష్ఠి ఉ.10.49, న.అనూరాధ రా.7.55
వ.రా.2.11 - రా.3.58
దు.ఉ.9.59 - ఉ.10.48
2) మ.2.52 - మ.3.41
రాహు మ.1.30-3.00, శుభ స. లేదు

## వార్తాఫలం

**మేషం :** నష్టం రావలసిన చోట నష్టం రాకపోవడం మీకు ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. శుభవార్తలను వింటారు.

**వృషభం :** టెండర్స్, కాంట్రాక్టర్స్ లభిస్తాయి. అవసరాలకు అనుకూలమైనంత ధనాన్ని కలిగి ఉంటారు.

**మిథునం :** వ్యాపారస్తులకు అనుకూలం. ఉద్యోగస్తులకు అనుకూలంగా ఉంటుంది. ఫోన్ సంభాషణలు అధికంగా సాగిస్తారు.

**కర్కాటకం :** మాతృవర్గీయుల నుండి సహాయ సహకారాలను అందుకుంటారు. బుద్ధిబలంతో వ్యవహరిస్తారు.

**సింహం :** అపరిష్కృతమైన సమస్యలకు గాను పరిష్కారమార్గాలు లభించే సూచనలు. సభలు, సమావేశాలకు హాజరవుతారు.

**కన్య :** మీకు రావలసిన ధనం కొంత మేరకు చేతికందుతుంది. లిఖితపూర్వక వ్యవహారాలను సాగిస్తారు.

**తుల :** ఒక వ్యక్తి పరిచయం మీకు ఉపకరిస్తుంది. ఇతరులకు మీరు ఇచ్చిన వాగ్దానాన్ని నిలుపుకుంటారు.

**వృశ్చికం :** సాంకేతిక రంగంలోని వారికి అనుకూలంగా ఉంటుంది. స్పెక్యులేషన్లకు ఉద్దేశ్యపూర్వకంగానే దూరంగా ఉంటారు.

**ధనుస్సు :** నత్త నడకన ఉన్న పనులలో వేగం కనపడుతుంది. అసహనాన్ని కలిగి ఉంటారు. సమన్యాయంతో వ్యవహరిస్తారు.

**మకరం :** ఆర్థికపరమైన వ్యవహారాలు ఆశించిన స్థాయిలో ఉంటాయి. ప్రచార సాధనాల వల్ల పరోక్షంగా లాభపడతారు.

**కుంభం :** ప్రైవేటు సంబంధమైన లీజులు లైసెన్సులు పొడిగింపబడతాయి. అందరి నుండి సలహాలు తీసుకుంటారు.

**మీనం :** లిఖిత పూర్వక వ్యవహారాలు జరుగవలసిన చోట మాటలతోనే సరిపుచ్చు కోవలసి వస్తుంది.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ఆధ్యాత్మికతకు ప్రపంచ స్థాయి నమూనాగా తిరుమల

## రాష్ట్రంలో 5 వేల శ్రీవారి ఆలయాల నిర్మాణం లక్ష్యం: సిఎం చంద్రబాబు

**తిరుమల, సెప్టెంబరు 16 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమలను పవిత్రమైన దివ్యక్షేత్రంగా, ఆధ్యాత్మికతకు ప్రపంచ స్థాయి నమూనాగా అభివృద్ధి చేయడమే లక్ష్ యంగా పనిచేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. తిరుమలలో భక్తులకు మెరుగైన అనుభూతిని అందించడంతో పాటు పర్యావరణ పరిరక్షణ, ఆధ్యాత్మికత, సేవాభావం, ఆధునిక సాంకేతికతను సమన్వయం చేస్తామని చెప్పారు. తిరుమల కొండల్లో 89.5 శాతం గ్రీన్ కవర్ ఉందని, దీన్ని మరింత పరిరక్షి ంచాల్సిన అవసరం ఉందన్నారు. బుధవారం తిరుమలలో పలు అభివృద్ధి కార్యక్రమాలను సిఎం ప్రారంభించారు. వైకుంఠం క్యూ కాంప్లెక్స్1 వద్ద ఏర్పాటు చేసిన పిలిగ్రిమ్స్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్, ఆధునీకరించిన ఎస్వీ మ్యూజియం, రిలయన్స్ ఫౌండేషన్, భారత్ బయోటెక్ సంస్థలు అందించిన 32 ఎలక్ట్రిక్ బస్సులను సిఎం జెండా ఊపి ప్రారంభించారు. వైకుంఠం క్యూ కాంప్లెక్స్ వద్ద ఏర్పాటు చేసిన పిలిగ్రిమ్స్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌లో శ్రీవారికి నిర్వహించే నిత్య కైంకర్యాలు, పూజా కార్యక్రమాలు, తిరుమలలోని వివిధ ప్రాంతాలను త్రీడీ సాంకేతికత ద్వారా భక్తులు వీక్షి ంచే అవకాశం కల్పించారు. 6 డివిఆర్ వర్చువల్ రియాలిటీ ద్వారా తిరుమల దర్శన అనుభూతిని ముఖ్యమంత్రి స్వయంగా పరిశీలించారు. గతంలో ఉన్న ఎస్వీ మ్యూజియాన్ని ఆధునీకరించి పునః ప్రారంభించారు. శ్రీవారి వైభవం, తిరుమల చరిత్ర, పురాణ గాథలు, శ్రీవారి పరిణయం తదితర అంశాలను భక్తులకు సులభంగా అర్థమయ్యే రీతిలో ప్రదర్శించేలా టిటిడి ఈ మ్యూజియాన్ని సిద్ధం చేసింది. టిసిఎస్ ట్రస్ట్ రూ.104 కోట్లతో మ్యూజియాన్ని అభివృద్ధి చేసింది. శ్రీకృష్ణదేవరాయలు సహా వివిధ రాజులు శ్రీవారికి సమర్పించిన ఆభరణాల నమూనాలు, వివిధ కాలాలకు చెందిన చారిత్రక వస్తువులు, స్వామివారికి అలంకరించే కిరీటాలు, ఆభరణాల త్రీడీ నమూనాలను మ్యూజియంలో ఏర్పాటు చేశారు. పానోరమిక్ స్క్రీన్‌పై ఎఐ వీడియో ద్వారా శ్రీవారి పరిణయ విశేషాలను ముఖ్యమంత్రి తిలకించారు. శ్రీవారి సేవకోసం, స్వామి వారిని కీర్తించేందుకు ఆనాటి సంగీత కారులు వినియోగించిన వాయిద్య పరికరాలను కూడా మ్యూజియంలో సిఎం ఆసక్తిగా పరిశీలించారు.

**తిరుమలలో భక్తుల కోసం 32 ఎలక్ట్రిక్ బస్సులు:**

తిరుమలలో భక్తుల రాకపోకలకు వీలుగా రిలయన్స్ ఫౌండేషన్, భారత్ బయోటెక్ సంస్థలు అందించిన 32 ఎలక్ట్రిక్ బస్సులను ముఖ్యమంత్రి చంద్రబాబు జెండా ఊపి ప్రారంభించారు. రిలయన్స్ ఈమొబిలిటీ సిఇఒ నితిన్ సేత్, భారత్ బయోటెక్ ఎండి సుచిత్రా ఎల్లా, మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, అనగాని సత్యప్రసాద్, టిటిడి ఛైర్మన్ బీఆర్ నాయుడు సహా టిటిడి సభ్యులతో కలిసి నారాయణ గిరి సర్కిల్ నుంచి ఎస్వీ మ్యూజియం వరకూ ఎలక్ట్రిక్ బస్సులో సిఎం ప్రయాణించారు. తిరుమలకు వచ్చే ప్రతి భక్తుడికీ బీమా సదుపాయం కల్పించాలని టిటిడి నిర్ణయించిందని సిఎం తెలిపారు.

ఎల్ఐసీతో కలిసి ఆధార్ ఆధారిత ఆన్‌లైన్ బీమా అమలు చేయనున్నట్లు చెప్పారు. దురదృష్టవశాత్తూ తిరుమలలో భక్తుడు మరణిస్తే రూ.2 లక్షల ఆర్థిక సాయం అందేలా ఈ బీమా వర్తిస్తుందని తెలిపారు. రాష్ట్రంలో 5 వేల దేవాలయాలను శ్రీవాణి ట్రస్టు ద్వారా నిర్మాణం చేపడతామన్నారు. మారిషస్, న్యూజిలాండ్ వంటి దేశాల్లో కూడా శ్రీవారి ఆలయాలు నిర్మించాలని కోరుతున్నారని, దీనిపై ఆలోచన చేస్తున్నామని తెలిపారు. శ్రీవారి సేవకులను విద్య, వైద్య రంగాల్లోనూ వినియోగించుకునేలా కార్యాచరణ చేపడుతున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. ఆరు అంశాల్లో తిరుమల తిరుపతి దేవస్థాన

# పిఎఫ్ వేతన పరిమితి రూ.25 వేలకు పెంపు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 16:** ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఇపిఎఫ్ఒ) పరిధిలోకి తప్పనిసరిగా వచ్చే ఉద్యోగుల కోసం వేతన పరిమితిని నెలకు రూ.15వేల నుండి రూ.25వేలకు పెంచడానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయం వల్ల అదనంగా 51 లక్షల మందికి పైగా ఉద్యోగులు తప్పనిసరి ఇపిఎఫ్ఒ పరిధిలోకి వస్తారని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ మీడియా సమావేశంలో వెల్లడించారు. ఈ నిర్ణయం ద్వారా ప్రావిడెంట్ ఫండ్ పొదుపు, ఎంప్లాయీస్ పెన్షన్ స్కీమ్ (ఇపిఎస్) కింద పెన్షన్ రక్షణ మరియు ఎంప్లాయీస్ డిపాజిట్ లింక్డ్ ఇన్సూరెన్స్ స్కీమ్ (ఇడిఎల్ఐ) కింద బీమా రక్షణ పొందే అవకాశం విస్తృతమవుతుందని తెలిపారు. ఈ పథకం సెప్టెంబర్ 17 నుండి అమలులోకి రానుంది. ప్రస్తుతం ఉన్న సుమారు రూ.10,250 కోట్ల వార్షిక బడ్జెట్ మద్దతుతో పోలిస్తే, దీనివల్ల ప్రభుత్వంపై పడే అదనపు వార్షిక భారం సుమారు రూ.11,339 కోట్లుగా అంచనా వేసింది. కొత్త వేతన పరిమితి ప్రకారం ఇపిఎస్‌కు ఉద్యోగులు, యజమానులు చేసే చందాలు కూడా పెరుగుతాయి. విలేకరుల సమావేశంలో కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ, ప్రభుత్వ సర్వే ప్రకారం ప్రైవేట్ సంస్థలలో సగటు జీతం రూ.23,000గా ఉందని తెలిపారు. "ఇపిఎఫ్ఒ తన పరిధిని విస్తరించడం వల్ల ఎక్కువ మంది కార్మికులు పెన్షన్, మరణ బీమా, వారి పొదుపుపై మెరుగైన వడ్డీ ప్రయోజనాలను పొందుతార్ణు అని వివరించారు. ఒక్కో ఉద్యోగికి యజమాని చేసే చందా రూ.600 పెరుగుతుందని మంత్రి తెలిపారు, అలాగే ఇపిఎస్‌కు ఉద్యోగులు చేసే చందా కూడా పెరుగుతుందని పేర్కొన్నారు. "సుమారు కోటి మంది కార్మికులు ఈ నిర్ణయం వల్ల ప్రయోజనం పొందుతార్ణు అని మంత్రి చెప్పారు.

# 2,050 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

>> ఫోర్స్ (ఎప్‌పిఎఫ్)లో 9, కమ్యూనికేషన్స్ విభాగంలో 50, పోలీస్ ట్రాన్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్ (పిటిఒ)లో 10 పోస్టులు ఉన్నాయి. అదేవిధంగా 1156 కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి కూడా నోటిఫికేషన్ ఉంది. ఇందులో సివిల్, ఆర్మ్‌డ్ రిజర్వ్, ఫైర్, జైళ్లతో పాటు ఇతర అనుబంధ విభాగాల పోస్టులు ఉన్నాయి. పోలీస్ కమ్యూనికేషన్స్ విభాగంలో 200 కానిస్టేబుల్ పోస్టులు ఉండగా, పోలీస్ ట్రాన్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్‌లో డ్రైవర్లు, మెకానిక్ పోస్టులు ఉన్నాయి.రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన, అగ్నిమాపక సేవల శాఖలో 158 ఫైర్‌మెన్ పోస్టులను భర్తీ చేయనున్నారు. అలాగే జైళ్లు, సంస్కరణ సేవల శాఖలో 171 వార్డర్ పోస్టులు ఉన్నాయి. వీటిలో పురుష, మహిళా వార్డర్ పోస్టులు ఉన్నాయి. ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీలో 43 సైంటిఫిక్ అసిస్టెంట్ పోస్టులు ఉన్నాయి. వీటిలో ఫిజికల్ విభాగంలో 10, కెమికల్ విభాగంలో 13, బయాలజీ/ సెరాలజీ విభాగంలో 20 పోస్టులు ఉన్నాయి. ఉద్యోగాలకు సంబంధించిన ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ, ప్రిలిమినరీ రాత పరీక్ష తేదీలను ఎపిఎస్ఎల్‌పిఆర్‌బి ప్రత్యేకంగా ప్రకటించనుంది. అభ్యర్థులు అధికారిక నోటిఫికేషన్ విడుదలైన తర్వాత పోస్టుల వారీగా విద్యార్హతలు, వయోపరిమితి, రిజర్వేషన్లు, ఎంపిక విధానం, పరీక్షా విధానం, దరఖాస్తు తేదీలను పూర్తిగా పరిశీలించి దరఖాస్తు చేసుకోవల్సి ఉంటుంది. త్వరలో రాత పరీక్ష తేదీల వివరాలను వెల్లడించనున్నారు.

# అర్హులందరికీ రుణాలందితేనే ఫలితం

• టిడ్కో గృహాలకు రుణాలపై కార్యాచరణ • రుణాల మొత్తం పెరిగినా లక్ష్యాలకు దూరంలో బ్యాంకులు

• సిఎం చంద్రబాబు అధ్యక్షతన 236వ ఎస్‌ఎల్‌బిసి సమావేశం • రుణాల చెల్లింపుల్లో ఎస్‌హెచ్‌జి మహిళలు ఆదర్శం • వచ్చే ఎస్‌ఎల్‌బిసి నుంచి బ్యాంకులు, జిల్లాలు, విభాగాల వారీగా సమీక్ష

**విజయవాడ, సెప్టెంబరు 16 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలోని అన్ని రంగాలను, అన్ని వర్గాలను బలోపేతం చేసేలా బ్యాంకులు రుణాలు ఇవ్వాలని, ప్రతి అర్హుడికి బ్యాంకింగ్ సేవలు చేరాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బ్యాంకర్లకు దిశానిర్దేశం చేశారు. సచివాలయంలో బుధవారం జరిగిన 236వ ఎస్‌ఎల్‌బిసి సమావేశంలో ముఖ్యమంత్రి పలు కీలక సూచనలు చేశారు. కొన్ని బ్యాంకులు రుణాలు ఇచ్చే విషయంలో చాలా వెనకబడి ఉన్నాయని, లక్ష్యాలను చేరుకుంటేనే ఎస్‌ఎల్‌బిసి సమావేశానికి అర్థం ఉంటుందని సిఎం అన్నారు. వ్యవసాయ రుణాలు సహా వివిధ వర్గాలకు బ్యాంకులు అందించే సేవలపై సిఎం సమీక్షి ంచారు. గత ఎస్‌ఎల్‌బిసి సమావేశంలో ప్రస్తావించిన అంశాలపై ఏ మేరకు చర్యలు తీసుకున్నారని బ్యాంకర్లను అడిగి తెలుసుకున్నారు. మొత్తం 13 అంశాలకు గానూ 9 అంశాలపై చర్యలు తీసుకున్నామని బ్యాంకర్లు తెలిపారు. గత ఎస్‌ఎల్‌బిసి సమావేశంలో ప్రస్తావనకు వచ్చిన అంశాలను, లక్ష్యాలను ఇంకా చేరుకోకపోవడం సరికాదని సిఎం అన్నారు. ఎంఎస్‌ఎంఇలకు రుణాల మొత్తం గతం కన్నా ఈసారి పెరిగినప్పటికీ ఆశించిన స్థాయిలో రుణాల మంజూరు జరగలేదన్నారు.

**కౌలు రైతులకు రుణాలపై దృష్టి పెట్టండి:** సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ 'పిఎం సూర్యఘర్‌లో దేశంలోనే ముందు స్థానంలో రాష్ట్రాన్ని నిలపాలని భావిస్తున్నాం... బ్యాంకులు పెద్దఎత్తున రుణాలు ఇస్తేనే ఇది సాధ్యమవుతుంది. రాష్ట్ర ఆర్థిక వృద్ధి 15 శాతం సాధించాలని లక్ష్యం పెట్టుకున్నప్పటికీ ఎల్‌నినో కారణంగా ఇబ్బందికర పరిస్థితి తలెత్తింది.. ప్రతికూలతలు అధిగమించేందుకు కృషి చేస్తున్నాం. కౌలు రైతులకు రుణాలు సమృద్ధిగా అందించేలా బ్యాంకులు ముందుకు రావాలి. రుణాల చెల్లింపుల్లో స్వయం సహాయక సంఘాల మహిళలు ఆదర్శంగా నిలుస్తున్నారు.. దేశంలోనే నెంబర్1 స్థానంలో నిలిచారు. రుణాలు తీసుకున్న వారిలో 99శాతానికి పైగా మహిళలు రుణాలను సమయానికే చెల్లించేస్తున్నారు.. కేవలం 0.67 శాతం మంది మహిళలు మాత్రమే రుణాల చెల్లింపుల్లో వెనకబడ్డారు. వీరి నుంచి రుణాల 100 శాతం రికవరీ సాధించేందుకు వన్ టైమ్ సెటిల్మెంట్ విధానం గురించి బ్యాంకులు ఆలోచన చేయాలి. అలాగే, టిడ్కో గృహాలకు రుణాలు ఇచ్చేందుకు కార్యాచరణ త్వరితగతిన అమలులోకి తీసుకురావాలి.. సైబర్ మోసాలపై అప్రమత్తత అవసరం. డిజిపి సైబర్ సెక్యూరిటీ సెల్‌తో సమన్వయం జరగాలి. రాష్ట్రవ్యాప్తంగా సైబర్ ఫ్రాడ్-ఫైనాన్షియల్ లిటరసీ అవగాహన కార్యక్రమాలపై దృష్టి పెట్టాలి. నాలా చట్టం రద్దు చేసినందున నాలా పేరుతో రుణాలు ఇవ్వకుండా ఎవరినీ ఇబ్బందులకు గురిచేయవద్దు. అధికారులకు దిశానిర్దేశం చేశారు.

**236వ ఎస్‌ఎల్‌బిసి సమావేశంలో ముఖ్యాంశాలు:** ఆంధ్రప్రదేశ్‌లో బ్యాంకింగ్‌లో రుణాల వేగం పెరిగింది. 2026 జూన్ నాటికి రూ.10.28 లక్షల కోట్లకు మొత్తం అడ్వాన్సులు చేరాయి. వ్యవసాయ రంగానికి భారీగా రుణ మద్దతు లభించింది. జూన్ 2026 నాటికి వ్యవసాయ రుణాలు రూ.3.98 లక్షల కోట్లుగా ఉన్నాయి. ఇది గతేడాది కన్నా ఎక్కువ. అటు ఎంఎస్‌ఎంఈలకు సంబంధించి 2026-27 ఆర్థిక సంవత్సరం జూన్ వరకు తొలి త్రైమాసికంలో 2.33 లక్షల ఎంఎస్‌ఎంఇలకు రూ.63,686 కోట్ల రుణాల పంపిణీ జరిగింది. అటు పిఎం సూర్య ఘర్‌కు సెప్టెంబర్ 10 నాటికి 1,57,703 దరఖాస్తులు రాగా రూ.3,081 కోట్ల రుణాల మంజూరు చేశారు. మహిళా స్వయం సహాయక సంఘాల రుణాలపై అన్ని బ్యాంకుల్లో సర్వీస్ ఛార్జీల నుంచి పూర్తి స్థాయి మినహాయింపు ఇచ్చాయి. ఎస్‌హెచ్‌జిలకు సెప్టెంబర్ 10 నాటికి మొత్తం రూ.18,621 కోట్ల రుణాల పంపిణీ జరిగింది. పిఎం ముద్ర రుణాల్లో భారీ పురోగతి కనిపించింది. సెప్టెంబర్ 10 నాటికి 4,48,562 దరఖాస్తులకు రూ.13,757 కోట్ల రుణాలను బ్యాంకులు మంజూరు చేశాయి. మరోవైపు సమీక్షలో రాజధాని అమరావతి ఫైనాన్సియల్ హబ్‌లో పలు బ్యాంక్ కార్యాలయాల నిర్మాణాల పురోగతిని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. మరింత వేగంగా నిర్మాణాలు పూర్తిచేయడంపై బ్యాంకులు దృష్టి పెట్టాలని ఈ సందర్భంగా సిఎం సూచించారు. అలాగే ఇకపై ఎస్‌ఎల్‌బిసి సమావేశాలను బ్యాంకులు, జిల్లాలు, విభాగాల వారీగా ఫలితాలు విశ్లేషించిన తర్వాతే దానిపై సమీక్షి ంచాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. ఈ సమావేశంలో మంత్రులు పయ్యావుల కేశవ్, అచ్చెన్నాయుడు, కొండపల్లి శ్రీనివాస్, బ్యాంకింగ్



స్వయంశక్తి సంఘాల మహిళలకు స్త్రీ నిధి చెక్కులను అందజేస్తున్న సిఎం చంద్రబాబు

## ఆయిల్‌పామ్ తోటలకు రాయితీ

• వంటనూనెల దిగుమతి భారం తగ్గాలంటే సాగు విస్తరణ అవసరం: మంత్రి పార్థసారథి



**ఏలూరు, సెప్టెంబరు 16 ప్రభాతవార్త:** ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు దీర్ఘకాలికంగా స్థిరమైన ఆదాయం లభిస్తుందని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఆగిరిపల్లి మండలం వడ్లమాను గ్రామంలో నిర్వహించిన మెగా ఆయిల్‌పామ్ ప్లాంటేషన్ కార్యక్రమంలో మంత్రి పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారధి మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో 52 వేల మంది రైతులు 1.60 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నారని తెలిపారు. 2024- 25, 2025 - 26 సంవత్సరాల్లో 22,227 మంది రైతులకు 53,600 ఎకరాల్లో సాగు విస్తరణకు రూ.34.24 కోట్ల రాయితీ మంజూరు చేసినట్లు వెల్లడించారు. హెక్టారుకు నాలుగేళ్లలో రూ.71 వేల వరకు సబ్సిడీ అందిస్తున్నామని తెలిపారు. మొక్కలు నాటిన నాలుగో ఏడాది నుంచి దిగుబడి ప్రారంభమై 30 ఏళ్ల వరకు ఆదాయం పొందవచ్చన్నారు. దేశంలో వంటనూనెల దిగుమతి భారం తగ్గించేందుకు ఆయిల్‌పామ్ సాగు విస్తరణ అవసరమని, రైతులు వాణిజ్య పంటల సాగుపై దృష్టి సారించాలని కోరారు. నాణ్యమైన మొక్కలు, సాంకేతిక సహకారం, మార్కెటింగ్ సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, జిల్లా ఉద్యాన శాఖ అధికారి కె. షాజానాయక్, వ్యవసాయ శాఖ అధికారి ఎస్.కె. హబీబ్ భాషా, శాస్త్రవేత్త డా. కె. రామచంద్రుడు, కంపెనీల ప్రతినిధులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ స్థాయి 'రెడ్ బుక్ పాలన్న

• వైసిపి అధినేత వైఎస్ జగన్ తీవ్ర ఆరోపణలు



**విజయవాడ, సెప్టెంబరు 16 ప్రభాతవార్త ప్రతినిధి:** చంద్రబాబు హయాంలో 'రెడ్ బుక్ పాలన్న అంతర్జాతీయ స్థాయికి చేరిందని వైసిపి అధినేత వైఎస్ జగన్ ఆరోపించారు. ఇప్పుడు ఏకంగా ఆంధ్రప్రదేశ్ పోలీసులే ఎఫ్‌బిఐగా అవతారం ఎత్తారని, ఇది నకిలీ గుర్తింపు మాత్రమే కాదు, ప్రజాస్వామ్యానికి నిజమైన ముప్పు కూడా అని జగన్ విమర్శించారు. "చంద్రబాబు గారూ, ఇది నిజమైన పోలీసింగ్ విధానమా లేక రాజకీయ కక్షసాధింపు కోసం ప్రభుత్వం చేస్తున్న మోసమా? అని ప్రశ్నించారు. ఎక్స్ వేదికగా ఉన్న పోస్టులను తొలగించాలని కోరేటప్పుడు, మీ పోలీసు యంత్రాంగం తమను తాము అమెరికాకు చెందిన ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బిఐ)గా చెప్పుకోవడం అత్యంత హేయమైన చర్య అన్నారు. ఇది మన రాష్ట్రం, దేశం ప్రతిష్టను దిగజార్చేలా ఉందన్నారు. పోస్టులను తొలగించాలన్న అభ్యర్థన ఎఫ్‌బిఐ నుండి కాకుండా, అధికారిక ఆంధ్రప్రదేశ్ పోలీసు ఈమెయిల్ అడ్రస్ నుండే వచ్చిందని ఎక్స్ ధ్రువీకరించిందని పేర్కొన్నారు. అయినా ఆ అధికారి పంపిన సంస్థ పేరుగా ఎఫ్‌బిఐ అని పేర్కొన్నారన్నారు. ఈ తొలగింపు అభ్యర్థనను ఎవరు ఆదేశించారు? ఎఫ్‌బిఐ గుర్తింపును ఎందుకు దుర్వినియోగం చేశారు? మీ ప్రభుత్వంపై ప్రశ్నలు సంధిస్తున్న గొంతులను అణచివేయడానికి ఎక్స్ సంస్థను తప్పుదోవ పట్టించడానికి ఇది ఉద్దేశపూర్వకంగా చేసిన ప్రయత్నమా? అని ప్రశ్నించారు. నెరవేరని సూపర్ సిక్స్, సూపర్ సెవెన్‌హామీలు, డిఎస్సీ స్కాం, అమరావతి దోపిడీ, రాష్ట్ర అప్పులు, పాలనా వైఫల్యాలు, వేధింపులు వంటి అంశాలే ఇందుకు కారణమన్నారు. పోలీసు యూనిఫాం అనేది చట్టాన్ని రక్షించడానికి ఉద్దేశించినదని, మీ రాజకీయ సెన్సార్‌షిప్‌ను అమలు చేయడానికి కాదని జగన్ వ్యాఖ్యానించారు.

## నేడు ఏలూరులో అధికార లాంఛనాలతో

# ఆళ్ల నాని అంత్యక్రియలు

• హాజరుకానున్న మంత్రి నారా లోకేష్


ఆళ్ల నాని పార్థివదేహం వద్ద నివాళి అర్పిస్తున్న మాజీ మంత్రి పేర్ని నాని

**ఏలూరు, సెప్టెంబరు 16 ప్రభాతవార్త:** గుండెపోటుతో విశాఖపట్నంలో కన్నుమూసిన మాజీ ఉప ముఖ్యమంత్రి, మాజీ ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని పార్థివదేహాన్ని మంగళవారం రాత్రి ఏలూరులోని శ్రీరామ్‌నగర్‌లో ఉన్న ఆయన నివాసానికి తీసుకువచ్చారు. నాని మృతితో విషాదంలో మునిగిన కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు, పార్థివదేహానికి నివాళి అర్పించేందుకు రాత్రి నుంచే రాజకీయ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

**పలువురు ప్రముఖుల నివాళి:** మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని), ఏలూరు ఎంపి పుట్టా మహేష్‌కుమార్, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి, మాజీ కార్పొరేషన్ చైర్మన్ నూర్జహాన్ పెదబాబు తదితరులు నాని పార్థివదేహానికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా నానితో తమకున్న అనుబంధాన్ని, ఆయన ప్రజా జీవితంలో చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు.

**ఇంటి సమీపంలో అంత్యక్రియలకు ఏర్పాట్లు:** గురువారం ఉదయం 10.41 గంటలకు శ్రీరామ్‌నగర్‌లోని ఆయన ఇంటికి సమీపంలో ఉన్న ఖాళీ స్థలంలో అంత్యక్రియలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు జరిగేలా ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి ఆధ్వర్యంలో ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. అధికార యంత్రాంగం కూడా కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను పర్యవేక్షి స్తోంది.

**హాజరుకానున్న మంత్రి నారా లోకేష్:** తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గురువారం ఉదయం 10 గంటలకు ఏలూరు చేరుకుని ఆళ్ల నాని అంత్యక్రియల్లో పాల్గొననున్నారు. రాష్ట్రస్థాయి టిడిపి నాయకులు పలువురు హాజరయ్యే అవకాశం ఉంది.

# సిక్కోలు యువకులను క్షేమంగా రప్పిస్తాం

• టూరిస్ట్ వీసాపై వెళ్లి మలేసియాలో పోలీసులకు చిక్కిన నలుగురు సిక్కోలు యువకులు

• ఈ నెల 17న కోర్టులో హాజరు... అనంతరం స్వస్థలాలకు రప్పించేందుకు ఏర్పాట్లు

• మలేసియా ఎంబసితో నిరంతర సంప్రదింపులు: కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు



**శ్రీకాకుళం, సెప్టెంబరు 16 ప్రభాతవార్త:** ఉపాధి కోసం మలేషియాకు వెళ్లి అక్కడి పోలీసుల అదుపులోకి వెళ్లి కోర్టు విచారణను ఎదుర్కొంటున్న శ్రీకాకుళం జిల్లా యువకులను స్వస్థలాలకు సురక్షితంగా తీసుకురావడానికి కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్ని చర్యలు చేపడుతున్నారు. శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు, సోంపేట మండలాలకు చెందిన నలుగురు యువకులు, చొక్కరు సాయి కుమార్, లండ తరుణ్ కుమార్, చీకటి సాయి వంశీతో పాటు గిరి ఉపాధి కోసం టూరిస్ట్ వీసాపై మలేషియాకు వెళ్లారు. అయితే అక్కడ ఉద్యోగం చేస్తున్న సమయంలో కొద్ది రోజుల క్రితం మలేషియా పోలీసులు వారిని రైలులో గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. టూరిస్ట్ వీసాపై మలేషియాలో ఉద్యోగం ఎలా చేస్తారంటూ ప్రశ్నించిన పోలీసులు, అనంతరం వారిని అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయం కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు దృష్టికి చేరడంతో, బాధిత యువకుల కుటుంబ సభ్యులకు అండగా నిలిచారు. వారిని సురక్షితంగా స్వస్థలాలకు తీసుకురావడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ క్రమంలో భారత విదేశాంగ శాఖ ద్వారా మలేషియాలోని భారత ఎంబసీతో నిరంతర సంప్రదింపులు జరుపుతూ, నలుగురు యువకుల పరిస్థితిపై ఎప్పటికప్పుడు వివరాలు తెలుసుకుంటున్నారు. ఈ నెల 17వ తేదీన జరగనున్న కోర్టు విచారణ అనంతరం యువకులను స్వస్థలాలకు తీసుకురావడానికి అవసరమైన ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. వీరికి ఏజెంట్‌గా వ్యవహరించిన భీమవరం ప్రాంతానికి చెందిన వ్యక్తిని ఈ వ్యవహారంలో సమన్వయం చేసుకుంటూ త్వరితగతిన బాధితులు స్వస్థలాలకు చేరేలా ప్రయత్నాలు చేస్తున్నారు. తమను స్వస్థలాలకు తీసుకురావడానికి కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు చేస్తున్న ప్రయత్నాలపై బాధిత యువకులు, వారి కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. తమకు అండగా నిలిచి, మలేషియా అధికారులతో సమన్వయం చేస్తూ సహాయం అందిస్తున్న రామ్మోహన్ నాయుడుకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

**ఉపాధి కోసం విదేశాలకు వెళ్లే వారు అప్రమత్తంగా ఉండాలి:** ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలు, విదేశాలకు వెళ్లే సమయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు సూచించారు. ముఖ్యంగా టూరిస్ట్ వీసాతో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ చెప్పే వ్యక్తులను నమ్మవద్దని, వీసా నిబంధనలను పూర్తిగా తెలుసుకున్న తర్వాతే విదేశాలకు వెళ్లాలని కోరారు. అధిక జీతాలు, తక్కువ సమయంలో మంచి ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ జరిగే మోసాలకు గురికావద్దని, సంబంధిత వీసా, ఉద్యోగ అనుమతులు, సంస్థ వివరాలను పూర్తిగా పరిశీలించిన తర్వాతే ప్రయాణం చేయాలని హితవు పలికారు. విదేశాల్లో ఉపాధి అవకాశాల పేరుతో మోసపోకుండా యువత, వారి కుటుంబ సభ్యులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కేంద్ర మంత్రి సూచించారు. మలేషియాలో చిక్కుకున్న సిక్కోలు వాసుల క్షేమ సమాచారం కోసం +60 12602 0360 నంబర్‌కు సంప్రదించవచ్చని త్వరలోనే వారిని స్వస్థలాలకు చేరుస్తామని హామీ ఇచ్చారు.

# ఓటుకు నోటు కేసుపై సుప్రీంలో విచారణ

• దీనిపై విచారణ జరిపే పరిధి ఏసిబికి లేదన్న పిటిషనర్ల తరపు లాయర్లు

• విచారణ తేదీని త్వరలోనే నిర్ణయిస్తామన్న త్రిసభ్య ధర్మాసనం

**హైదరాబాద్, సెప్టెంబరు16 ప్రభాతవార్త:** తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన ఓటుకు నోటు కేసుపై అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో బుధవారం విచారణ జరిగింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య వేర్వేరుగా దాఖలు చేసిన పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం (జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనా) విచారణ జరిపింది. తమపై నమోదైన అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) కేసు చట్టపరంగా చెల్లదని పిటిషనర్లు పేర్కొన్నారు. ఈ వ్యవహారం ముమ్మాటికీ ప్రజాప్రాతినిధ్య/ ఎన్నికల నిబంధనలకు సంబంధించిందని, దీనిపై దర్యాప్తు చేసే అధికారిక పరిధి ఏసీబీకి లేదని స్పష్టం చేశారు.

గతంలో ఈ కేసును సమగ్రంగా విచారించిన ధర్మాసనంలోని ఒక న్యాయమూర్తి పదవీ విరమణ చేయడంతో, ప్రస్తుత నూతన త్రిసభ్య ధర్మాసనం విచారణను మొదటి నుంచి చేపట్టింది. ఇరుపక్షాల ప్రాథమిక వాదనలను విన్న ధర్మాసనం, తదుపరి తుది విచారణ తేదీని త్వరలోనే సుప్రీంకోర్టు రిజిస్ట్రీ ద్వారా ఖరారు చేయనున్నట్లు వెల్లడించింది.

## జర్నలిస్టు అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

**విజయవాడ, సెప్టెంబరు 16 ప్రభాతవార్త ప్రతినిధి:** జర్నలిజం రంగంలో విశేష సేవలందిస్తూ, వృత్తిపరమైన ప్రతిభను కనబరిచిన పాత్రికేయులను ప్రోత్సహించి, వారి సేవలను గుర్తించి గౌరవించేందుకు 2025 సంవత్సరానికి 12 విభాగాల్లో ఉత్తమ జర్నలిస్టు అవార్డులు అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ అవార్డులకు అర్హులైన వారిని ఎంపిక చేసేందుకు ఆయా విభాగాలకు చెందిన జర్నలిస్టుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు రాష్ట్ర సమాచార పౌరసంబంధాల శాఖ సంచాలకులు కె.ఎస్. విశ్వనాథన్ ఒక ప్రకటనలో తెలిపారు..అర్హులైన జర్నలిస్టులు తమ దరఖాస్తులను సెప్టెంబరు 28వ తేదీ సాయంత్రం 5.00 గంటల్లోగా డైరెక్టర్, సమాచార పౌరసంబంధాల శాఖ, 2వ అంతస్తు, ఎన్టీఆర్ పరిపాలన భవనం, పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్, విజయవాడ - 520013 చిరునామాకు పంపించాలని ఆయన సూచించారు.

## వివేకా హత్య కేసు నిందితులకు సిబిఐ కోర్టులో చుక్కెదురు

**అమరావతి, సెప్టెంబరు 16 ప్రభాతవార్త ప్రతినిధి:** మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో నిందితులకు నాంపల్లి సిబిఐ కోర్టులో చుక్కెదురైంది. ఈ హత్య కేసు విచారణలో నాంపల్లిలోని ప్రత్యేక సిబిఐ కోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. తమపై నమోదైన తీవ్ర అభియోగాల నుంచి విముక్తి కల్పించాలని కోరుతూ ప్రధాన నిందితులు దాఖలు చేసిన డిశ్చార్జ్ పిటిషన్లను న్యాయస్థానం నిర్ద్వంద్వంగా కొట్టివేసింది. ఎ1 గంగిరెడ్డి, ఎ3 ఉమాశంకర్‌రెడ్డి, ఎ6 ఉదయ్ డిశ్చార్జ్ పిటిషన్లను నాంపల్లి సిబిఐ కోర్టు తిరస్కరించింది. పిటిషన్లకు విచారణ అర్హత లేదని నాంపల్లి సిబిఐ కోర్టు పేర్కొంది.

## ఫోరెన్సిక్ సేవలు మరింత బలోపేతం

• 26 మొబైల్ ఫోరెన్సిక్ వాహనాలు ప్రారంభించిన డిజిపి హరీష్‌కుమార్


పచ్చజెండా ఊపి మొబైల్ ఫోరెన్సిక్ వాహనాలు ప్రారంభిస్తున్న డిజిపి

**విజయవాడ, సెప్టెంబరు 16 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రవ్యాప్తంగా నేరస్థలాల్లో శాస్త్రీయ దర్యాప్తును బలోపేతం చేయడం, ఫోరెన్సిక్ ఆధారాల సేకరణను మరింత సమర్థవంతంగా నిర్వహించడం లక్ష్యంగా ఏపీ పోలీసు కార్యచరణ చేపట్టింది. ఇందులో భాగంగా డిజిపి హరీష్ కుమార్ గుప్తా బుధవారం 6వ ఎపిఎస్పీ బెటాలియన్ గ్రౌండ్స్‌లో 26 జిల్లాల మొబైల్ ఫోరెన్సిక్ వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమం ఆంధ్రప్రదేశ్‌లో ఫోరెన్సిక్ సేవల విస్తరణ, వికేంద్రీకరణలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది. ఈ సందర్భంగా డిజిపి హరీష్ కుమార్ గుప్తా మాట్లాడుతూ, ఆధునిక పోలీసింగ్‌లో శాస్త్రీయ, సాంకేతిక ఆధారిత దర్యాప్తుపై ఆధారపడటం రోజురోజుకూ పెరుగుతోందని, నేర స్థలంలో సకాలంలో ఫోరెన్సిక్ సహాయం అందించడం ద్వారా విశ్వసనీయమైన ఆధారాలను సేకరించడం అత్యంత కీలకమని తెలిపారు. 26 మొబైల్ ఫోరెన్సిక్ వాహనాల ద్వారా ఫోరెన్సిక్ సేవల లభ్యత పెరగడంతో పాటు స్పందన సమయం తగ్గుతుందని, దర్యాప్తు అధికారులు దర్యాప్తు ప్రారంభ దశలోనే శాస్త్రీయ ఆధారాలను సేకరించేందుకు ఇవి ఎంతగానో సహాయపడతాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిజి రవిశంకర్ అయ్యనార్, (సిఐడి చీఫ్), డిజి ఆర్కే మీనా, అదనపు డిజిపి (శాంతిభద్రతలు) ఎన్. మధుసూదన రెడ్డి, ఐజిలు పి.హెచ్.డి. రామకృష్ణ, డైరెక్టర్, ఎపిఎఫ్‌ఎస్‌ఎల్, తదితర సీనియర్ పోలీసు అధికారులు, ఎఫ్‌ఎస్‌ఎల్ జాయింట్ డైరెక్టర్లు, అసిస్టెంట్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

## ముగ్గురు జీవిత ఖైదీలకు క్షమాభిక్ష

**విజయవాడ, సెప్టెంబరు 16 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలోని ముగ్గురు జీవిత ఖైదీలకు క్షమాభిక్ష ప్రసాదిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. నిబంధనల ప్రకారం అర్హత సాధించిన వీరిని ముందస్తుగా విడుదల చేస్తూ హోంశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. వీరిలో రాజమండ్రి జైలు నుంచి మంద శంకర్రావు, కడప నుంచి బోయ చంద్రశేఖర్, విశాఖ జైలు నుంచి లాలం రాము షరతులతో కూడిన విడుదలకు ఎంపికయ్యారు.



# కమ్ముకొస్తున్న కరువు

• ఆకలి కేకలతో అలమటిస్తున్న పేదలు

• రైతన్న కళ్లల్లో కన్నీళ్లు • సర్కారు చేయూత కోసం ఎదురుచూపులు



**పొందూరు (శ్రీకాకుళం జిల్లా), సెప్టెంబరు 17 ప్రభాతవార్త:** ఉత్తరాంధ్ర జిల్లాలో కరువు కాటకాలు కమ్ముకొస్తున్నాయి. సెప్టెంబరు నెల వరకు పంట భూములు దమ్ములు శాతం పూర్తిగా పడిపోయింది. ఎన్నడూ లేని విధంగా ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. పంట పొలాల్లో వేసిన వరి ఆకులు ఎండకు ఎండిపోయి పనికి రాకుండా పోయింది. ఏద వేసిన రైతులకు శోద మిగిల్చింది. పంట భూముల్లో దుక్కులు రెండు పర్యాయాలు ఇన్నమోరవేసి వరి విత్తనాలు జల్లిన సొమ్మంతా మట్టి పాలైనాయి. భూమిని నమ్ముకున్న రైతు మట్టి పాలయ్యారు. వరుణుడు కరుణ లేక అప్పుల పాలవుతున్నారు. ఈ యేడాది పంట చేతికి అందకా? అప్పులేమో తీరక, పస్తులేమో తప్పదాయే అంటూ రైతుల కళ్లల్లో కన్నీళ్లు, శ్రామిక కూలీల్లో ఆకలి కేకలు అలమటించే తరుణం ఆసన్నమైందని భయభ్రాంతులు చెందుతున్నారు. వరి నాట్లకు కార్తీ దాటినా కనికరం చూపించని వర్షం? పంటలు లేక అప్పులు పాలైనా? మమకారం లేని అప్పులోడి దౌర్జన్యం, రైతు కళ్లల్లో భయం వెంటాడుతుంది. మరోవైపు బ్యాంకు లోను కట్టకపోతే కస్సు బుస్సు లాడుతూ వేధింపులు తప్పవాయే, "ఏం తినేటట్లు లేదు? ఏం కొనేటట్టు లేదు? నాగులో నాగన్న అనే పాట గుర్తుకొస్తుందంటూ రైతులు కంటతడి పెడుతున్నారు.

ఒకవైపు కుమ్ముకొస్తున్న కరువు రక్కసి కోరలు, మరోవైపు నింగినంటుతున్న అధిక ధరలతో రైతు, కూలీ, శ్రామికులే బలైపోతున్నారు. ఇల్లాలి తాళి ఇంటికి కరువైంది. పిల్లలు చదువులు కష్టమైపోతుంది. పెట్టుబడులు లేక ఆరుతడి పంటలకు ఎరువులు, క్రిమిసంహారక మందులు కొనలేక రైతు జీవితాలు ఆవిరై పోతున్నాయి. రెక్కలు ముక్కలు చేసుకుని పొలం పనులు ముగించి పొద్దుపోయిన తరువాత ఆకలి ఆగ్రహంతో ఈసురోమని ఇంటికొస్తే, పిల్లల స్కూలు ఫీజులు పీక్కు తింటున్నాయి. కల్లాల్లో పాడి పశువులు అంబోమంటూ ఆకలి అరుపులు వినిపిస్తు న్నాయి. రైతన్నలు నల్లటి మేఘాలు చూసి మురిసిపోవడమే తప్పా? ఏ చెరువు బంధలో చూసినా చుక్క నీరు లేక మూగజీవులు ఈసురో మంటున్నాయి. రైతన్నకు ఎదురవుతున్న కష్టాలు చూసి చలించి పోతున్నాడు. గద్దెలెక్కిన పెద్దలు రైతు రాజ్యంగా పొగిడి, పొగిడి ఉబ్బించి ఊపిరి పీకేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తు న్నాయి. ఉత్తరాంధ్రలో తాగునీటికి కరువు, సాగునీటికీ తీవ్ర కరువు ఏర్పడింది. వీటిని అధిగ మించే దశగా సర్కార్ నత్తనడకలో సాగుతున్న ప్రాజెక్టులు, వేగవంతంగా పూర్తి చేస్తే పొలాల్లో పచ్చని పంటలు పండి రైతు కళ్ళల్లో ఆనందం నింపడమే కాకుండా? తాగునీటికి కొదవ లేకుండా ఉంటుందని రైతు, కూలీ, శ్రామిక వర్గాలు, అభ్యుదయవాదులు కోరుతున్నారు.

17-9pg4:17-9pg4.qxd 9/17/2026 12:27 AM Page 1



వార్త

మనల్ని గురించిన మన అభిప్రాయాల కన్నా, మన శత్రువుల భావాలే యదార్థానికి దగ్గరగా ఉంటాయి.

న- రోష్ షోకాల్డ్

# 'ట్రామా'లో ఔషధ నియంత్రణ

రోగి శరీరాన్ని డాక్టర్లు పరిశీలించే లోగానే కొంత మంది జనం మందుల షాపుల్లో దొరికే వైద్యానికి అలవాటు పడ్డారు. మరికొంత మందైతే సొంత వైద్యానికి తాపత్రయ పడ్తుంటారు. డాక్టరు వద్దకెళ్తే భారీ ఫీజు, పలు రకాల పరీక్షలు ఎడాపెడా దోపిడీ తట్టుకోలేమని చిట్కాల వైద్యం మీద కూడా ఆధారపడుతున్నారు. ఏమాత్రం మోతాదుల్లో తేడా ఉన్నా ఆ శరీరంపై వాటి ప్రభావం ఎక్కువగా ఉండి కొత్త కొత్త రోగాలు పీడిస్తాయి. సైడ్ ఎఫెక్ట్స్‌తో శరీరం రోగ గ్రస్తమవుతుంది. తెలుగు రాష్ట్రాల్లో సొంతవైద్యం, మందుల షాపుల్లో రోగ లక్షణాలు చెప్పి మందులు తెచ్చుకునే వైద్యానికి జనం అలవాటుపడ్డారు. తాజాగా డాక్టర్లు రాసే ఔషధ చీటీలు ప్రిస్క్రిప్షన్‌లో సమగ్రంగా స్పష్టంగా ఉండాల్సిందేనని జాతీయ ఆరోగ్య మిషన్ కొత్త మార్గదర్శకాలతో 'ప్రిస్క్రిప్షన్ ఆడిట్'ను విడు దల చేసింది. వీటిని డాక్టర్లు విధిగా పాటించాలి. అలాగే మందుల షాపుల్లోనూ నిర్దేశిత చిటీ లేనిదే మందుల విక్రయం చేయబోమనే స్థాయికి మందుల షాపు యజమానిని కూడా సిద్ధం చేయాలి. అలా చేయలేని ఇరు వర్గాలకు విధి విధానాలు అలవాటు చేయాల్సిన అవసరమొచ్చింది. మందుల చీటీతో నిమిత్తం లేకుండా కొన్ని మందులను మత్తు పదార్థంగా వాడే వారికి అక్రమ మార్గంలో విక్రయించిన షాపు యజమానులు జైలు ఊచలు లెక్కపెట్టాల్సిందేనన్న విషయం మరో తాజా ఉదంతం తేల్చి చెప్పేసింది. తీవ్ర నొప్పి నివారణకు 'ట్రమాడాల్' అనే మందుకు డాక్టర్లు రాస్తుంటారు. కానీ ఇలాంటి మందులు వైద్యసలహా లేకుండా వినియోగిస్తే, అది ప్రాణాంతకమే అవుతుంది. ఈ నేపథ్యం తెలుసుకోకుండా కేవలం వాటిని మత్తు కలిగించే పదార్థాలుగా సేవిస్తే మానవ శరీరానికి మేలుకన్నా కీడే ఎక్కువ. మంగళవారం ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన తనిఖీలలో దాదాపు 55 షాపుల్లో అనవసర మందుల విక్రయాలు చేసిన వైనాన్ని ఔషధ నియంత్రణ అధికారులు పసికట్టారు. ట్రమడాల్ మందుల అక్రమ వినియోగం, అనధికారిక నిల్వ విక్రయాలపై ఔషధ నియంత్రణ అధికార్లు చేపట్టిన దాడులలో ఆందోళనకర విషయాలు వెల్లడయ్యాయి. ఒక నియంత్రణ ఔషధం సరఫరా గొలుసు నుంచి బయటకు వెళ్లి అక్రమ వినియోగదారుల చేతికి చిక్కితే మానవాళికి ప్రమాదమే. ఇలాంటి ఔషధాల నియంత్రణ, పర్యవేక్షణలో ప్రతి దశలోనూ పర్యవేక్షణ ఉండాల్సిందే. వీటి వినియోగంలో ఏమాత్రం తేడా జరిగినా శరీరంపై దుష్ప్రభావాలు కలుగుతాయి. ఇటీవలి తనిఖీల్లో భారీ మొత్తంలో 'ట్రమడాల్' ఇంజెక్షను కూడా పట్టుబడ్డాయి. వాటి విక్రయాలకు ఎక్కడా రికార్డులు లేవు. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలో మందుల షాపుల వారు ఇలాంటి అక్రమ వ్యవహారాలకు పాల్పడుతున్న ఉదంతాలున్నాయి. కొద్ది రోజుల క్రితమే ఎలాంటి వైద్య కోర్సులూ చదువుకోకుండా సర్టిఫికేట్లు కూడా చేస్తున్నా నకిలీ డాక్టర్లను హైదరాబాద్‌లో పదుల సంఖ్యలో పట్టుకుని కేసులు పెట్టారు. గతంలోనూ కొందరు నకిలీ డాక్టర్లను పట్టుకుని కేసులు పెట్టినా, మళ్లీ కొత్త వాళ్లు కొందరు పట్టుకొచ్చారు. వీళ్లెవరికీ చట్టం అన్నా, పట్టుబడితే బతుకు తెరువుకు మొదటికే మోసం వస్తుందనే భయం కూడా లేదు. తాజాగా 'ట్రమాడాల్' ఇతర కఠిన విక్రయ నిబంధనలున్నా ఔషధాలు అక్రమమార్గంలో ఎల్లలుదాటిన ఆచూకీ దొరికింది. ఆంధ్రప్రదేశ్‌లోని జంగారెడ్డి గూడెంలో ఇలాంటి దందా ఔషధ నియంత్రణ అధికారులకు దొరికి పోయింది. రాష్ట్రవ్యాప్త తనిఖీలకు దారితీసిన ఘటనచాలా విచిత్రంగా వెలుగులోకి వచ్చింది. జీలుగుమిల్లి మండలంలోని వేగవరం గ్రామంలోని ఆయిల్‌పామ్‌తోటలో భారీ సంఖ్యలో ఖాళీ, పగిలిన ఇంజక్షన్ సీసాలు, వినియోగించిన సిరంజీలు ప్రత్యక్షమయ్యాయి. దాంతో అనుమానంతో జంగారెడ్డి గూడెం డ్రగ్ ఇన్‌స్పెక్టర్ అవి దొరికినతోటలో పరిశీలించారు. ఆ తనిఖీల్లో ట్రామాడెక్స్, ట్రమెక్ పేర్లతో ఉన్న ట్రమాడాల్ ఇంజెక్షన్లుగా గుర్తించారు. 'ట్రమాడోల్' నొప్పి నిరోధక మాత్రగానూ, ఇంజెక్షన్లు గానూ వాడతారు. కానీ దీనికి మత్తుకలిగించే గుణం ఉండడంతో మాదక ద్రవ్యాలకు ప్రత్యామ్నాయంగా వినియోగిస్తారు. వికటిస్తే శ్వాసకోశ సమస్యలు తప్పవు. నాడీవ్యవస్థపై ప్రభావం చూపిస్తుంది. తెలుగు రాష్ట్రాల్లో ట్రమాడోల్ తయారీ సంస్థల సరఫరా విషయాలు చూస్తే వైద్యుల సూచన మేరకు, నిబంధనల ప్రకారమే, మోతాదులు వాడాల్సిన ఔషధం విచ్చలవిడిగా రోడ్డెక్కేసింది. ఇది ప్రమాదకర సంకేతాన్ని సూచిస్తుండడంతో రెండు రాష్ట్రాలలో ఆ ఔషధ సరఫరా రికార్డులు తనిఖీ చేశారు. జంగారెడ్డి గూడెంలోని రెండు మందులదుకాణాల నుంచి సరైన బిల్లులు రికార్డులు లేకుండా విక్రయిస్తున్నట్లు గుర్తించారు. ఈ యేడాదిమొత్తం మీద రెండు బిల్లుల ద్వారా ట్రమాడోల్ ఇంజెక్షన్లు కొనుగోలు చేసినట్లు బయటపడింది. అవి ఎక్కడ విక్రయించారో వెదకడంతో తీగలాగితే డొంకంతా కదిలినట్లు పలు వివరాలు వెల్లడయ్యాయి. మరో షాపు గత రెండేళ్లలో 5200ట్రామెక్ ఇంజక్షన్లు కొనుగోలు చేసి తెలంగాణలోని మందుల దుకాణానికి విక్రయించినట్లు నకిలీ బిల్లులు సృష్టించారు. ఈ ఔషధాలు ఎక్కడి నుంచి ఎక్కడికి సరఫరా అయినా అధిక మోతాదుల్లో వాడకం దుష్ప్రభావాలు కలిగిస్తుంది. పైగా సొంతంగా వాడుకునే వారు మత్తు పదార్థాలుగా వినియోగించడం మరీ దుష్ప్రభావాలకు లోనయ్యే అవకాశం ఉంది. ఈ వ్యవహారంలో ఐదుగురికి జంగారెడ్డి గూడెం పోలీసులు అరదండాలు వేసారు. మందుల షాపుల యజమానులు ఉన్నారు. ఈ వ్యవహారాలపై ఉభయ రాష్ట్రాల ఔషధ నియంత్రణ పరిపాలనశాఖ ఔషధాల అక్రమ రవాణా, వాడకాలపై నిఘామరింత పెంచాలి. మానవుని జీవన ప్రమాణాలను తగ్గించే ఔషధాల విషయంలో అప్రమత్తత, అవగాహన పెంచాల్సిన అవసరం ఉంది. ఈ మధ్యకాలంలో మత్తును కలిగించేందుకు విజయవాడలో అధిక స్పిరిట్ అమ్మకాల విషయం కూడా బయటపడినందున ప్రత్యేక బృందాలతో దర్యాప్తు అవసరం ఉంది.



ఉన్నత స్థానానికి ఎదగడానికి సాధనంగా ఉపయోగపడటమే రాజకీయాల లక్షణం.

శామ్యూల్ జాన్సన్



బహిరంగంగా కనిపించే మురికి గుంటలకన్నా మనసులో మాలిన్యంగల వ్యక్తుల వల్లే జాతికి ప్రమాదం.

డా॥ రాధాకృష్ణన్

# దౌత్య విధానంలో మోడీ కొత్త పుంతలు



శ్రీ హార్ష్ గోయెంకా

ఇటీవలే న్యూఢిల్లీలో జరిగిన 'బ్రిక్స్' శిఖరాగ్ర సదస్సు పలు దేశాధినేతలను ఒక్క చోట చేర్చింది. బ్రిక్స్ సభ్యదేశాలకు విభిన్న రాజకీయ వ్యవస్థలు, వ్యూహాత్మక ఆసక్తులు, ప్రపంచ దృక్పథాలున్నాయి. పశ్చిమాసియా నుంచి చైనా, రష్యా వరకు ఉద్రిక్తతలు నెలకొన్నప్పటికీ ప్రతి సభ్యదేశమూ న్యూఢిల్లీ ప్రకటనపై సంతకంచేసింది. మూడు రోజుల్లో 15 ద్వైపాక్షిక సమావేశాలను స్వయంగా మోడీ నిర్వహించారు. విభిన్న ఆసక్తులున్న నాయకులతో భారతదేశ ప్రయోజనాలే కేంద్రంగా ఈ చర్చలు చేపట్టారు. మోడీపై విసిరిన ప్రతి విమర్శఆయన నిర్మించిన దౌత్యప్రాకారంలో ఇటుకగా మారినట్లు కనిపిస్తోంది. మోడీ వ్యక్తిగతశైలిలో ఆత్మీయత, కఠినత్వాల ఆసక్తికరమైన సమ్మేళనం కనిపిస్తుంది. ఆయన ఆలింగనాలు, కరచాలనాలు, ఫోటోలు అందరినీఆకర్షిస్తాయి. అయితే, వాటి వెనుక విదేశాంగ విధానంపై ఆయనకున్న సునిశిత దృష్టి దాగిఉంది. ప్రభుత్వాల మధ్య విభేదాలు తలెత్తినప్పుడు, వారి నాయకులు ఫోన్లో మాట్లాడుకోగలిగితే ఎంతో మేలు జరుగుతుందనే ఓ సాధారణ దౌత్యసూత్రాన్ని మోడీ అర్థం చేసుకున్నారు. కొన్నేళ్లుగా ఆయన ఈ సంబంధాల్లో గణనీయమైన రాజకీయ పెట్టుబడి పెట్టారు. అమెరికా అధ్యక్షులతో ఆయనకున్న సంబంధాలు, పుతిన్‌తో కొనసాగిస్తున్న సంప్రదింపులు, షీ జిన్‌పింగ్‌తో చర్చలు, యూరోప్, ఆఫ్రికా, గల్ఫ్ దేశాల నాయకులతో చేస్తున్న ప్రయత్నాలు అన్నీ ఒకే వ్యూహంలోభాగంగా ఉన్నాయి. భారత ప్రధానమంత్రి అత్యంత అరుదుగా సందర్శించే దేశాలకువెళ్లేందుకు ఆయన సుముఖంగా ఉన్నారు. 2025లో మూడు దశాబ్దాల అనంతరం ఘనాలో, 26ఏళ్ల తర్వాత ట్రినిడాడ్ అండ్‌టొబాగోలో ద్వైపాక్షిక పర్యటనలు చేపట్టారు. అగ్రరాజ్యాలు పరిమిత దృష్టిసారించే దేశాలతో సద్భావన ఏర్పాటు చేసుకోవడానికి,

సంబంధాలను బలోపేతం చేసుకోవడానికి ఈతరహా పర్యటనలు భారత్‌కు తోడ్పడతాయి. వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తి అనే ఆయన విస్తృత సిద్ధాంతానికి ఈ వ్యక్తిగత శైలి చక్కగా సరిపోతుంది. నియమాలను స్వీకరించే దేశంగా కాకుండా నియమాలను రూపొందించే దేశంగా భారత్ మారుతోందని మోడీ చెబుతారు. అంతర్జాతీయంగా రక్షణాత్మక వైఖరితో కాకుండా ఆత్మవిశ్వాసంతో భారత్ వ్యవహరించాలని ఆయన కోరుకుంటున్నారు. అంటే క్వాడ్ ద్వారా అమెరికాతో సన్నిహితంగా పనిచేయడం, రష్యాతో దీర్ఘకాల సంబంధాన్ని కొనసాగించడం, బ్రిక్స్ ద్వారా చైనాతో సంప్రదింపులు జరపడం, యూరోప్, గల్ఫ్‌తో భాగస్వామ్యాన్ని బలోపేతంచేయడం, గ్లోబల్ సౌత్ వేదికల ద్వారా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలకు మద్దతు ఇవ్వడమని అర్థం. ఏదో ఒక కూటమివైపేనిలబడకుండా భారతదేశ ప్రయోజనాలఆధారంగా సమస్యలపై స్పష్టమైన వైఖరిని వ్యక్తం చేయడమే మోడీ విధానం. ఇది అత్యంత ఆచరణాత్మకమైన విధానం. దీనిలో ప్రతి సమస్యనూ దాని ప్రాధాన్యం, భారతదేశ ప్రయోజనాల ఆధారంగా విశ్లేషిస్తారు. మోడీ సారథ్యంలో వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తి మరింత చురుగ్గా, దృఢంగా మారింది. ఇది ఒక దేశంతో రక్షణ రంగంలో, మరోదేశంలో ఇంధన రంగంలో, ఇంకో దేశంతో సాంకేతిక రంగంలో సహకరించుకుంటూనే ఇతరఅంశాల్లో ఆయా దేశాలతో విభేదించే స్వేచ్ఛనుఆయనకు ఇచ్చింది. 2023లో భారత్ అధ్యక్షత వహించిన జీ20సమావేశాల సమయంలో సంకీర్ణ కూటముల ఏర్పాటులో ఆయన పాత్ర స్పష్టంగా కనిపించింది. ఉక్రెయిన్ యుద్ధం కారణంగా రష్యా, పశ్చిమ దేశాల మధ్య విభేదాలు తీవ్రమైన తరుణంలో ఏకాభిప్రాయం కుదరటంపై ఆశలుసన్నగిల్లాయి. అయినప్పటికీ మోడీ అన్ని వర్గాలను సంప్రదిస్తూ.. ఉమ్మడి అంగీకార అంశాలపై పట్టుదలగా కృషి చేశారు. ఫలితంగా న్యూఢిల్లీ నేతల డిక్లరేషన్‌ను భారత్ విజయ వంతంగా సాధించింది. అంతకన్నా సమప్రాధాన్యత సంత రించుకున్న మరోఅంశం.. ఆఫ్రికన్ యూనియన్‌ను జీ20లో శాశ్వత సభ్యదేశంగా చేర్చేందుకు మోడీ ప్రత్యేకంగా కృషి చేశారు. ఆఫ్రికన్ యూనియన్ అధ్యక్షుడి వద్దకు స్వయంగా వెళ్లి శిఖరాగ్ర సదస్సుకు సాదరంగా ఆహ్వానించారు. అంతర్జాతీయ




వేదికలపై గ్లోబల్ సౌత్ దేశాలకు మరింత బలమైన గొంతుకను అందించాలనే భారత్ నిబద్ధతను ఇది చాటి చెప్పింది. 120కిపైగా దేశాలతో సంప్రదింపులు జరుపుతూ వాయిస్ ఆఫ్ గ్లోబల్ సౌత్ కార్యక్రమం ద్వారాముందుగానే భారత్ తగిన ఏర్పాట్లను చేసుకుంది. ఆఫ్రికన్ యూనియన్‌ను జీ20లో భాగం చేయటం ద్వారా ఖండం మొత్తానికి ప్రపంచ నిర్ణయ ప్రక్రియల్లో సముచిత ప్రాతినిధ్యం లభించింది. ఇది మోడీ దౌత్యనీతిలోని కీలక లక్షణాన్ని ప్రతిబింబిస్తుంది. విస్తృత కూటములను ఏర్పాటు చేయటం, సంప్రదాయ అధికార వ్యవస్థ వెలుపలఉన్న దేశాలకు కూడా సముచిత ప్రాధాన్యత లభించేలా చూడటం. రాజకీయాలు, దౌత్యంలో సంకేతాల ద్వారా భావాలను వ్యక్తపరచటం ఆయన శైలిలో కీలక భాగం. భారతదేశ జీ20 అధ్యక్షతకు సులభంగా అర్థమయ్యే తత్త్వాన్ని వసుధైవ కుటుంబకం అందించింది. ఒకే భూమి, ఒకే కుటుంబం, ఒకేభవిష్యత్తు, నినాదం ప్రాచీన భారతీయ భావనను ఆధునిక దౌత్య భాషలోకి అనువదించింది. అదేవిధంగా అంతర్జాతీయ యోగా దినోత్సవంఅసాధారణమైన ప్రపంచ స్థాయి శక్తి ప్రదర్శనగా మారింది. కొవిడ్ సమయంలో చేపట్టిన వాక్సిన్ మైత్రి కార్యక్రమం. భారతదేశ అభ్యుదయం ఇతరులకు కూడా మేలు చేస్తుందనే స్పష్టమైనసందేశాన్నిచ్చింది. నేటి దౌత్యం కేవలం చర్చల గదికే పరిమితం కాకుండా టెలివిజన్ స్టూడియోల్లో, లక్షలాది మంది మొబైల్ ఫోన్‌స్క్రీన్లపై ఒకే సమయంలో జరుగుతుందని మోడీ గ్రహించటం వల్లే ఈ చర్యలన్నీ విజయవంతమవుతున్నాయి. కొంతమంది ప్రపంచ నేతలు మాత్రమే ఈ మూడు వేదికలపై అవగాహనతో ఉన్నారు. ఈ శైలి వెనుక అద్భుతమైన పట్టుదల కూడా ఉంది. బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశంలో మూడు రోజుల్లో పదిహేను ద్వైపాక్షిక సమావేశాల నిర్వహణ... నిరంతర సంప్రదింపుల ధోరణిలో భాగమే. మోదీ విదేశాంగ విధా నాన్ని దౌత్యవేత్తలకు మాత్రమే పూర్తిగాఅప్పగించకుండా, ప్రధానమంత్రి స్వయంగా తీసుకోవాల్సిన బాధ్యతగా భావిస్తారు. బ్రిక్స్ సమావేశానికి ముందు ముప్పై భారతీయ నగరాల్లో 400లకు పైగా సమావేశాలు, కార్యక్రమాలు జరిగాయి. కీలక సమయాల్లోదౌత్యవేత్తలు మాత్రమే సాధించలేని పురోగతిని ఆయన స్వయంగా సాధించారు. ఒప్పందాల నమూనాలను దౌత్యవేత్తలు రూపొందిస్తారు. బ్రిక్స్ కూటమి స్వయంగా దాదాపుసగం ప్రపంచ జనాభాను, సుమారు 40 శాతంప్రపంచ జీడీపీని కలిగి ఉంది. దీనిలోని సభ్యదేశాల ఆశయాలు, కూటములు, అసంతృప్తి వేర్వేరుగా ఉండటం వల్ల నిర్వహణ కష్టతరమైనవిషయం. వాణిజ్యం, సాంకేతికత, కీలకఖనిజాలు, ఆహార, ఇంధన భద్రత, పటిష్టమైనసరఫరా వ్యవస్థలు, ప్రపంచ సంస్థల సంస్కరణలను గుర్తించి, ఆ విషయాలపై దృష్టిపెట్టేలా చేయటమే మోడీ సాధించిన ఘనత. విదేశాంగ విధానంలో మాత్రంఆయన వ్యక్తిగత ముద్రస్పష్టంగా కనిపిస్తుంది. దశాబ్దకాలానికి పైగా భారతదేశ దౌత్యానికి మరింత గుర్తింపును, ఆత్మవిశ్వాసాన్ని, ఉన్నతమైన ఆశయాలను అందించారు. భారతదేశ ముఖ్య దౌత్య ప్రచారకర్తగా ప్రధాన మంత్రే స్వయంగా వ్యవహరించేలా చేశారు. సైద్ధాంతిక, భౌగోళిక విభేదాలకు అతీతంగా విభిన్న దేశాలతో సంబంధాలను బలోపేతం చేసేందుకు విశేషంగా కృషిచేశారు. గుజరాత్ వ్యాపారవేత్తకు ఉండే ఆచరణాత్మకత, ప్రజలను అర్థం చేసుకునే రాజకీయ నాయకుడి ఆలోచన, దేశాలు అంతిమంగా సొంతప్రయోజనాల కోసమే పనిచేస్తాయనే రాజనీతిజ్ఞుడి అవగాహన అన్నీ ఆయన శైలిలో మేళవించి ఉంటాయి. ఒప్పందాన్ని కోల్పోకుండాఆప్యాయంగా ఉండగలరు. లక్ష్యాన్ని మరచిపోకుండా సందర్భానుసారంగావ్యవహరిస్తారు. అదే సమయంలో ప్రస్తుత పరిస్థితుల పరిమితులను గుర్తిస్తూనే గొప్ప ఆశయాలతో ఉంటారు. బహుశా అదే మోడీ శైలిలోని సారాంశం కావచ్చు. రోజు రోజుకూ ముక్కలవుతున్న ఈప్రపంచంలో దూరం చేసుకోవటం కంటే పరస్పర సంబంధాలకు, కఠినమైన కూటములకంటే స్నేహానికి, గోడలు కట్టటం కంటే వంతెనల నిర్మాణానికే ఆయన ఎక్కువ ప్రాధాన్యతనిస్తారు. ప్రపంచ వ్యాప్తంగా బలమైన సంబంధాలు ఉన్నప్పుడే దేశ వ్యూహాత్మక స్వయంప్రతిపత్తికి మరింత విలువ ఉంటుందని ఆయన గ్రహించారు. ఆయన దౌత్యనీతిఆచరణాత్మకతను, ఉన్నత ఆశయాలను కలగలిపింది. పరస్పరం పోటీపడే అగ్రరాజ్యాలను కలుపుకుపోతూ... గ్లోబల్ సౌత్ స్వరాన్ని బలపరిచారు. భారతదేశ ప్రభావాన్ని క్రమంగా విస్తరించారు. దశాబ్దానికి పైగా సాగిన ఈ ప్రయాణంలో ప్రపంచంతో భారత్‌వ్యవహరించే తీరునేకాక, భారత్ వైపు ప్రపంచం చూసేవిధానాన్ని కూడా ఆయనమార్చేశారు.

# నిర్లక్ష్యానికి మూల్యం జీవితాంతం పశ్చాత్తాపం!

మేకిరి దామోదర్

ప్రయాణం అంటే కేవలం ఒక ప్రదేశం నుంచి మరో ప్రదేశానికి చేరుకోవడం కాదు.. మన గమ్యాన్ని సురక్షితంగా చేరుకోవడమే అసలైన ప్రయాణ విజయం. రహ దారిపై మనకంటే ముందు ఎన్నో ప్రమాదాలను చూసిన అనుభవం, ఎన్నో హెచ్చరికల రూపంలో మనకు కనిపి స్తూనే ఉంటుంది. రహదారి పక్కన కనిపించే ప్రతి సూచిక బోర్డు ఒక అక్షర సందేశం మాత్రమేకాదు. మన ప్రాణాలను కాపాడే ముందస్తు హెచ్చరిక. వర్షాకాలంలో వాతావరణ శాఖ జారీ చేసే ఎల్లో, ఆరెంజ్, రెడ్ అలర్ట్‌లు కూడా ప్రకృతి మనకు ఇచ్చే హెచ్చరికలే. వాటిని నిర్లక్ష్యం చేసి ముందుకు సాగితే ప్రమాదం మన గమ్యాన్ని మార్చేయ వచ్చు. వర్షాకాలంలో వాతావరణ పరిస్థితులు క్షణాల్లో మారిపోతాయి. ముఖ్యంగా దూర ప్రయాణాలు చేసే వారు వర్షం, ఈదురుగాలులు, వరదలు, పిడుగులు వంటిప్రకృతి పరిస్థితులను ముందుగానే అంచనా వేసుకోవాలి. అందుకే వాతావరణ శాఖ వర్షాల తీవ్రతను బట్టి వివిధ రంగుల హెచ్చరికలను జారీ చేస్తుంది. ఈ రంగుల అర్థాలను ప్రజలు తెలుసుకోవడం అత్యంత అవసరం. ఎల్లో అలర్ట్ అంటే వాతావరణ పరిస్థితులపై అప్రమత్తంగా ఉండాల్సిన సమయం. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలవడం, రహదారులు జారుడుగా మారడం, చెట్లు లేదా బలహీననిర్మాణాలు దెబ్బతినడం వంటి సమస్యలు ఎదురుకావచ్చు. ఆరెంజ్ అలర్ట్ అంటే పరిస్థితి మరింత తీవ్రంగా ఉండే అవకాశం ఉందని అర్థం. భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో రహదారులు, వంతెనలు, లోతట్టు ప్రాంతాల్లో వరద నీరు చేరవచ్చు. చెట్లు, విద్యుత్‌స్తంభాలు నేలకొరిగే ప్రమాదం ఉంటుంది. పిడుగులు పడే అవకాశం ఉన్నప్పుడు చెట్ల కింద నిలబడటం, బలహీన నిర్మాణాల్లో ఉండటం ప్రమాదకరం. రెడ్ అలర్ట్ అత్యంత తీవ్రమైన వాతావరణ పరిస్థితులకు సంకేతం. వరదలు, రహదారులపైతీవ్ర అంతరాయాలు, చెట్లు- విద్యుత్ స్తంభాలు పడిపోవడం వంటి ప్రమాదాలు సంభవించవచ్చు. అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలి. కాబట్టి వాతావరణ హెచ్చరికలను ప్రకృతి ఇచ్చే ముందస్తు సంకేతంగా భావించాలి. ప్రతి పరిస్థితికి ముందుగానే హెచ్చరించేందుకే రహదారి సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తారు. ఎరుపురంగు అంచులతో ఉండే అనేక వృత్తాకార సూచికలు వాహనదారులు తప్పనిసరిగా పాటించాల్సిన నిబంధనలు, ఆదేశాలను తెలియజేస్తాయి. వేగపరిమితి, ప్రవేశం నిషేధం, ఓవర్ టేకింగ్ నిషేధం, నోపార్కింగ్, వన్‌వే వంటి సూచికలను ఎట్టి పరిస్థితుల్లోనూ విస్మరించకూడదు. త్రిభుజాకార బోర్డులు ముందున్న ప్రమాదకర పరిస్థితులను ముందుగానే తెలియజేస్తాయి. స్పీడ్‌బ్రేకర్, రోడ్డు పనులు, పాదచారుల రాకపోకలు, పాఠశాల ప్రాంతం వంటి సూచనలు వీటిలో ఉంటాయి. ప్రయాణికులకు అవసరమైన సమాచారం అందించేవి సాధారణంగా దీర్ఘచతురస్రాకార సూచిక బోర్డులు. పెట్రోల్ బంక్, ఆసుపత్రి, ప్రథమ చికిత్స కేంద్రం, హోటల్, రెస్టారెంట్, పార్కింగ్, విశ్రాంతి ప్రదేశం వంటి సౌకర్యాలు ఎక్కడ ఉన్నాయో ఇవి తెలియజేస్తాయి. దూరప్రయాణాల్లో ఇలాంటి సూచికలు ఎంతో ఉపయోగక రంగా ఉంటాయి. వాతావరణశాఖ ఇచ్చే హెచ్చరికలు, రహదారుల వెంట



# ప్రజావాక్కు

## బీఎస్ఎన్ఎల్ టారీఫ్ మార్పులు

గతంలో బీఎస్సెన్నెల్ వారి 107 టారిఫ్ ప్లాన్ ప్రకారం పరిమిత కాల్స్‌తో 35రోజులు సెల్‌ఫోన్లో మాట్లాడే సౌకర్యం వుండేది. అది నెట్ అవసరం లేని చిన్న సెల్‌ఫోన్లు వాడుకునే వారికి ఎంతో ప్రయోజనకరంగా వుండేది. తాజాగా ఆ ప్లాన్ ఎత్తివేసి, కనీసం రూ.147తో 24 రోజులపాటు అపరిమితంగా ఎంతసేపైనా మాట్లాడుకోవచ్చనే పథకం పెట్టారు. ఫలితంగా ఫ్రీగా వచ్చిందని ఫినాయిల్ తాగినట్లు వుచితమేనన్న భరోసాతో కొందరు గంటలకొద్దీ మాట్లాడుతూ ఇతరుల సమయం వృధా చేస్తూ, తమ ఆరోగ్యం కూడా పాడు చేసుకుంటున్నారు. కనుక ఈ 147 పథకాన్ని రోజుకి గంట ఉచిత టాక్ టైంతో 35 రోజుల వరకు పొడిగించి ఇంకా మాట్లాడుకునే వారికి, ఆ అదనపు సమయంలో నిమిషానికి పావలా గాని అర్థ రూపాయిగాని చార్జీ విధిస్తే, వినియోగదారులకి క్రమశిక్షణ, ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది.

- తిరుమలశెట్టి సాంబశివరావు, గుంటూరు

## అన్ని ప్రాంతాలపై ప్రభావం

నేపాల్-టిబెట్ సరిహద్దు ప్రాంతంలో సంభవించిన విపత్తు హిమాలయ పర్యావరణవ్యవస్థ ఎంత సున్నితమైనదో, ప్రకృతి వైపరీత్యాల ముందు మానవ సమాజం ఎంత బలహీనంగా ఉందో మరోసారి గుర్తుచేసింది. వరదలు, కొండచరియలు విరిగిపడటం, హిమ సరస్సులు ఉప్పొంగడం వంటి ఘటనలు పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. భౌగోళికంగా, పర్యావరణపరంగా, భౌగర్భికంగా హిమాలయాలు అత్యంత సున్నితమైన ప్రాంతం. వాతావరణ మార్పుల ప్రభావం కూడా ఇక్కడ ప్రపంచ సగటుతో పోలిస్తే వేగంగా కనిపిస్తోంది. ఉష్ణోగ్రతల పెరుగుదల మంచు కరగడాన్ని వేగవంతం చేసి, హిమ సరస్సుల విస్తరణకు, ఆకస్మిక వరదల ముప్పుకు కారణమవుతోంది.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## విదేశాలకు దివ్యాంగులు!

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యా బోధన రంగంలో విదేశాలలో బోధన విధానంపై పరిశోధనలు చేయడానికి గాను టీచర్స్, లెక్చరర్స్‌ను పంపడం చాలా సంతోషకరం. అదేతరహాలో వికలాంగులైన విద్యార్థులకు విద్యా బోధన చేయడానికి దివ్యాంగులైన టీచర్స్, లెక్చరర్స్‌ను కూడా ఎంపిక చేయాలి.

-ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్

## దేశ గౌరవం పెంచిన బ్రిక్స్ సదస్సు

భారత్ నాయకత్వంలో ఢిల్లీలో ముగిసిన బ్రిక్స్ దేశాల 18 వ సదస్సు విజయవంతమై దేశ గౌరవాన్ని పెంచింది. అంతర్జాతీయంగా భారత్ పలుకుబడిని, బలాన్ని పట్టి చూపింది. దాదాపు ప్రపంచంలో సగం జనాభాకు ప్రాతినిధ్యం వహిస్తున్న దేశాలు, ఆర్థికంగా, మార్కెట్ పరంగా శాసించగల స్థాయిలో ఉన్న గ్లోబల్ సౌత్ దేశాలు ఒక వేదికపైకి రావడం, ఉమ్మడి ప్రకటన చేయగలగడం కీలక పరిణామం. అది భారత్ దౌత్య వ్యూహంతోనే సాధ్యమైంది. అలా అని బ్రిక్స్ దేశాల మధ్య అంతరాలు లేవని కాదు. తమ మధ్య ఉన్న విభేదాల్ని పక్కకు పెట్టి, ఉమ్మడి లాభం కోసం ముందుకు రావడమే ప్రస్తుత కాలంలో పెద్ద విజయం. భారత్, చైనా మధ్య సరిహద్దు వివాదాలు, అరబ్ దేశాలు, ఇరాన్ మధ్య గొడవలు, రష్యాతో అభిప్రాయ భేదాలు, ఆఫ్రికా దేశాల మధ్య నీటి గొడవలు తాత్కాలికంగా వెనక్కి వెళ్లి, బహుళ ధృవ ప్రపంచంలో పోషించగల పాత్రపై దృష్టి సారించాయి.

- డా.డి.వి.జి.శంకర రావు, విజయనగరం

## హార్ ఘర్ తిరంగా

పిల్లలకు పాకడాన్నిఎవరూ నేర్పించరు. వాళ్లంత వాళ్లే పాక్కుంటూ వెళతారు. తరువాత కుర్చీలని, తలుపులని, మంచం కోళ్లని పట్టుకుని పడుతూ లేస్తూ నడుస్తారు. అలానే ఎవరికీ వారు దేశాన్ని ప్రేమించాలి. దేశభక్తి కలిగి ఉండాలి. దేశ పౌరులుగా తమకు చేతనైనంతలో దేశసేవ చేయాలి. వృద్ధులని తల్లిదండ్రులను గౌరవించడం, దివ్యాంగులకి, పేదలకి సాయం అందించడం ఇవన్నీ చేస్తే భారత మాత సంతోషిస్తుంది. కాని ఇళ్ల మీద జెండా ఎగరేస్తేకాదు.

- రాశి, హైదరాబాద్

## నిజమైన అభివృద్ధి

అభివృద్ధి అంటే అంకెల గారడి కారాదు. జనాల జీవితాలలో మార్పు రావాలి. అది గుణత్మాకంగా ఉండాలి. అంటే జీవన ప్రమాణం పెరగాలి. పేదరికం అనేదితగ్గాలి. అయితే పేదరికం తగ్గడంతోపాటు ఆదాయం అసమానతలు కూడాతగ్గాలి. అది ముఖ్యం. దానికి గ్రామీణ ఆర్థికవ్యవస్థను బలోపేతం చేయాలి. అందుకు వీబీ జీరామ్‌జీ, స్వయం గ్రూపుల పథకం మంచి ఆలంబన కావొచ్చు. ఎందుకు హార్టికల్చర్ పెంచాలి. ఎందుకు రైతులతో చర్చలు అవగాహనా కార్యక్రమం చేపట్టడం వల్లనే తెలంగాణలో ఆయిల్ ఫామ్ విస్తీర్ణం పెరిగింది అని గుర్తు పెట్టుకోవాలి. స్థిరమైన గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పెంపుదలే నిజమైన అభివృద్ధిగా నిలుస్తుంది.

- భారత అవినాష్, జనగామ

# ఆడంబరాలు కాదు అభివృద్ధి ముఖ్యం

శెట్టే అంజయ్య

భారత ఆర్థిక వ్యవస్థ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో 7.8 శాతం వృద్ధి రేటును నమోదు చేయడం నిస్సందేహంగా హర్షించదగిన పరిణామం. ప్రపంచ వ్యాప్తంగా అనేక ప్రధాన ఆర్థిక వ్యవస్థలు మాంద్యం భయాలతో, ద్రవ్యోల్బణ ఒత్తిళ్లతో, భౌగోళిక రాజకీయ అనిశ్చితులతో కొట్టుమిట్టాడుతున్న తరుణంలో భారత్ ఈ స్థాయి ప్రగతిని సాధించడం దేశ ఆర్థిక పునాదుల అంతర్గత బలానికి అద్దం పడుతోంది. అయితే, ఒక్క త్రైమాసికానికి సంబంధించిన జీడీపీ గణాంకాన్ని చూసి మనం గమ్యస్థానాన్ని చేరుకున్నామని సంబరపడటం ప్రాథమిక ఆర్థిక సూత్రాలకే విరుద్ధం. 7.8 శాతం అనేది ఒక గణాంక విజయం మాత్రమే కావచ్చు, కానీ ఈ వృద్ధి సాధించిన ఫలాలు సమాజంలో అత్యంత దిగువన ఉన్న సామాన్య పౌరుడి జీవితంలో ఎంతవరకు సానుకూల మార్పును తీసుకువచ్చాయనేదే అసలైన పరీక్ష. ఈ ఆర్థిక ఘనతపై స్పందిస్తూ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ప్రజలకు చేసిన పిలుపును కేవలం ఒక రాజకీయ సందేశంగా కాకుండా, లోతైన ఆర్థిక దార్శనికతతో విశ్లేషించాల్సి ఉంది. స్వదేశీ వస్తువులనే కొనుగోలు చేయాలని, అనవసరమైన విదేశీ విహారయాత్రలను తగ్గించుకోవాలని, అలాగే దిగుమతులపై ఆధారపడే భౌతిక బంగారంలో విపరీతంగా పెట్టుబడులు పెట్టకూడదని ఆయన కోరడం వెనుక దేశీయ మార్కెట్‌ను బలోపేతం చేసే వ్యూహం స్పష్టంగా కనిపిస్తుంది. ఒక దేశం ఆర్థికంగా స్థిరమైన స్వావలంబన సాధించాలంటే కేవలం ప్రభుత్వ వ్యయం, బహుళజాతి సంస్థల పెట్టుబడులపైనే ఆధారపడితే సరిపోదు. కోట్లాది మంది పౌరుల రోజువారీ వినియోగ అలవాట్లు, చిన్న తరహా పరిశ్రమల స్థితిగతులు, దేశీయ తయారీ రంగం, విస్తృతమైన ఉద్యోగాల సృష్టి, ఉత్పత్తి రంగంలో ఉత్పాదకత పెరగడం వంటివి సమ్మిళితమైతేనే స్థిరమైన ప్రగతి సాధ్యమవుతుంది. ఇక్కడ మనం నిష్పాక్షికంగా ఒక ముఖ్యమైన అంశాన్ని ప్రశ్నించుకోవాలి. కాగితాలపై 7.8 శాతంగా కనిపిస్తున్న ఈవృద్ధి రేటు, ఒక సగటు మధ్యతరగతి లేదా నిరుపేద కుటుంబం నెలవారీ బడ్జెట్‌లో ఏమేరకు ఊరటను ఇస్తోంది? జీడీపీ విస్తరణ వేరు, సామాన్యకుటుంబ ఆదాయాల వృద్ధి వేరు. ఆర్థిక వ్యవస్థ ఎంత పెద్దదిగా మారినప్పటికీ, దానికి అనుగుణంగా ఉపాధి అవకాశాలు పెరగకపోతే లేదా వాస్తవ వేతనాలు పెరగకపోతే, ఆ వృద్ధిఫలాలు కొద్దిమందికే పరిమితమై అసమానతలు మరింత పెరుగుతాయి. అందువల్ల ప్రభుత్వం ఇకపై కేవలం శాతాల ప్రాతిపదికన జీడీపీని కొలవడమే కాకుండా ఉపాధి కల్పన, గ్రామీణ ప్రాంతాల ఆదాయాలు, వ్యవసాయ లాభదాయకత, సూక్ష్మ రోగనిరోధక శక్తి, పౌరుల వాస్తవ కొనుగోలుశక్తి వంటి నాణ్యమైన సూచికలపై ప్రత్యేకంగా దృష్టి సారించాల్సినఅవసరం ఉంది. ప్రధాని ప్రస్తావించిన స్వదేశీ నినాదాన్ని సాంకేతిక, వ్యాపార కోణంలో సునిశితంగా అర్థం చేసుకోవాలి. పౌరులు స్థానిక ఉత్పత్తులకు ప్రాధాన్యం ఇచ్చినప్పుడు స్వదేశీతయారీదారులకు డిమాండ్ పెరుగుతుంది. తద్వారా చిన్న పరిశ్రమలకు ఆర్డర్లు లభించి, అవి కొత్త ఉద్యోగాలను సృష్టిస్తాయి. ఇది పన్నుల రూపంలో ప్రభు త్వానికి ఆదాయాన్ని పెంచి,



ఆ నిధులను మళ్లీ రహదారులు, విద్యుత్, విద్య, ఆరోగ్యం వంటి మౌలిక వసతుల కల్పనకు వెచ్చించేలా ఒక ఆర్థిక చక్రాన్ని నిర్మిస్తుంది. అంటే ప్రతి వినియోగదారుడి కొనుగోలు నిర్ణయం దేశ పునర్నిర్మాణంలో ఒక ఆర్థిక పెట్టుబడిగా మారుతుంది. అయితే, ఈ బాధ్యతను కేవలం భావోద్వేగాల పేరుతో వినియోగదారుడి భుజాలపై మాత్రమే నెట్టివేయడం సమంజసం కాదు. స్వదేశీ వస్తువులు కేవలం 'దేశభక్తి' ఆధారంగా మాత్రమే అమ్ముడుపోలేవు, అవి అంతర్జాతీయ ప్రమాణాలతో, పోటీ ధరలతో, అత్యుత్తమ నాణ్యతతో అందుబాటులో ఉన్నప్పుడే సుస్థిరమైన మార్కెట్ సాధిస్తాయి. తయారీ రంగానికి సాంకేతిక పరిజ్ఞానం, సరసమైన వడ్డీలకు రుణాలు, నాణ్యమైన మౌలికవసతులు, ల్యాండ్ లేబర్ నిబంధనల సరళీకరణ, నైపుణ్యమున్న మానవ వనరులను అందించడం ప్రభుత్వ బాధ్యత. అప్పుడే స్వదేశీ అనేది నినాదం స్థాయి నుంచి బలమైన ఆర్థిక విధానంగా రూపాంతరం చెందుతుంది. అలాగే, విదేశీ ప్రయాణాలను తగ్గించుకోవాలనే సూచన విదేశీ మారకద్రవ్య వినియోగాన్ని అదుపు చేయాలనే సూక్ష్మ ఆర్థిక సూత్రంతో ముడిపడిఉంది. విలాసవంతమైన విదేశీ పర్యటనలు, కోట్లాది రూపాయలు వెచ్చించి విదేశాల్లో చేసుకునే 'డెస్టినే షన్ వెడ్డింగ్స్' వల్ల మన ధనం ఇతర దేశాలకు తరలిపో తుంది. ఆ నిధులను దేశీయంగా వెచ్చిస్తే ఇక్కడి పర్యాటక రంగం, హోటల్, రవాణా, ఈవెంట్ మేనేజ్‌మెంట్, ప్రాచీన హస్తకళారంగాలు ఆర్థికంగా పుంజుకుంటాయి. అయితే దీనిని ప్రపంచంతో సంబంధాలు తెంచుకోవడంగా భావించ కూడదు. విద్య, వ్యాపారం, శాస్త్ర పరిశోధనలు, అంతర్జాతీయ వాణిజ్య సంబంధాల కోసం విదేశీ ప్రయాణాలు అత్యంత ఆవశ్యకం. నిజమైన స్వావలంబన అంటే తలుపులు మూసుకోవడం కాదు, ప్రపంచ మార్కెట్లలో పోటీపడి మన స్థానాన్ని సుస్థిరం చేసుకోవడం. విదేశీ పర్యటనలను బలవంతంగా నిరోధించడం కంటే, భారతదేశంలోనే ప్రపంచ స్థాయి పర్యాటక అనుభవాలను, అంతర్జాతీయ సదస్సులను, వివాహ వేదికలను పటిష్టంగా నిర్మించడం సరైన వ్యూహం అవుతుంది. ఇక భారతదేశంలోబంగారం అనేది కేవలం ఆభరణం మాత్రమే కాదు, అది ఒక భావోద్వేగం, అత్య వసర సమయాల్లో ఆదుకునే ఆర్థిక రక్షణ కవచం. అయితే, సంపదనంతటినీ భౌతిక బంగారం రూపంలో నిల్వచేయడం వల్ల ఆ మూల ధనం ఆర్థిక వ్యవస్థలో నిష్క్రియాత్మకంగా ఉండిపోతుంది. పైగా భారీ బంగారపు దిగుమతులు దేశ వాణిజ్య లోటును పెంచి, విదేశీ మారక నిల్వలపై తీవ్రఒత్తిడి తెస్తాయి. అయితే ప్రజలకు 'బంగారం కొనవద్దు'అని చెప్పడం వల్ల మాత్రమే ప్రవర్తనా మార్పురాదు. దానికి ప్రత్యామ్నాయంగా సురక్షితమైన, పారదర్శకమైన, ద్రవ్యోల్బణాన్ని అధిగమించే లాభసాటి పొదుపు మార్గాలను సామాన్యులకు అందుబాటు లోకి తీసుకురావాలి. దేశంలో ఆర్థిక అక్షరాస్యతను విస్తృతం గా పెంచి, రిస్క్ అంచనాలకు తగినట్లుగా డిపాజిట్లు, బాండ్లు, బీమా, మూచువల్ ఫండ్స్ వంటి ఉత్పాదక మార్గాల్లో పెట్టు బడులు పెట్టేలా ప్రజలను ప్రోత్సహించాలి. మెట్రో నగరాలు మాత్రమే మెరుస్తూ, గ్రామీణ ప్రాంతాలు వెనుకబడితే అది సమగ్రవృద్ధి అనిపించుకోదు. వ్యవసాయ రంగాన్ని ఆధునీక రిస్తూనే, ఆహార ప్రాసెసింగ్, గ్రామీణ పరిశ్రమలు, లాజిస్టిక్స్ రంగాలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊపిరి పోయాలి. అలాగే తక్కువ వ్యయంతో, అత్యుత్తమ నాణ్యత కలిగిన ఉత్పత్తుల ను

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన వి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# పాస్‌పోర్టు ర్యాంకుల్లో భారత్ 73వ స్థానం



## గతేడాది కంటె ఏడు స్థానాలు దిగజారిన వైనం
## అత్యంత శక్తిమంతమైన దేశంగా యుఎఇ

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 16:** ప్రపంచ దేశాల పాస్‌పోర్ట్‌ల శక్తిని అంచనా వేసే పాస్‌పోర్ట్ ఇండెక్స్ 2026 లో భారత్ స్థానం పడిపోయింది. ఈ తాజా గ్లోబల్ ర్యాంకింగ్స్‌లో భారత పాస్‌పోర్ట్ 73వ స్థానంలో నిలిచింది. 2025లో 66వ స్థానంలో ఉన్న భారత్.. ఈ ఏడాది ఏకంగా ఏడు స్థానాలు దిగజారింది. ఇదే సమయంలో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఎఇ) పాస్‌పోర్ట్ ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైనదిగా మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది. ఆఫ్ఘనిస్తాన్ పాస్‌పోర్ట్ అత్యంత బలహీనమైనదిగా జాబితాలో చిట్టచివరన నిలిచింది. ఆర్టన్ క్యాపిటల్ సంస్థ ఈ పాస్‌పోర్ట్ ఇండెక్స్‌ను రూపొందిస్తున్నది. వీసా లేకుండా (వీసాఫ్రీ), వీసా ఆన్ అరైవల్ సౌకర్యాలున్న దేశాల సంఖ్య ఆధారంగా 'మొబిలిటీ స్కోర్'(ఎంఎస్) కేటాయిస్తారు. ఈ స్కోర్ ఎంత ఎక్కువగా ఉంటే ఆ పాస్‌పోర్ట్ అంత శక్తిమంతమైనదని అర్థం. మొత్తం 199 దేశాల పాస్‌పోర్ట్‌లను ఈ ర్యాంకింగ్ కోసం విశ్లేషించారు. ప్రస్తుతం భారత్ మొబిలిటీ స్కోర్ 69గా ఉంది. ఈ స్కోర్‌తో భారత్ జింబాబ్వే, ఉగాండా, ఉజ్బెకిస్తాన్, సావో టోమ్ అండ్ ప్రిన్సిపీ, వియత్నాం వంటి దేశాలతో కలిసి 73వ స్థానాన్ని పంచుకుంటోంది. భారత పాస్‌పోర్ట్ ఉన్నవారు 25 దేశాలకు వీసా లేకుండా ప్రయాణించవచ్చు. మరో 39 దేశాల్లో వీసాఆన్ అరైవల్ సౌకర్యం ఉంది. అయితే 129 దేశాలకు వెళ్లాలంటే ముందస్తుగా వీసా తప్పనిసరి. గత ఏడాదితో పోలిస్తే వీసా ఆన్ అరైవల్ దేశాల సంఖ్య తగ్గడంతో మొబిలిటీ స్కోర్ 73 నుంచి 69 కి పడిపోయింది. భారత్ ర్యాంకు పతనానికి ఇదే ప్రధాన కారణంగా కనిపిస్తోంది. ఈ జాబితాలో యూఏఈ పాస్‌పోర్ట్ 181 మొబిలిటీ స్కోర్‌తో ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైనదిగా మొదటి స్థానంలో నిలిచింది. యూఏఈ పౌరులు 138 దేశాలకు వీసా లేకుండా, 43 దేశాలకు వీసాఆన్‌అరైవల్‌తో ప్రయాణించవచ్చు. కేవలం 17 దేశాలకు మాత్రమే వారికి వీసా అవసరం. ఇక ఈ జాబితాలో ఆఫ్ఘనిస్తాన్ పాస్‌పోర్ట్ అత్యంత బలహీనమైనదిగా 99వ ర్యాంకులో ఉంది. దాని మొబిలిటీ స్కోర్ కేవలం 35 మాత్రమే. ఆఫ్ఘన్ పౌరులు ఏకంగా 163 దేశాలకు కచ్చితంగా వీసా తీసుకోవాల్సిందే.

అయితే ఇలాంటి గ్లోబల్ పాస్‌పోర్ట్ ర్యాంకింగ్‌లను భారత ప్రభుత్వం అంగీకరించడం లేదు. కొన్ని ప్రైవేట్ సంస్థలు ఏకపక్షంగా నిర్ణయించిన పారామీటర్ల ఆధారంగా ఈ నివేదికలను రూపొందిస్తున్నాయని కేంద్రం భావిస్తోంది. దీనిపై విదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ గత జూలై 31న లోక్‌సభలో లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 'పాస్‌పోర్ట్‌లకు ర్యాంకులు ఇవ్వడానికి ప్రపంచ వ్యాప్తంగా ఆమోద యోగ్యమైన ప్రమాణాలు లేవు. అందుకే ఏ ర్యాంకింగ్ వ్యవస్థను ప్రామాణికంగా తీసుకోలేం' అని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది.



# ఎఐ వినియోగంలో భారత్ భేష్
## - మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 16:** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) గత సాంకేతిక విప్లవాల కన్నా ప్రాథమికంగా భిన్నమైనదని, రాబోయే మార్పుల స్థాయి, వేగానికి సమాజం ఇంకా సిద్ధంగా ఉండకపోవచ్చని మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ హెచ్చరించారు. ఎఐ అసాధారణ సామర్థ్యాన్ని ఆయన ప్రస్తావిస్తూ, సామాజిక, అభివృద్ధి ప్రయోజనాల కోసం ఈ సాంకేతికతను ఎంత వేగంగా వినియోగించవచ్చో చెప్పడానికి భారతదేశాన్ని ఒక ఉదాహరణగా పేర్కొన్నారు. "ఇది అద్భుతమైన సామర్థ్యాల సముదాయం. మంచి పనులను వీలైనంత వేగంగా ఎలా ముందుకు తీసుకెళ్లాలో భారతదేశం నిరూపిస్తోంది" అని వివరించారు. ఎఐ తీసుకురాబోయే విస్తృత మార్పులకు సమాజం సిద్ధం కావడానికి ఎక్కువ సమయం ఇవ్వాలంటే, ప్రపంచం ఈ పురోగతిని నెమ్మదింపజేయడాన్ని పరిగణించాలని అభిప్రాయపడ్డారు. ఇంటర్నెట్ కన్నా ఎఐ ప్రాథమికంగా భిన్నమైనదని, దాని ప్రభావాన్ని అంత సులభంగా నిర్వహించలేమని భావించవచ్చని హెచ్చరించారు. "ఎఐ చాలా ప్రత్యేకమైన సాంకేతికత. ఇతర సాంకేతికతలను నిర్వహించినంత సులభంగా ఎఐ ప్రభావాలను కూడా నిర్వహించడం సాధ్యమవుతుందని భావించే వారిని హెచ్చరిస్తున్నా. ఎఐ అభివృద్ధి విస్తృతి, వేగం, ఆవిష్కరణలపై దీర్ఘకాలంగా నమ్మకం ఉన్న తనలాంటి వ్యక్తిని సైతం, ఈ వేగాన్ని ప్రశ్నించాల్సిన అవసరం ఉందా అని ఆలోచింపజేస్తోంది. ఇంత వేగవంతమైన మార్పుకు సిద్ధంగా ఉండాల్సిన అవసరం ఉన్నందున, మనం విషయాలను నెమ్మదింపజేయగలిగితే, ఆ విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలని భావిస్తున్నా అని గేట్స్ పేర్కొన్నారు. సైబర్ దాడులు చేసేవారి సామర్థ్యాలను ఎఐ సాధనాలు గణనీయంగా బలోపేతం చేయగలవని హెచ్చరించారు. రక్షణ సామర్థ్యాలు కూడా అంతే వేగంగా అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

# జపాన్‌లో లక్షదాటిన శతాధిక వృద్ధులు

**టోక్యో, సెప్టెంబరు 16:** దేశంలో శతాధిక వృద్ధుల సంఖ్య లక్ష మార్కును అధిగమించి జపాన్ సరికొత్త రికార్డు దక్కించుకుంది. అక్కడ ప్రస్తుతం 1,07,677 మంది శతాధికులు ఉన్నట్లు జపాన్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఈనెల 15న అధికారికంగా ప్రకటించింది. వందేళ్ల పైబడిన వారి సంఖ్య ఏటా పెరుగుతూ వస్తున్నది. ఇలా క్రమం తప్పకుండా శతాధికుల సంఖ్య పెరగడం అనేది గత 56 ఏండ్లుగా వరుసగా కొనసాగుతున్నది. ఆరోగ్య శాఖ విడుదల చేసిన గణాంకాల ప్రకారం శతాధికుల్లో మహిళలదే అగ్రస్థానం.

మొత్తం సంఖ్యలో సుమారు 88 శాతం, అంటే 94,298 మంది మహిళలే ఉన్నారు. ప్రస్తుతం దేశంలో అత్యంత వృద్ధురాలిగా క్యోటోకు చెందిన 114 ఏళ్ల ఫుయోమి కిషిమోటో, అత్యంత వృద్ధుడిగా కుమామోటోకు చెందిన 112 ఏళ్ల హికారు కాటో రికార్డుల్లో నిలిచారు. జపాన్‌లో శతాధికుల సంఖ్య వృద్ధిని పరిశీలిస్తే 1963లో గణాంకాల సేకరణ ప్రారంభమైనప్పుడు వీరి సంఖ్య కేవలం 153 మాత్రమే ఉండేది.

# మోడీస్నేహితుడి భూకబ్జాకేసుకు ఎట్టకేలకు పరిష్కారం

## శరవేగంగా కదిలిన మహారాష్ట్ర అధికారులు



**న్యూఢిల్లీ,సెప్టెంబరు 16:** మహారాష్ట్రలోని మీరాభయాందర్ ప్రాంతంలో సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న ఒక సంచలనాత్మక భూవివాదానికి ఎట్టకేలకు ఓ ముగింపు లభించింది. భారత ప్రధాని నరేంద్ర మోడీ చిన్ననాటి పాఠశాల స్నేహితుడైన 81 సంవత్సరాల అస్గర్ అలీ వోహ్రా స్వయంగా ప్రధానిని కలవడంతో ఈ వ్యవహారంలో చకచకా అడుగులు పడ్డాయి. ప్రధాని మోడీ దృష్టికి విషయం వెళ్లిన వెంటనే రంగంలోకి దిగిన అధికారులు, బీజేపీ నాయకుడు నరేంద్ర మెహతాతో మాట్లాడి వివాద పరిష్కారానికి మార్గం సుగమం చేశారు. దీంతో సదరు వివాదాస్పద ప్లాట్‌పై తమకున్న స్వాధీన హక్కులను వదులుకుంటున్నట్లు ప్రకటించిన మెహతా నిర్మాణ అనుమతులను టౌన్ ప్లానింగ్ విభాగానికి వెనక్కి ఇచ్చేశారు. ఇరువర్గాల మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం వోహ్రాపై గతంలో చేసిన పోలీసు ఫిర్యాదును సైతం ఉపసంహరించుకున్నారు. గుజరాత్‌లోని వాద్‌నగర్ బి.ఎన్. స్కూల్‌లో ప్రధాని మోడీతో కలసి విద్యాభ్యాసం చేసిన అస్గర్ అలీ వోహ్రా 1989వ సంవత్సరంలో భయాందర్ ఈస్ట్‌లోని నవ్‌ఘర్ ప్రాంతంలో సుమారు 2,810 చదరపు మీటర్ల భూమిని రిజిస్టర్డ్ ఒప్పందం ద్వారా కొనుగోలు చేశారు. ఆ స్థలాన్ని తాను ఎవరికీ విక్రయించకపోయినప్పటికీ 2011లో నకిలీ పత్రాలు సృష్టించి ప్లాట్‌ను తన ప్రమేయం లేకుండానే రెండు భాగాలుగా విభజించారని వోహ్రా ఆరోపించారు. అందులో ఒక భాగాన్ని స్వయం బిల్డర్స్, మరో భాగాన్ని నరేంద్ర మెహతాకు చెందిన సెవెన్ ఎలెవన్ కన్స్ట్రక్షన్స్ ఆక్రమించుకున్నాయని ఆయన తెలిపారు. అసలైన యజమాని అనుమతి లేకపోయినా మీరాభయాందర్ మున్సిపల్ కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ విభాగం నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేయడంపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేషన్, రెవెన్యూ, పోలీస్ అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేకపోవడం, 2015లో నమోదైన ఎఫ్ఐఆర్‌కు సంబంధించి సీఐడీ నివేదిక రావడానికి ఏకంగా ఈ ఏడాది వరకు నిరీక్షించాల్సి రావడం వెనుక రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయనే అనుమానాలు వ్యక్తం అయ్యాయి. దీంతో విసిగిపోయిన వోహ్రా ఈనెల 8వ తేదీన నేరుగా ప్రధాని మోడీని కలిసి తనకు జరిగిన అన్యాయాన్ని వివరించారు. నకిలీ పత్రాల సృష్టి, అధికారులు, బిల్డర్ల కుమ్మక్కుపై సీబీఐ దర్యాప్తు జరిపించాలని విజ్ఞప్తి చేశారు. వెంటనే స్పందించిన మహారాష్ట్ర ప్రభుత్వ ప్రధాని దృష్టికి విషయం వెళ్లడంతో మహారాష్ట్ర ఉన్నతాధికారులు వేగంగా స్పందించారు. ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీకర్ పరదేశి నేతృత్వంలో రాష్ట్ర సచివాలయంలో ఒక ప్రత్యేక భేటీ నిర్వహించారు. ఈ సమావేశానికి అస్గర్ వోహ్రా, నరేంద్ర మెహతాతో పాటు మున్సిపల్ కమిషనర్ రాధా వినోద్ శర్మ, టౌన్ ప్లానర్ పురుషోత్తమ్ షిండే హాజరయ్యారు. ఈ సందర్భంగా మెహతా స్పందిస్తూ 2019లో మెర్విన్ ఫెర్నాండెజ్ నుంచి కొనుగోలు చేసారు.

# జిన్‌పింగ్‌కు తీవ్రస్థాయి ఇస్కీమిక్ స్ట్రోక్!



**బీజింగ్,సెప్టెంబరు 16:** చైనా అధ్యక్షుడు షి జిన్‌పింగ్ తీవ్ర అనారోగ్యంతో ఉన్నట్లు అంతర్జాతీయ మీడియా చెబుతోంది. ఇటీవల, బ్రిక్స్ సదస్సు కోసం భారత్ వచ్చిన ఆయన, తిరిగి చైనా వెళ్లిన వెంటనే ఆస్పత్రిలో చేరినట్లు వార్తా కథనాలు నివేదించాయి. దీనిపై ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. సోషల్ మీడియాలో మాత్రం జిన్‌పింగ్ ఆరోగ్యంపై ఊహాగానాలు తీవ్రమవుతున్నాయి. బ్రిక్స్ సదస్సు సందర్భంగా ఆయన స్పృహ కోల్పోయారని, దీని తర్వాత వైద్య సహాయం అందించారని, తీవ్ర ఇస్కీమిక్ స్ట్రోక్‌కు గురైనట్లు వైద్యులు నిర్ధారించారని కొన్ని ఆన్‌లైన్ పోస్టులు నివేదించాయి. చైనా డెమోక్రసీ పార్టీ చైర్మన్ షీ వాంజున్ తన ఎక్స్ ఖాతాలో ఈ ఆరోపణలు చేసినట్లు పలు మీడియా సంస్థలు వెల్లడించాయి. ఢిల్లీలో వైద్య చికిత్సకు నిరాకరించిన జిన్‌పింగ్, ప్రత్యేక విమానంలో బీజింగ్ చేరిన వెంటనే ఆస్పత్రిలో చేరినట్లు చెబుతున్నారు. సాధారణంగా విదేశీ పర్యటన ముగించుకువచ్చిన తర్వాత జిన్‌పింగ్‌కు ఎయిర్‌పోర్టులోనే భారీ స్వాగతం పలిచేందుకు పెద్ద సంఖ్యలో అధికారులు ఉంటారని, కానీ ఈ సారి ఆ సందడి లేదని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నట్లు నివేదికలు సూచించాయి. జిన్‌పింగ్‌ను అత్యంత రహస్యంగా ఉండే ఆస్పత్రికి హెలికాప్టర్‌లో తరలించారని, ఆయన పరిస్థితి విషమంగా ఉందనే వార్తలు వస్తున్నాయి. దీనికి ముందు బ్రిక్స్ సమావేశంలో కూడా కొన్ని సంఘటనలు ఆయన ఆరోగ్యంపై అనుమానాలను రేకెత్తించాయి. బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశంలో ప్రధాని నరేంద్ర మోడీ ప్రసంగిస్తూ జిన్‌పింగ్‌ను గమనిస్తూ కొన్ని క్షణాలు ఆయన ప్రసంగాన్ని ఆపారు. ఆ తర్వాత భారత్ బ్రిక్స్ అతిథులకు ఇచ్చిన డిన్నర్‌లో జిన్‌పింగ్ పాల్గొనకపోవడం కూడా సందేహాలను పెంచింది.

# డ్యూటీకి రాకుండానే రూ.70వేలు నెలసరిజీతం..
# ఎమ్మెల్యే మేనకోడలికి రాచమర్యాదలు



**బెంగళూరు, సెప్టెంబరు 16:** కాంగ్రెస్ ఎమ్మెల్యే మేనకోడలు ఒక ప్రైవేట్ మెడికల్ కాలేజీలో పోస్ట్ గ్రాడ్యుయేట్ వైద్య కోర్సు చేస్తున్నది. ప్రభుత్వ అనుబంధ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్నట్లుగా నెలకు రూ.70,000 జీతాన్ని ఆమె పొందుతున్న విషయం వెలుగులోకి రావడంతో అధికారులు చర్యలు చేపట్టారు. కర్ణాటకలోని బాగల్‌కోట్ ఎమ్మెల్యే ఉమేష్ మేటి మేనకోడలైన డాక్టర్ అంకితా యరగల్, ఒక ప్రైవేట్ వైద్య కళాశాలలో పోస్ట్ గ్రాడ్యుయేట్ వైద్య కోర్సు చేస్తున్నది. అలాగే ప్రభుత్వ అనుబంధ నమ్మ క్లినిక్‌లో ఆమె పనిచేస్తున్నట్లుగా నెలకు రూ.70 వేల వేతనం కూడా పొందుతున్నది. ఈ ఏడాది మార్చి నుంచి సెప్టెంబర్ వరకు వాంబే కాలనీలోని నమ్మ క్లినిక్‌లో వైద్య విధులకు డాక్టర్ అంకిత హాజరుకాలేదు. దీంతో వైద్య సేవల కోసం ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆమె విధులకు హాజరుకానప్పటికీ ప్రతి నెలా జీతం పొందుతున్నట్లు బయటపడింది. దీంతో బాగల్‌కోట్ జిల్లా పంచాయతీ సీఈవో గజానన్ బాలే దీనిపై విచారణ చేపట్టారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం, అనధికారిక ద్వంద్వ నియామకం ఆరోపణలపై ఆమెకు సమన్లు జారీ చేశారు. మరోవైపు తొలి నోటీస్‌కు డాక్టర్ అంకిత స్పందించలేదు. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 18న ఉదయం 10 గంటలకు జిల్లా పంచాయత్ కార్యాలయంలో జరుగనున్న తదుపరి విచారణకు హాజరు కావాలంటూ సీఈవో మరోసారి సమన్లు పంపారు. తదుపరి విచారణకు హాజరు కాకపోతే ఏకపక్షంగా నిర్ణయం తీసుకుని చర్యలు చేపడతామని హెచ్చరించారు. ఆమెకు చెల్లించిన జీతం లేదా గౌరవ వేతనాన్ని నిబంధనల ప్రకారం తిరిగి రాబడతామని అధికారులు వెల్లడించారు. అయితే డాక్టర్ అంకిత తండ్రి అయిన జిల్లా ఆరోగ్య అధికారి (డీహెచ్‌వో) రాజ్‌కుమార్ ఈ అంశంపై స్పందించారు. ఆమెను విధుల నుంచి తొలిగించారు. తన కుమార్తె ఎండీ కోర్సులో చేరినప్పటి నుంచి ఎలాంటి వేతనం తీసుకోలేదని ఆయన పేర్కొన్నారు. కుమార్తె అయిన డాక్టర్ అంకితకు మెడికల్ ఆఫీసర్ పోస్ట్ ఇవ్వడంలో ఆయన తండ్రి అయిన డీహెచ్‌వో ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలున్నాయి. దీంతో దీనిపై కూడా దర్యాప్తు జరుపుతున్నారు.

# భారత్,చైనా ఎల్‌ఎసి వద్ద సడలిన ఉద్రిక్తతలు



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 16:** భారత్‌చైనా సరిహద్దుల్లోని వాస్తవాధీన రేఖ (ఎల్ఏసీ) వద్ద గత కొన్ని సంవత్సరాలుగా నెలకొన్న దౌత్య, సైనిక సంక్షోభం క్రమంగా తొలగిపోతోంది. ఉత్తర సరిహద్దు ప్రాంతాల్లో చైనాకు చెందిన పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ (పీఎల్ఏ) తన సైనిక మోహరింపులను గణనీయంగా తగ్గించుకున్నట్లు భారత రక్షణ మంత్రిత్వ శాఖ తన వార్షిక నివేదికలో అధికారికంగా వెల్లడించింది. ఇరుదేశాల మధ్య నిరంతరం జరిగిన దౌత్య, రాజకీయ చర్చల ఫలితంగా సరిహద్దులో ఉద్రిక్తతలు తగ్గి స్థిరత్వం ఏర్పడటంతో పాటు జమ్మూ కశ్మీర్‌లోనూ శాంతిభద్రతలు గణనీయంగా మెరుగైనట్లు నివేదిక స్పష్టం చేసింది. 2020లో తూర్పు లద్దాఖ్ సెక్టార్‌లో చోటుచేసుకున్న భయాందోళనకర సైనిక ఘర్షణల తర్వాత సరిహద్దుల్లో ఇరుదేశాలు ఊహించని రీతిలో భారీగా దళాలను రంగంలోకి దించాయి. ఆ సమయంలో కేవలం లద్దాఖ్ ప్రాంతంలోనే చైనా 60వేల మందికి పైగా సైనికులను దింపింది. అయితే 2024లో రెండు దేశాల మధ్య కుదిరిన కీలకమైన సైనిక దళాల ఉపసంహరణ అవగాహన ఒప్పందం, ఆ తర్వాత ప్రధాని నరేంద్ర మోడీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌ల మధ్య జరిగిన ఉన్నత స్థాయి చర్చలు ఈ పరిస్థితుల్లో సానుకూల మార్పు తెచ్చాయి. రక్షణ శాఖ తాజా నివేదిక ప్రకారం ప్రస్తుతం చైనా సరిహద్దులకు ఇరువైపులా 10 చొప్పున కంబైన్డ్ ఆర్మ్స్ బ్రిగేడ్లను మాత్రమే అంటే సుమారు 50వేల మందితో మాత్రమే బందోబస్తు నిర్వహిస్తోంది. బీజింగ్ తన వైపు నుంచి సైనిక బలగాల సంఖ్యను తగ్గించినప్పటికీ భారతదేశం ఎలాంటి అలసత్వానికి తావివ్వడం లేదు.

వాస్తవాధీన రేఖ (ఎల్ఏసీ) పొడవునా ఉన్న అన్ని వ్యూహాత్మక సెక్టార్లలో భారత సైన్యం పటిష్టమైన వ్యూహాన్ని అమలు చేస్తూ సంసిద్ధతను కొనసాగిస్తోంది. భవిష్యత్తులో ఎదురయ్యే ఎలాంటి అపవాదులు లేదా అత్యవసర పరిస్థితులనైనా తక్షణమే తిప్పికొట్టేందుకు సైన్యం పూర్తి స్థాయి అప్రమత్తతతో నిఘా ఉంచినట్లు రక్షణ మంత్రిత్వ శాఖ నివేదిక వివరించింది. మరోవైపు భారత సైన్యం అహర్నిశలు శ్రమించడం వల్ల జమ్మూ కశ్మీర్ లోయలో శాంతిభద్రతలు మునుపటి కంటే ఎంతో బలపడ్డాయని నివేదిక తెలిపింది. పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయడం వల్ల లోయలోని ప్రజలు హింసను వీడి అభివృద్ధి మార్గాన్ని ఎంచుకున్నారు. ప్రభుత్వం, సైన్యం సంయుక్తంగా నిర్వహించే పలు కార్యక్రమాల్లో స్థానిక ప్రజలు విశేషంగా పాల్గొంటున్నారు. దీని ఫలితంగా ఒకప్పుడు నిత్యకృత్యంగా మారిన రాళ్ల దాడులు, నిరసనలు, హింసాత్మక ఘటనలు కాశ్మీర్‌లో పూర్తిగా కనుమరుగయ్యాయి. ఆపరేషన్ సిందూర్ సమయంలో నియంత్రణ రేఖ (ఎల్ఓసీ) వెంబడి పరిస్థితి పూర్తిగా మారిపోయి ప్రశాంత వాతావరణం నెలకొందని రక్షణ శాఖ పేర్కొంది.

# ఇరాన్‌దాడుల్లో కరిగిపోతున్న అమెరికా ఆయుధ సంపద

**దుబాయ్, సెప్టెంబరు 19:** ఇరాన్‌తో జరుగుతున్న వార్‌లో అమెరికా తన ఆయుధ సంపదను భారీగా పోగొట్టుకుంటున్నది. మిస్సైల్ ఇంటర్‌సెప్టార్లను విరివిగా వాడేస్తున్నది. పశ్చిమాసియాలో ఇరాన్ దాడులను తిప్పికొట్టేందుకు అమెరికా తన క్షిపణి రక్షణ వ్యవస్థను వినియోగిస్తున్నది. అయితే విభిన్న వ్యూహాలతో ఇరాన్ దాడులు చేస్తున్న నేపథ్యంలో అమెరికా తన ఆయుధాలను అధికంగా వాడాల్సి వస్తున్నది. గత వారం జోర్డాన్‌లోని అమెరికా వైమానిక దళంపై ఇరాన్ దాడి చేసిన విషయం తెలిసిందే. బాలిస్టిక్ క్షిపణులతో ఇరాన్ విరుచుకుపడింది. ఆ దాడిని తిప్పికొట్టేందుకు అమెరికా సుమారు 70 హై ఎండ్ ఎయిర్ డిఫెన్స్ ఇంటర్‌సెప్టార్లను వాడినట్లు తెలుస్తోంది. కేవలం 20 ఇరానీ బాలిస్టిక్ క్షిపణులను కూల్చేందుకు సుమారు 60 నుంచి 70 వరకు పేట్రియాట్ ఇంటర్‌సెప్టార్లను వాడినట్లు అంచనా వేస్తున్నారు. వీటితో పాటు డజన్ సంఖ్యలో థాడ్ ఇంటర్‌సెప్టార్లను కూడా వాడినట్లు తెలుస్తోంది. ఇరానీ దళాలు జోర్డాన్‌లో ఉన్న ముహాఫక్ సాల్తీ ఎయిర్ బేస్‌పై అటాక్ చేసిన విసయం తెలిసిందే.

ఆ సమయంలో సుమారు 20 క్షిపణులను ఇరాన్ వదిలింది. వాటిలో 18 క్షిపణులను అమెరికా దళాలు కూల్చివేశాయి. అమెరికా, జోర్డాన్ సంయుక్తంగా దాడిని తిప్పికొన్నా, కొన్ని ఇరానీ క్షిపణులు బేస్‌ను ఢీకొట్టి అక్కడ ఉన్న విమానాలను ధ్వంసం చేశాయి.


# పాక్ మోస్ట్ వాంటెడ్ జాబితాలో మసూద్ అజహార్

## రూ.70 లక్షల పాకిస్థానీ రూపాయల రివార్డు



**ఇస్లామాబాద్, సెప్టెంబరు 16:** ఉగ్రవాద నిరోధక చర్యల విషయంలో అంతర్జాతీయ ఒత్తిడి ఎదుర్కొంటున్న పాకిస్థాన్ కీలక నిర్ణయం తీసుకుంది. భారత్‌లో అనేక రక్తపాత దాడులకు పాల్పడిన మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది, జైషే మహమ్మద్ అధినేత మసూద్ అజార్ సమాచారం అందించిన వారికి ఇచ్చే రివార్డును 70 లక్షల పాకిస్థానీ రూపాయిలకు పెంచుతున్నట్లు ప్రకటించింది. పాకిస్థాన్ ఫెడరల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎఫ్ఐఏ) తన 2026 నాటి 'రెడ్ బుక్ ఆఫ్ మోస్ట్ వాంటెడ్ హై ప్రొఫైల్ టెర్రరిస్ట్స్' జాబితాలో మసూద్ అజార్ పేరును చేర్చడంతో పాటు ఈ భారీ బహుమతిని ఖరారు చేసింది. మసూద్ అజార్ తమ భూభాగంలో లేడని, ఆయన అఫ్ఘానిస్థాన్‌కు పారిపోయాడని ఇస్లామాబాద్ ఇన్ని రోజులూ అంతర్జాతీయ సమాజం వద్ద వాదిస్తూ వచ్చింది. అయితే ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్ (ఎఫ్ఏటీఎఫ్) రాబోయే అక్టోబర్ 26వ తేదీ నుంచి 30వ తేదీ వరకు పారిస్‌లో ప్లీనరీ సమావేశాన్ని నిర్వహించనుంది. ఉగ్రవాదానికి నిధుల పంపిణీ, మనీ లాండరింగ్ నిరోధక చర్యలపై దేశాల పనితీరును సమీక్షించే ఈ సమావేశం వేళ మళ్లీ గ్రే లిస్ట్ ప్రమాదం ముంచుకొస్తుందన్న భయంతోనే పాక్ తన అధికారిక రికార్డుల్లో అజార్ పేరును మోస్ట్ వాంటెడ్‌గా చేర్చి పారితోషికం పెంచినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. భారత్‌పై అనేక దాడుల సూత్రధారి 58 ఏళ్ల వయసు కల్గిన మసూద్ అజార్ నేతృత్వంలోని జైషే మహమ్మద్ సంస్థ పాకిస్థాన్‌లోని బహావల్‌పూర్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తూ భారత గడ్డపై అత్యంత దారుణమైన ఉగ్ర దాడులకు ఒడిగట్టింది. 2001 పార్లమెంట్ దాడి, 2008 ముంబై ఉగ్రదాడులు, 2016 పఠాన్‌కోట్ ఎయిర్‌బేస్ దాడి, 2019 పుల్వామా దాడి వెనుక మసూద్ హస్తం ఉంది. 2025 నవంబర్ 10వ తేదీన ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన పేలుడు ఘటన దర్యాప్తులోనూ మసూద్ అజార్ పేరు మళ్లీ వెలుగులోకి వచ్చింది. ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి ఇప్పటికే ఇతడిని అంతర్జాతీయ ఉగ్రవాదిగా ప్రకటించిన విషయం తెలిసిందే.

# యువతిని కారుతో ఢీకొట్టి ఈడ్చుకెళ్లిన ప్రియుడు!



**లక్నో, సెప్టెంబరు 16:** దేశంలో రోజురోజుకు మహిళలపై ఘోరాలు పెరిగిపోతున్నాయి. ఎన్ని కఠిన చట్టాలొచ్చినా అబలలకు మాత్రం రక్షణ కరవుతోంది. మొన్నటికి మొన్న గురుగ్రామ్‌లో ఓ మహిళా బైకర్‌ను ఓ మృగాడు కారుతో ఢీకొట్టి పరారయ్యాడు. ఈ ఘటనలో బాధితురాలు స్వల్ప గాయాలతో బయటపడింది. ఈ ఘటనను ఇంకా మరిచిపోక ముందే ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో మరో దుర్మార్గంజరిగింది. ఓ యువతిని కారు ఢీకొట్టి పరారయ్యాడు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ ఘటనలపై మహిళా లోకం ఆందోళనకు గురవుతోంది. ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నో గోమతీనగర్‌లోని జ్ఞానేశ్వర్ మిశ్రా పార్క్ సమీపంలో ఓ యువతిని కారు ఢీకొట్టి కొంతదూరం ఈడ్చుకెళ్లిన ఘటన కలకలం రేపింది. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా గుర్తించిన షహన్వాజ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని, అతడి కారును స్వాధీనం చేసుకున్నారు. జ్ఞానేశ్వర్ మిశ్రా పార్క్ గేట్ నంబర్ 4 సమీపంలో ఈ ఘటన జరిగింది. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆమెను వైద్య పరీక్షల కోసం ఆస్పత్రికి పంపించారు. ప్రాథమిక దర్యాప్తులో నిందితుడు షహన్వాజ్, బాధితురాలు దాదాపు ఏడాది కాలంగా ఒకరికొకరు పరిచయం ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. పార్క్ సమీపంలో షహన్వాజ్ మరో యువతితో కనిపించడాన్ని బాధితురాలు గమనించడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగినట్లు దర్యాప్తులో తేలింది. ఈ క్రమంలో ఆమె కారు ముందు నిలబడినట్లు పోలీసులు చెబుతున్నారు. అనంతరం కారు ఆమెను ఢీకొట్టి కొంతదూరం ఈడ్చుకెళ్లినట్లు సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఆమెను ఉద్దేశపూర్వకంగా కారుతో ఢీకొట్టాడా లేక ఘటన అనుకోకుండా జరిగిందా అనే విషయాన్ని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# సంక్షిప్త వార్తలు

## పవిత్ర మక్కాలోకి హౌతీడ్రోన్



**దుబాయి, సెప్టెంబరు 16:** పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు ఇప్పుడు సౌదీ అరేబియాలోని ముస్లింల పవిత్ర నగరం మక్కా సమీపానికీ చేరాయి. మక్కా నగరానికి సమీపంలోని నిషేధిత గగనతలంలోకి ఓ డ్రోన్ ప్రవేశించేందుకు ప్రయత్నించగా సౌదీ అరేబియా రాయల్ ఎయిర్ డిఫెన్స్ బలగాలు దానిని అడ్డుకుని కూల్చివేసినట్లు సౌదీ అధికారులు వెల్లడించారు. ఈ ఘటన నేపథ్యంలో మక్కా, జెడ్డా, తైఫ్ నగరాల్లో భద్రతా అప్రమత్తతను పెంచారు.

## అరేబియా సముద్రజలాల్లో ఢీకొన్న ఇండోపాక్ నౌకలు!




**న్యూఢిల్లీ, సెప్టెంబరు 16:** అంతర్జాతీయ సముద్ర జలాల్లో ఇండో, పాక్ నౌకలు ఢీకొన్నాయి. ఈ ఘటనపై ఇవాళ భారత్ తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. పాకిస్థాన్ నౌకాదళ వ్యవహారం ఆమోదయోగ్యంగా లేదని, దాని ప్రవర్తన ప్రొఫెషనల్‌గా లేదని భారత్ పేర్కొన్నది. ఈ నేపథ్యంలో పాకిస్థాన్ దౌత్యవేత్తకు భారత్ సమన్లు జారీ చేసింది. భారతీయ నేవీ నౌకను పాక్ నేవీ నౌక ఢీకొన్నట్లు విదేశాంగ వర్గాలు తెలిపాయి.

## ఇన్‌స్టా రీల్స్‌లో గన్‌తో కనిపించడంతో పోలీస్ సస్పెన్షన్



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 16:** దేశ రాజధాని ఢిల్లీలో భారత్ అధ్యక్షతన ఇటీవల జరిగిన బ్రిక్స్ సదస్సు సందర్భంగా భద్రతా విధుల్లో ఉన్న ఒక పోలీస్ తన వద్ద ఉన్న గన్స్‌తో రీల్స్ చేసి వీడియో క్లిప్స్‌ను సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో అధికారుల దృష్టికి వెళ్లింది. ఈ నేపథ్యంలో ఆ పోలీస్‌ను సస్పెండ్ చేశారు. ఈనెల 12, 13 తేదీల్లో నిర్వహించిన బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు సందర్భంగా ఢిల్లీ పోలీస్ కానిస్టేబుల్ దీపక్ బంగర్ రూఫ్‌టాప్ స్నైపర్ డ్యూటీ నిర్వహించారు.


## ఆర్టీసి బస్సులకు టివికె పార్టీ రంగులు!



చెన్నై, సెప్టెంబరు 16: తమిళనాడులో విజయ్ ముఖ్యమంత్రి పగ్గాలు చేపట్టిన తర్వాత వరుసగా ఏదో ఒక వివాదంలో చిక్కుకుంటున్నారు. విజయ్ ప్రభుత్వం ఇపుడు మరో వివాదంలో చిక్కుకుంది. సేలంలో 25 కొత్త ప్రభుత్వ టౌన్ బస్సులను టీవీకే పార్టీ జెండాలో ఉండే పసుపు, ఎరుపు రంగుల్లో సిద్ధం చేయడం రాజకీయ చర్చకు దారితీసింది. జాన్సన్‌పేట్ ప్రాంతం నుంచి ఈ కొత్త బస్సుల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు.

అయితే, ప్రభుత్వ బస్సులకు టీవీకే పార్టీ జెండాను పోలిన రంగులు వేయడంపై సోషల్ మీడియాలో తీవ్ర చర్చ జరుగుతోంది.

## తదుపరి పిఎం యోగి అంటూ ఓ వీరాభిమాని పచ్చబొట్టు




**లక్నో, సెప్టెంబరు 16:** ఉత్తర్ ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్‌స్వతహాగా ఓ సాధువు. సీఎం కాకముందు గోరఖ్ పూర్ ఆలయంలో పూజలు చేస్తూ కనిపించిన యోగీ ఆ తర్వాత మాత్రం రాజకీయాల్లో బిజీ అయిపోయారు. యూపీలోని బిజ్నోర్‌కు చెందిన ముస్లిం న్యాయవాది తాబిష్ నిసార్ కు సీఎం యోగి ఆదిత్యనాథ్ అంటే వీరాభిమానం. నిసార్ తన అభిమాన నేత యోగీపై తనకున్న అభిమానాన్ని వ్యక్తం చేస్తూ తాజాగా ఛాతీపై శాశ్వత పచ్చబొట్టు వేయించుకున్నారు. తన ఛాతీపై "నెక్స్ట్ పిఎం, సిఎం సాహెబ్ మహారాజ్ జీ యోగి జీ బీజేపీ" అనే పదాలను పచ్చబొట్టుగా వేయించుకున్నారు.

## డిఎస్సీపై వైసిపి ఆరోపణలు నిరాధారం

- ఉద్యోగాల కల్పనను ఓర్వలేకే దుష్ప్రచారం

: మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి



**అమరావతి, సెప్టెంబరు 16 ప్రభాతవార్త ప్రతినిధి:** డిఎస్సీ నియామకాలపై వైసిపి నేతలు చేస్తున్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని రాష్ట్ర రవాణా, యువ జన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. కూటమి ప్రభుత్వం పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా ఉద్యోగ ని యామకాలు చేపడుతుంటే వాటిని ఓర్వలేక వైసిపి నేతలు అసత్య ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చిత్త శుద్ధితో పనిచేస్తోందన్నారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో నిరుద్యోగ యువ తకు జరిగిన అన్యాయాలను ప్రజలు ఇంకా మర్చిపోలేదని మంత్రి అన్నారు. ఐదేళ్లపాటు ఉద్యోగాల భర్తీని నిర్లక్ష్యం చేసిన వారు ఇప్పుడు కూటమి ప్రభు త్వం ఉద్యోగాలు కల్పిస్తుంటే విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉంద న్నారు. స్పోర్ట్స్ కోటా నియామకాలపై కూడా నిబంధనల ప్రకారమే అర్హత, ప్రతిభ ఆధారంగా నియామక ప్రక్రియ కొనసాగుతుందని మంత్రి స్పష్టం చేశా రు. క్రీడాకారులకు కూటమి ప్రభుత్వం పూర్తి ప్రోత్సాహం అందిస్తోందన్నారు. క్రీడా రంగాన్ని బలోపేతం చేయడంతో పాటు ప్రతిభ కలిగిన క్రీడాకారులకు తగిన అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. డిఎస్సీ పేరుతో నిరుద్యోగ యువతను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను వైసిపి నేతలు మానుకోవాలని మంత్రి హితవు పలికారు.

# ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట

- విద్యుత్ శాఖ కారుణ్య నియామకాల ద్వారా 389 మందికి ఉద్యోగాలు
- ఎపిసిపిడిసిఎల్‌లో 25 మందికి ఉద్యోగ నియామకాలు
- రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

**విజయవాడ, సెప్టెంబరు 16 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో విద్యుత్ శాఖ ఉద్యోగుల సంక్షేమం, యువతకు ఉద్యోగ అవకాశా టలు, విద్యుత్ రంగంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. స్థానిక గుణదలలోని ఆంధ్రప్రదేశ్ మధ్య ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థల్లో కారుణ్య నియామక ఉత్తర్వులు అందించే ప్రదాన కార్యక్రమంలో ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పాల్గొని మాట్లాడుతూ విద్యుత్ శాఖలో చేపడుతున్న వివిధ ఉద్యోగ, సంక్షేమ, అభివృద్ధి కార్యక్ర మాలను వివరించారు. కారుణ్య నియావ కాల ద్వారా 389 మందికి ఉద్యోగాలు కారుణ్య నియా టమకాల కింద తాజాగా 25 మంది ఉద్యోగార్థులకు ఉద్యోగ నియామక పత్రాలను మంత్రి అందజేశామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ట్రాన్స్ కో, జెన్‌కో, సిపిడిసిఎల్, ఇపిడిసిఎల్, ఎస్‌పిడిసిఎల్ సంస్థల్లో ఇప్పటివరకు మొత్తం 389 మందికి కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాలు కల్పించినట్లు తెలిపారు. మరణించిన విద్యుత్ శాఖ ఉద్యోగుల కుటుంబాల్లో వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు. ఉద్యోగి పిల్లలు చిన్న వయస్సులో ఉన్నా, అర్హత కలిగిన వయస్సుకు వచ్చినా వారు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అర్హులైన మరో 35 నుంచి 45 మందికి కట్‌ఆఫ్ తేదిని నిర్ణయించి ప్రత్యేకంగా పరిగణించి వారికి ఉద్యోగాలు కల్పించేందుకు అధికారు లను ఆదేశించినట్లు చెప్పారు. 629 ఎఇ పోస్టుల భర్తీకి పరీక్షలు నిర్వహించామన్నారు. త్వరలో ఫలితాలు విడుదల చేస్తామని మంత్రి తెలిపారు. త్వరలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియను పూర్తి చేసి, అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా నియామక ప్రక్రియ ను నిర్వహించేందుకు చర్యలు తీసుకుం టున్నట్లు వెల్లడించారు.



కారుణ్య నియామక పత్రాన్ని అందిస్తున్న రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్.

**గ్రీన్ ఎనర్జీకి ప్రోత్సాహం:**

రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో గ్రీన్ ఎనర్జీని ప్రోత్సహించేందుకు సోలార్, విండ్ ప్రాజెక్టులను ప్రోత్సహిస్తున్నామని మంత్రి తెలిపారు. సౌర విద్యుత్ వినియోగాన్ని మరింత విస్తరించే చర్యల్లో భాగంగా సుమారు 6 లక్షల మంది ఎస్సీ, ఎస్టీ వర్గాల కుటుంబాలకు సూర్య ఘర్ పథకం ద్వారా ఇళ్లపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ మౌలిక వసతులను బలోపేతం చేసేందుకు ఆర్డీఎస్ఎస్ పథకం ద్వారా సుమారు రూ.10,000 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు మంత్రి తెలిపారు. విద్యుత్ శాఖలో ఉద్యోగ నియామకాలతో పాటు ఉద్యోగుల సంక్షేమం, శిక్షణ, పునరుత్పాదక ఇంధన ప్రోత్సాహం, గ్రామీణ విద్యుత్ మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం సమగ్ర చర్యలు చేపడుతోందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. కార్యక్రమం అనంతరం మంత్రి గొట్టిపాటి రవికుమార్ కారుణ్య ఉద్యోగ నియామక పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఎపిసిపిడిసిఎల్ సిఎండి పి.పుల్లారెడ్డి, డైరెక్టర్ టెక్నికల్ ఆవుల మురళీకృష్ణ యాదవ్, డైరెక్టర్ ప్రాజెక్ట్స్ హెచ్‌ఆర్ టివిఎస్ఎన్ మూర్తి, డైరెక్టర్ ఫైనాన్స్ ఎస్.వెంకటేశ్వర్లు, సిజిఎంలు, జిఎంలు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## జ్యోతి యర్రాజీకి మంత్రి లోకేష్ అభినందన

**విజయవాడ, సెప్టెంబరు 16 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆసియా క్రీడల్లో సత్తా చాటేందుకు సిద్ధమ వుతున్న జ్యోతి యర్రాజీకి ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రిలోకేష్ 'ఆల్ ది బెస్ట్ తెలిపారు. ఈ మేరకు ఎక్స్‌లో మంత్రి పోస్టు పెట్టారు. ఎంతోమంది యువ క్రీడాకారులకు జ్యోతి యర్రాజీ స్ఫూర్తిగా నిలుస్తున్నారని అబినందించారు. ఈ నెల 25, 26వ తేదీల్లో మహిళల 100 మీటర్ల హర్డిల్స్‌లో జ్యోతియ ర్రాజీ బరిలోకి దిగుతున్నారని ప్రశంసించారు. ఆమె వేగంగా పరుగెత్తి భారత్‌కు ఘనత తీసు కురావాలని ఆకాంక్షిస్తున్నానని అన్నారు.

## జిలెటిన్ స్టిక్స్ కేసు నిందితుడు లొంగుబాటు

**విజయవాడ(క్రైం), సెప్టెంబరు 16 ప్రభాతవార్త ప్రతినిధి:** విజయవాడ జిలెటిన్ స్టిక్స్ అక్రమ రవాణా కేసులో నిందితుడు లొంగిపోయాడు. భవన నిర్మాణ కాంట్రాక్ట్ కార్మికుడిగా పనిచేస్తున్న బాలయ్య కుటుంబసభ్యులతో కలిసి కృష్ణలంక పోలీసుస్టేషన్‌కు వచ్చి బస్సులో జిలెటిన్ స్టిక్స్ బ్యాగు మరచిపోయానంటూ లొంగి పోయాడు. అదే బస్సులో ప్రయాణించిన మరో ప్రయాణీకుడు బ్యాగు మారింది. పేలు డు పదార్దాలు ఉండటంతో అతను ఆ బ్యా గును పోలీసులకు అప్పగించాడు. ఈ ఘట నపై కృష్ణలంక పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ సమాచారాన్ని తెలుసుకున్న బాల య్య స్టేషన్‌కు వచ్చి బ్యాగు తనదేనని తెలిపాడు.

## డిఎస్సీపై ఆరోపణలు కాదు ఆధారాలు చూపండి

- ప్రభుత్వ ఉపాధ్యాయుల్లో 90శాతం

టిడిపి హయాంలో నియమితులైనవారే: మంత్రి కొల్లు రవీంద్ర



**విజయవాడ, సెప్టెంబరు 16 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు, బదిలీల్లో పారదర్శకతకు బీజం వేసిందే నారా చంద్రబాబు నాయుడు అని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. బుధవారం మచిలీపట్నంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంత్రి రవీంద్ర మీడియాతో మాట్లాడారు. "ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మెగా డిఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేశాం. పారదర్శకంగా నియామకాలు పూర్తి చేశాం. కానీ ఏదో జరిగిపోయిదంటూ వైసిపి నేతలు ఆరోపణలు చేయడం సిగ్గుచేట్లు అని ధ్వజమెత్తారు. "ఒకప్పుడు టీచర్ల బదిలీలు జిల్లా పరిషత్ చైర్మన్లు నడిపించేవారు. ఎవరికి ఎక్కడ రాస్తే అక్కడకు బదిలీ చేసేవారు. కానీ చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చాక దేశంలోనే మొట్టమొదటిసారి కౌన్సిలింగ్ విధానం తీసుకొచ్చారు. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలను పారదర్శకంగా నిర్వహించారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగుల్లో 90 శాతం టిడిపి హయాంలో నియమితులైనవారే. మెరిట్ ప్రకారమే నియామకాలు జరగాలనే సిద్ధాంతంతో పని చేశాం. వైసిపి ఐదేళ్ల పాలనలో ప్రభుత్వ ఉద్యోగుల్ని జలగల్లా పీడించారు. ఉపాధ్యాయుల్ని మద్యం షాపుల ముం టదు కాపలా పెట్టారు. మరు గుదొడ్ల కడిగించి ఫొటోలు తీయించారు. కానీ నేడు ఉపాధ్యాయులకు మెరుగైన శిక్షణ కోసం విదేశాలకు పంపిస్తున్నాం. అత్యుత్తమ విధ్యా విధానాలను అద్యయనం చేసే అవకాశం కల్పించాం. బదిలీలు కావాలంటే డబ్బు తీసుకోవడంలో తప్పేముందని బందరులోని వైసిపి నేత నిస్సి గ్గుగా మాట్లాడుతున్నాడు. వాళ్లు అసలు మను షులేనా? అని మంత్రి కొల్లు రవీం ద్ర మండిపడ్డారు. 'డిఎస్సీపై వైసిపి ఆరోపణలు చేయడం కాదు, దమ్ము, ధైర్మముంటే ఆధారాలు చూపండి అని మంత్రి సవాల్ విసిరారు. అంతేగానీ బురద జల్లేసి చేతులు కడుక్కుంటాం. గుడ్డ కాల్చి మొహాన పడేద్దాం అనే ధోరణిలో వ్యవహరిస్తే ఉపేక్షించే పరిస్థితి లేదని హెచ్చరించారు.

## 19 నుంచి 27 వరకు మహిళా క్రికెట్ ప్రీమియర్ లీగ్

- ప్రారంభోత్సవానికి నారా బ్రహ్మణి హాజరు
- ప్రేక్షకులకు ఉచిత ప్రవేశం
- విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సుల ఏర్పాటు
- వచ్చే సీజన్ నుంచి విశాఖ, కడపలోనూ ఉమెన్ ఎపిఎల్ మ్యాచ్‌లు

**విజయవాడ, సెప్టెంబరు 16 ప్రభాతవార్త:** మహిళా క్రికెట్‌ను ప్రోత్సహించడంతో పాటు యు వ క్రీడాకారిణులకు మరిన్ని అవకాశాలు కల్పిం చాలనే ఉద్దేశంతో ఆంధ్రా క్రికెట్ అసోసియే షన్ ఆధ్వర్యంలో ఉమెన్ ఎపిఎల్ పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఎ.సి.ఎ) అధ్యక్షుడు, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ తెలిపారు. బుధవారం విజయవాడలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 19వ తేదీ నుంచి 27వ తేదీ వరకు జరుగనున్నమహిళా క్రికెట్ ప్రీమియర్ లీగ్ పోటీల వివరాలు వెల్లడించారు. ఉమెన్ ఎపిఎల్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి నారా బ్రాహ్మణి హాజరు కానున్నారని ఎంపీ కేశినేని శివనాథ్ తెలిపారు. మహిళా క్రికెట్‌కు ప్రోత్సాహం అందించడంతో పాటు, ప్రతిభావంతులైన క్రీడాకారిణులకు తమ ప్రతిభను ప్రదర్శించేందుకు వేదిక కల్పించడమే ఉమెన్ ఏపీఎల్ ప్రధాన ఉద్దేశమన్నారు. ప్రస్తుత సీజన్‌లో నాలుగు జట్లు ఉమెన్ ఏపీఎల్‌లో పోటీ పడుతున్నాయని, ఈ సీజన్‌లో అన్ని మ్యాచ్‌లను మంగళగిరి స్టేడియంలోనే నిర్వహించనున్నట్లు వెల్లడించారు. క్రికెట్ అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో మ్యాచ్‌లను వీక్షించేలా ప్రేక్షకులకు ఉచిత ప్రవేశం కల్పిస్తున్నామని ఎంపీ తెలిపారు. ముఖ్యంగా విద్యార్థుల్లో మహిళా క్రికెట్‌పై ఆసక్తిని పెంపొందించేందుకు విజయవాడ నుంచి విద్యార్థులను మంగళగిరి స్టేడియానికి తీసుకువెళ్లేందుకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఉమెన్ ఏపీఎల్ కేవలం క్రికెట్ పోటీలు నిర్వహించడానికే పరిమితం కాకుండా, మహిళా క్రీడాకారిణులకు అవకాశాలు కల్పించడం ద్వారా మహిళా సాధికారతకు దోహదపడే కార్యక్రమంగా ముందుకు తీసుకువెళ్తామని కేశినేని శివనాథ్ తెలిపారు. రాబోయే రోజుల్లో ఉమెన్ ఏపీఎల్‌ను మరింత విస్తరించనున్నామని, వచ్చే సీజన్ నుంచి విశాఖపట్నం, కడపలో కూడా ఉమెన్ ఏపీఎల్ మ్యాచ్‌లను నిర్వహిం చేందుకు చర్యలు తీసుకుంటు న్నామని వెల్ల డించారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో మహిళా క్రికెట్‌కు సమాన అవకాశాలు కల్పించడ మే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. ఉమెన్ ఏపీఎల్ పోటీలపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించేందుకు 17న సాయం త్రం విజయవాడ నుంచి మంగళగిరి వరకు బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు ఎంపీ కేశినేని శివనాథ్ తెలిపారు. క్రీడాభిమానులు, యువ త, విద్యార్థులు, ప్రజలు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపు నిచ్చారు. మహిళా క్రికెట్‌కు ప్రజల నుంచి మరింత ఆదరణ లభించేలా ఉమెన్ ఏపీఎల ను విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్ర మంలో ఏసిఏ డైరెక్టర్ ఆఫ్ క్రికెట్ ఆపరేషన్స్ కళ్యాణ్ కృష్ణ

## వైసిపి నుంచి మోపిదేవి శ్రీనివాసరావు సస్పెన్షన్

**విజయవాడ, సెప్టెంబరు 16 ప్రభాతవార్త ప్రతినిధి:** రేపల్లె నియోజకవర్గానికి చెందిన సీనియర్ నేత మో పిదేవి శ్రీనివాసరావును పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ వైసిపి అధినేత జగన్ కీలక నిర్ణయం తీసుకున్నారు. కేవలం ఐదు నెలల క్రితమే (గత మే నెలలో) శ్రీనివాసరావు కాంగ్రెస్ పార్టీని వీడి తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో జగన్ సమక్షంలో వైసిపిలో చేరారు. అత్యల్ప కాలంలోనే సస్పెన్షన్ వేటు పడటం బాపట్ల జిల్లా రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో రేపల్లె నియోజకవర్గం నుంచి పోటీ చేసి శ్రీనివాసరావు ఓటమిపాలయ్యారు. అయితే, వైసిపిలోకి వచ్చినప్పటి నుంచి స్థానిక వైసిపిలో సమాంతర గ్రూపు రాజకీయాన్ని నడుపుతున్నారనే ఆరోపణలు వచ్చాయి. రాబోయే ఎన్నికల్లో రేపల్లె ఎమ్మెల్యే టికెట్ తనకే ఖరారైందంటూ నియోజకవర్గంలో ప్రచారం చేసుకోవడంపై స్థానిక కేడర్ అధిష్ఠానానికి ఫిర్యాదులు చేసినట్లు సమాచారం. మరొకవైపు వర్గపోరు ప్రోత్సహించే నేతలను ఉపేక్షించకూడదనే ఉద్దేశంతోనే జగన్ ఈ కఠిన నిర్ణయం తీసుకున్నారని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

## తిరుమల సమాచారం

### హంసవాహనంపై వీణాపాణిగా మలయప్ప

- ఉదయం చిన్నశేష వాహనంపై అభయం



**తిరుమల, సెప్టెంబరు 16 ప్రభాతవార్త ప్రతినిధి:** శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో రెండవ రోజు బుధవారం రాత్రి హంసవాహనంపై వీణాపాణియై మలయప్పస్వామి భక్తులను కటాక్షించారు. వాహనమండపం వద్ద నుండి ఆలయ మాఢవీధుల్లో ఊరేగిన స్వామికి భక్తులు అడుగడుగునా కర్పూర హారతులిచ్చారు. బ్రహ్మోత్సవాల్లో ఉదయం మలయప్ప స్వామి పాండురంగస్వామి అలంకారంలో ఐదు తలల చిన్న శేషవాహనంపై తిరుమాడ వీధులలో విహారిస్తూ భక్తులను అనుగ్రహించారు. చిన్నశేష వాహనం కుటుంబ శ్రేయస్సు పురాణ ప్రాశస్తం ప్రకారం చిన్నశేషుడిని వాసుకి (నాగలోకానికి రాజు)గా భావిస్తాయి. ఈ వాహన సేవలో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, ఇఒ ముద్దాడ రవిచంద్ర, బోర్డు సభ్యులు, అదనపు ఇఒ వెంకయ్య చౌదరి, సివిఎస్ఒ మురళీకృష్ణ, జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్. జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

## బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులకు గౌరవంగా సేవలందించాలి

- సిఎం ఆదేశాలతో శ్రీవారి సేవకుల సంఖ్య రెట్టింపు



**తిరుమల,సెప్టెంబర్ 16ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవారి బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తుల పట్ల గౌరవం, మర్యాద, ఆప్యాయతతో మెలుగుతూ సేవలందించాలని టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు కోరారు. తిరుమల ఆస్థాన మండపంలో బుధవారం సాయంత్రం టిటిడి ఇఒముద్దాడ రవిచంద్ర, అదనపు ఇఒవెంకయ్య చౌదరితో కలిసి వివిధ రాష్ట్రాల నుండి బ్రహ్మోత్సవాల్లో భక్తులకు సేవలందించేందుకు విచ్చేసిన శ్రీవారి సేవ కులతో ఛైర్మన్ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు శ్రీవారి సేవను మరింత బలోపేతం చేసి, సేవకుల సంఖ్యను రెట్టింపు చేసేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. భక్తులకు సౌకర్యవంతమైన, ఆప్యాయమైన సేవలందించడంలో శ్రీవారి సేవకుల పాత్ర ఎంతో కీలకమని చెప్పారు. 5వేల ఆలయాలకు శ్రీవారి సేవకులు మూలస్తంభాలుగా నిలవాలని టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర చెప్పారు. ఆలయాల నిర్మాణానికి సంకల్పించామని ఈ ఆలయాలకు శ్రీవారి సేవకులు మూలస్తంభాలుగా నిలవాలని కోరారు. నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర, దేశ స్థాయిలో ప్రణాళికాబద్ధంగా హిందూ ధర్మ ప్రచారాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. అదనపు ఇఒ వెంకయ్య చౌదరి మాట్లాడుతూ ప్రపంచంలోని ఏ ధార్మిక వ్యవస్థలోనూ ఇంత భారీ స్థాయిలో సేవకుల భాగస్వామ్యం లేదన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా అందరికీ సమాన అవకాశాలు కల్పించడం టిటిడి ప్రధాన సిద్ధాంతమని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలోచనతో శ్రీవారి సేవ రూపుదిద్దుకుందని, సేవకులకు శిక్షణ అందించి శ్రీవారి సేవను మరింత బలోపేతం చేయాలని ఆదేశించారని చెప్పారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించడంలో భాగస్వాములై, స్వామివారి వైభవాన్ని దశదిశలా వ్యాప్తి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిటిడి సివిఎస్ఒ మురళీకృష్ణ, శ్రీవారి సేవ ఇన్‌చార్జ్, టిటిడి సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవి తదితరులు పాల్గొన్నారు.

# టిటిడి ప్రతి భవనంపైనా సౌరవిద్యుత్ ప్యానళ్లు

- కందలేరు నుండి బాలాజిసాగర్‌కు నీళ్లు
- పవనవిద్యుత్ ఉత్పత్తి పెంచేలా ప్రణాళికలు
- టిటిడి అధికారుల సమీక్షలో సిఎం చంద్రబాబు




**తిరుమల, సెప్టెంబరు 16 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రపంచం లోనే అతిపెద్ద హిందూ ధార్మికసంస్థ తిరుమల తిరుపతి దేవస్థానంలో పర్యావరణ పరిరక్షణకు అధిక ప్రాధాన్యత నిస్తున్నామని, ఇందులో భాగంగా తిరుమల, తిరుప తిలోనూ టిటిడి ప్రతి భవనంపై సౌరవిద్యుత్ ప్యానళ్ళు ఏర్పాటుచేయాలని సిఎం ఆదేశించారు. తిరుపతి,తిరు మల ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని తాగునీటి ఎద్ద డి రాకుండా మరింత మెరుగ్గా ప్రాజెక్టులు చేపడతామని తెలిపారు. తిరుమలేశునికి జరుగుతున్న సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించిన అనంతరం రెండవరోజు బుధవారం తిరుమలలోని పద్మావతి అతిధిభవనంలో టిటిడి బోర్డు,అధికారులతో కలసి సిఎం చంద్రబాబు పలు అభివృద్ధి అంశాలపై సమీక్షించారు. తిరుపతి, తిరుమల అంతా నెట్‌జీరో కాన్సెప్ట్ విధానంలోనే కార్యకలాపాలు నిర్వహించాలని అన్నారు. సౌర, పవన విద్యుత్‌తోబాటు బ్యాటరీ స్టోరేజి ద్వారా విద్యుత్ ఉత్పత్తి జరగాల్సిన అవసరం ఉందని ఉద్ఘాటించారు. ప్రతిటిటిడి భవనంపైనా సౌరవిద్యుత్ ప్యానళ్ల ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం కోటి యూనిట్లు ఉత్పత్తి చేస్తుంటే 10 కోట్ల యూనిట్లు టిటిడి వినియోగిస్తోందని తెలిపారు. తిరుమలలో ఉత్పత్తి అయ్యే వ్యర్థాలు సర్క్యులర్ ఎకానమీకి వెళ్లే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. తిరుమల తిరుపతిలో పర్యావరణాన్ని కాపాడుకునేలా జీరో వేస్ట్ విధానం అమలు కావాలన్నారు. ఒక నిర్దిష్టమైన మోడల్ గా తిరుమల అభివృద్ధి కావాలని నిర్దేశించారు. దేశంలోని అన్ని దేవాలయాల కంటే తిరుమల తిరుపతి అత్యంత పరిశుభ్రంగా చక్కటి నిర్వహణలో ఉందని కితాబిచ్చారు. 2,300 ఏళ్ల నుం డి ఉన్న ఈ దేవాలయం ప్రపంచంలోనే అత్యుత్తమ దేవాలయంగా ఖ్యాతిచెందాలని అత్యంత సేవాభావంతో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగానే దేశవ్యాప్తంగా, ప్రపంచ వ్యాప్తంగా భక్తులు ఇక్కడికి వస్తున్నారని సిఎం తెలిపారు. శ్రీవేంకటేశ్వర స్వామి వైభవాన్ని విశిష్టతను ప్రశ్నించిన వాళ్ళు కాలగర్భంలో కలిసిపోయారని, శిష్ట రక్షణ దుష్ట శిక్షణ అనేది స్వామివారే చూసుకుంటారని సిఎం తనదైన శైలిలో భక్తిని చాటారు. శ్రీవారి ఆస్తులు, ఆభరణాలు, బంగారం, నిధులు, భూములు ఇలా అన్ని వివరాలు ఆన్ లైన్ లో అత్యంత పారదర్శకంగా చేపట్టామని చెప్పారు. వచ్చే ఏడాదికి సోమశిలకు, ఆపై కందలేరు బాలాజీ సాగర్‌కు నీరు తీసుకొస్తామని సిఎం వెల్లడించారు. అక్కడ నుండి వచ్చే ఏడాదికి తిరుపతి సమీపంలోని కల్యాణి డ్యామ్ కు కూడా నీటిని తరలిస్తామన్నారు. తనకున్న అనుభవంతో ఓ మారు తీవ్ర వర్షాభావం కారణంగా దేవాలయం మూ సివేయాలన్న ప్రతిపాదన కూడా వచ్చిందని, అయితేఆ సమయంలో కల్యాణి డ్యామ్ నుండి పైపులైన్‌ను వంద రోజుల్లో వేసి తిరుమలకు నీరు తరలించామని, భక్తు లకు నీటి సమస్య రాకుండా చూశానని చంద్రబాబు గుర్తుచేశారు. భక్తుల భద్రత, సౌకర్యాలు, ఆధ్యాత్మిక అనుభూతికి పెద్దపీటవేశామన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో భక్తులకు మెరుగైన సేవలందించాలనేది టిటిడి ఆశయం అన్నారు. తిరుమల హీలింగ్ డివో షన్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్, దుర్లభ దర్శన్ విఆర్ అనుభవం ప్రారంభం జరిగిందన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రులు ఆనం రామనారాయ ణరెడ్డి, అనగాని సత్యప్రసాద్, తిరుపతి, చిత్తూరు జిల్లాలో ఎమ్మెల్యేలు, టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, పాలక మండలి సభ్యులు, టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఇఒ వెంకయ్య చౌదరి, టిటిడి జెఇఒలు డాక్టర్ ఎ. శరత్, ప్రభల గోపీనాథ్, తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వేంకటేశ్వర్, జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, సివిఎస్ఒ మురళీకృష్ణ ,టిటిడి అధికారులు, వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



## తిరుమలలో 32 విద్యుత్ బస్సులు

- బస్సులో ప్రయాణించి అనుభూతిచెందిన సిఎం

**తిరుమల, సెప్టెంబరు 16 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రతిరోజూ తిరుమలకు వస్తున్న భక్తుల సౌకర్యార్థం ఒకచోట నుండి మరోచోటుకు రాకపోకలకు వీలుగా అధునాతన 32 విద్యుత్ బస్సులు అందుబాటులోకి వచ్చాయి. ఈ బస్సులను రిలయన్స్ ఫౌండేషన్, భారత్ బయోటెక్ సంస్థలు టిటిడికి సమకూర్చడంతో బుధవారం ఉద యం సిఎం చంద్రబాబునాయుడు, టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు ప్రారంభించారు. స్వయంగా విద్యుత్ బస్సులో ప్రయాణించి తిరుమలలో అనుభూతికి లోనయ్యారు. రిలయన్స్ ఇమోబిలిటీ సిఇఒ నితిన్ సేత్, భారత్ బయోటెక్ ఎండి సుచిత్రా ఎల్లా, మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, అనగాని సత్యప్రసాద్, టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు సహా సభ్యులతో కలిసి నారాయణ గిరి సర్కిల్ నుండి ఎస్వీ మ్యూజియం వరకూ ఎలక్ట్రిక్ బస్సులో సిఎం ప్రయాణిం టచారు. ఈ బస్సులతో తిరుమలలో 44 విద్యుత్ ఉచిత ధర్మరథాలు భక్తులకు అందబాటులోకి వచ్చాయి.



## భక్తుల బంగారు నగల బ్యాగ్ అప్పగింత

**తిరుమల, సెప్టెంబరు 16 ప్రభాతవార్త ప్రతినిధి:** శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వస్తున్న భక్తులు అలిపిరి చెక్ పాయింట్ వద్ద స్కానింగ్ చేస్తూ భక్తులు తమ బ్యాగును మరిచి వెళ్లిపోయారు. భక్తులు వచ్చిన దారిన తిరుమలకు చేరుకున్నారు. దీన్ని గమనించిన విధులలోని భద్రతా సిబ్బంది సెక్టార్ కార్యాలయంలో అప్పగించారు. ఆ బ్యాగ్‌లో రూ.32వేల నగదు, సుమారు 30 గ్రాములు బంగారు ఆభరణాలు ఉన్నాయి. దీన్ని గుర్తించిన అలిపిరి ఏవిఎస్ఒ రమేష్ కృష్ణ, విఐ రామకృష్ణయ్య ఆ బ్యాగ్ మరిచిపోయిన భక్తులు తిరిగి రావడంతో అందులోని వివరాలు తెలుసుకున్నారు. తెలంగాణ కెవిరంగారెడ్డి జిల్లాకు చెందిన పీర్లగూడెం వి,జనార్థర్‌రెడ్డికి అప్పగించారు.

# పిఎం సూర్యఘర్ పథకం అమలు వేగవంతం

- వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా
- ఎపిఎస్‌పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి



**తిరుపతి, సెప్టెంబరు 16 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ దక్షి ణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలో పిఎంసూర్యఘర్ పథకం కింద అర్హులైన ఎస్సీ,ఎస్టీ వినియో గదారుల గృహాలపై రూఫ్ టాప్ సోలార్ వ్యవస్థ ఏర్పా టు పనులను వేగవంతం చేయాలని ఆ సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి కోరారు. తిరుపతిలోని ఎస్పీడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయం నుండి బుధవారం పిఎంసూర్య ఘర్ పథకం అమలు, విద్యుత్ సరఫరా స్థితిగతులు, బిల్లుల వసూళ్ళ తదితర అంశాలపై అధికారులు, కాంట్రాక్టర్లతో శివశంకర్ లోతేటి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సోలార్ రూఫ్ టాప్ వ్యవస్థల ఏర్పాటు పనులను వేగవంతం చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. పిఎం సూర్యఘర్ పథకాన్ని అర్హులైన ఎస్సీ,ఎస్టీ గృహ వినియోగదారులకు మరింత చేరువ చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ పథకం ప్రయోజనాలపై వినియోగదారులకు క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. విద్యుత్ సరఫరా పరిస్థితులను సమీక్షి స్తూ వినియోగదారులకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్తును సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని సిఎండి ఆదేశించారు. విద్యుత్ అంతరాయాలకు కారణాలను గుర్తించి, సమస్యలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చేపట్టాలని సూచించారు. సంస్థ పరిధిలో విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్‌స్టేషన్లు తదితర విద్యుత్ వ్యవస్థలను నిరంతరం పర్యవేక్షి స్తూ, ముందస్తు నిర్వ హణా చర్యలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. విద్యుత్ బిల్లుల వసూళ్లపై కూడా ఈ సందర్భంగా ఆయన సమీక్షి ంచారు. విద్యుత్ బిల్లుల వసూళ్ల లక్ష్యా లను సాధించేలా కార్యాచరణ రూపొందించుకోవాలని సంబంధిత అధికారులు, సిబ్బందికి సూచించారు. బకా యిల వసూళ్లకు ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. వినియోగదారులకు సకాలంలో బిల్లులు అందేలా చూడడంతో పాటు, ఆన్ లైన్ బిల్లుల చెల్లింపుపై అవగాహన కల్పించాలని తెలిపారు. విద్యుత్ అంతరాయాలు, ఓల్టేజ్ సమస్యలు తదితర అంశాలను క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షి స్తూ, సమస్యల్ని అధిగమించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. విద్యుత్తు వినియోగదారుల సంతృప్త స్థాయిలు నేరుగా క్షేత్రస్థాయి సేవలపై ఆధారపడి ఉంటాయని సూచించారు. ఈ సమావేశంలో సంస్థ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ ఐటి, ఫైనాన్స్/ఎఫ్‌ఏసి) పి. అయూబ్ ఖాన్, డైరెక్టర్ (టెక్నికల్) కె. గురవయ్య, చీఫ్ జనరల్ మేనేజర్లు జె. రమణా దేవి, ఆర్. పద్మ, ఎన్, శోభా వాలెంటీనా, ఎం. మురళి కుమార్, సిహెచ్ రామచంద్ర రావు, ఎస్. రమణ, కె. సంపత్ కుమార్, ఎం. శ్రీకాంత్, ఏ. శ్రీనివాస బాబు, జనరల్ మేనేజర్లు జగదీష్, సురేష్, హేమలత, సూపరింటెండింగ్ ఇంజనీర్లు చంద్రశేఖర రావు, శేషాద్రి శేఖర్, మోజెస్, సోమశేఖర్ రెడ్డి, శ్రీనివాసులు, అమర్ బాబు, సుధాకర్, శ్రీనివాసులు రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు,

17-9Pg7exHMNWJQE:17-9Pg7exHMNWJQE.qxd 9/17/2026 12:41 AM Page 1



## కరువుతో ఎండిపోతున్న పంటలు..

● చెరువులు నింపాలని నేడు హంద్రీ-నీవా ఆఫీస్ ఎదుట



**అనంతపురం, సెప్టెంబరు 16 ప్రభాతవార్త బ్యూరో:** అనంతపురం జిల్లాలో కరువు తో ఎండిపోతున్న పండ్ల తోటలను కాపాడేందుకు చెరువులకు నీరు వదలాలని డిమాండ్ చేస్తూ గురువారం అనంతపురం హంద్రీ- నీవా కార్యాలయం ఎదు ట రాప్తాడు నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ఆధ్వ ర్యంలో రైతులు నిరసన కార్యక్రమానికి సన్నద్ధమవుతున్నారు. శ్రీశైలం రిజ ర్వాయర్ నుంచి హంద్రీ-నీవా సుజల స్రవంతి పథకం కింద మాల్యాల నుంచి కాలువలకు ఆగస్టు 5వ తేదీన నీళ్లు వదిలి 50 రోజులు గడిచిన అనంతపురం జిల్లాలో చెరువులకు నీరు వదలడం లేదని, చెరువులకు నీళ్లు ఇవ్వకపోతే ఎన్నో ఏళ్లు కష్టపడి సాగిన పన్ను తోటలో నిలువునా ఎండిపోతాయని ప్రకాష్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేస్తు న్నారు. శ్రీశైలం డ్యాంలో 180 టిఎంసిల నుంచి 112 టిఎంసిలకు నీటిమట్టం తగ్గిందని, అయినా 835 అడుగుల వరకు నీటిని డ్రా చేసుకునే అవకాశం ఉందన్నారు. ప్రస్తుత నీటి లభ్యత, వివిధ ప్రాజెక్టులకు విడుదలను పరిశీ లిస్తే హంద్రీ-నీవా ద్వారా ఇంకా దాదాపు 17 టిఎంసిల వరకు నీటిని పొందే అవకాశం ఉందని పేర్కొన్నారు. చీనీ, అరటి, మిరప, టమాట తదితర పంట లు నీరందక ఎండిపోతున్నాయని ప్రకాష్ రెడ్డి తెలిపా రు. భూగర్భజలాలు పడిపోవడంతో రైతులు సాగు చేసిన పంటలను వదిలేసు కునే పరిస్థితి ఏర్ప డిందన్నారు. రైతాంగాన్ని కాపాడేందుకు హంద్రీ-నీవా కింద ఉన్న చెరు వులన్నింటినీ వెంటనే నింపాలని కోరారు.వెలిగొండ ప్రాజెక్టు ప్రస్తు తం ట్రయ ల్ రన్‌లోనే ఉందని, ప్రధాన సొరంగం పూర్తయినా కాలువలు, బ్రాంచ్ కాలు వలు, పంపిణీ వ్యవస్థ ఇంకా పూర్తికావాల్సి ఉందన్నారు. ప్రస్తు తం వెలిగొం డకు విడుదల చేస్తున్న నీటిని తగ్గించి హంద్రీ-నీవా, ముచ్చుమర్రి ద్వారా రాయలసీమ ప్రాంతాలకు అందించాలని కోరారు. తుంగభద్ర డ్యాం నుంచి పిఎబిఆర్‌కు నీటిని విడుదల చేసి పిఎబిఆర్ కుడికాలువ కింద ఉన్న 49 చెరు వులను నింపాలని డిమాండ్ చేశారు. హంద్రీ-నీవా కింద ఉన్న అన్ని చెరు వులతో పాటు పేరూరు డ్యాంకు కూడా నీటిని విడుదల చేయాలని కోరారు.

# పండ్ల తోటలను బతికించు కోవడం ఎలా..!

● ఎన్నాళ్లు.. ట్యాంకర్లతో నీళ్లు తోడు కోవాలి..

● ఖర్చు సగటుకు మించి భారంగా మారింది అంటున్న అన్నదాతలు

**అనంతపురం, సెప్టెంబరు 16 ప్రభాతవార్త బ్యూరో:** ఎల్‌నినో ప్రభావం వల్ల అనంతపురం జిల్లాలో తీవ్ర వర్షాభావంతో పండ్ల తోటల పరిస్థితి దయనీయకరంగా ఉంది. కొన్ని ప్రాంతాల్లో చీని, దానిమ్మ, నిమ్మలాంటి తోటలు ఎండిపోగా కొన్ని ప్రాంతాల్లో వాడుబట్టి ఉన్నాయి. ఎక్కడ చూసినా భూ గర్భ జలం మట్టం తగ్గిపోయి బోర్లు ఎండిపోయి, రైతుల పరిస్థితి దయనీయంగా ఉంది. 10 రోజుల్లో..20 రోజులో.. భారీ వర్షాలు వస్తే చెట్లు బ్రతుకుతాయన్న ఆశతో కన్న తిప్పలు పడి ట్యాంకర్ల ద్వారా నీటిని తోలుకునే వారు కొందరైతే..నీళ్లు దొరకక ఖర్చు బరించ లేక తోటలను విడిచి పెట్టిన వారు కొందరు. కొన్ని ప్రాంతాల్లో వాడిపోతున్న చెట్లను చూడలేక నీళ్లు పారించ లేక చెట్లను జేసిబిలతో తీసివేసిన సంఘటనలు ఉన్నాయి. గ్రామాల్లోకి వెళ్తే, రైతుల ఆక్రందనలు కనిపిస్తున్నాయి. శింగనమల మండలం గోవిందరాయుని పేటలో శంకర్ రెడ్డి అనే రైతుకు 8.40 ఎకరాల భూమిలో చీనీ, మామిడి, నేరేడు చెట్లు ఉన్నాయి. ఆ రైతు తోటలోనే ఉంటూ చెట్లను సంరక్షించు కుంటూ వస్తున్నాడు. బోర్లలో నీరు తగ్గ పోవడంతో ఒక నెల రోజుల నుంచి ఆ రైతు పరిస్థితి దయనీయ కరంగా ఉంది. ఆ తోటలో నాలుగు బోర్లు వుంటే, ఒక్కొక్క బోరులో అర ఇంచు మాత్రమే నీరు వస్తోంది. నాలుగు బోర్లలో వచ్చే రెండు ఇంచుల నీటిని ఒక పెద్ద గుంతపైన తార్పాలు వేసి ఆ గుంతలోకి బోర్లలోకి వచ్చే నీటిని వదులుతున్నాడు. ఆ నీటితోపాటు 5500 లీటర్లు వుండే ట్యాంకర్‌తో రోజుకు 10 ట్రిప్పులు సోదనపల్లి వద్ద నున్న వంకలో నుంచి తీసుకొచ్చి తోటలో ప్రత్యేకంగా తోలిన గుంతలోకి రైతు శంకర్‌రెడ్డి విడిపిస్తున్నాడు. ఈ విధంగా ట్యాంకర్ల ద్వారా వచ్చిన నీరు, బోర్లలో వచ్చే నీటిని డ్రిప్పులను అమర్చి చెట్లకు వదులు తున్నాడు. ఒక నెల రోజులు కాపాడు కుంటే చెట్లను బతికించు కోవచ్చన ఆశతో ఉన్నానని, నెల రోజులు వర్షాలు రాక పోతే చెట్లను బతికించు కోలేక పోతానని ఆయన ఆందోళన వ్యక్తం చేశాడు. అదే గ్రామానికి చెందిన జయరామిరెడ్డి, కుమార్‌రెడ్డి అనే రైతులు వేరుశనగ పంటను వేసి పూర్తిగా నష్టపోయారు. శింగనమల మండలం సోదనపల్లి గ్రామానికి చెందిన చిక్కాల బాలు, చిక్కాల మల్లికార్జున, చిక్కాల శివయ్య అనే రైతులకు సంబంధించి భూములు శింగనమల పొలంలో ఉన్నాయి. ఆ ముగ్గురు రైతులు అన్నదమ్ములు. ఒక్కొక్కరికి రెండు ఎకరాల భూమి ఉంది. చిక్కాల బాలు, చిక్కాల మల్లికార్జున పంటలు వేసి వర్షాభావంతో పూర్తిగా నష్టపోయారు. చిక్కాల శివయ్యకు చెందిన రెండు ఎకరాల భూమిలో ఉన్న చీనీ చెట్లు, పూర్తిగా ఎండిపోయాయి. ఈ విధంగా ఏ గ్రామంలో చూసినా రైతుల పరిస్థితి యిబ్బంది కరంగా ఉంది. గార్లదిన్నె, శింగనమల, బుక్కరాయ సముద్రం, తాడిపత్రి రూరల్, పుట్లూరు, తదితర మండలాల్లో భూ గర్భ జలాల మట్టం తగ్గిపోయి, ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు అష్ట కష్టాలు పడుతున్నారు. పుట్లూరు, గార్లదిన్నె మండలాల్లో రైతులను విచారిస్తే ఒక్కో ట్యాంకర్‌కు 800 నుంచి రూ.1000 బాడుగ పెట్టి నీటిని తోడించుకుంటున్నామని, ఒక్కో ట్యాంకర్ నీరు నాలుగైదు చెట్లకు మించి రాదని, ఎకరంలో దాదాపు 120 చీనీ చెట్లు ఉంటాయని రైతులు తెలిపారు. కొన్ని చోట్ల ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసేందుకు కూడా నీరు దొరకడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాభావంతో చెరువులోకి, నీరు రాకపోవడం, వంకలు, వాగులు పారక పోవడంతోపాటు శ్రీశైలం, తుంగభద్ర నుంచి వచ్చే నీటిని జిల్లా వ్యాప్తంగా

శింగనమల మండలంలో శంకర్‌రెడ్డి అనే రైతు ట్యాంకర్ ద్వారా తమ పొలంలో ఏర్పాటు చేసుకున్న గుంతలోకి నీటిని వదులుతున్న దృశ్యం



పుట్లూరు మండలంలో బోరు నుంచి ట్యాంకర్‌లోకి నీటిని నింపుకుంటున్న దృశ్యం



చెరువులకు ఇవ్వకపోవడం వల్ల భూ గర్భ జల మట్టం కూడా పెరడం లేదు. ఎండా కాలం తలపించే విధంగా ఎండలు రోజురోజుకు ఎక్కువవుతుండటంతో బోర్లలో నీరు తగ్గిపోవడం, ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయడంకు ఎక్కువ ఖర్చు అవుతుండటంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అనంతపురం జిల్లాలో గత కొన్ని దశాబ్దాలతో పాలక ప్రభుత్వాలు డ్రిప్ సౌకర్యం, స్ప్రింకర్ల సబ్సిడి ఇస్తుండటం వల్ల పండ్ల తోటల సాగుకు రైతులు చొరవ చూపిస్తున్నారు. రాయలసీమ జిల్లాల్లోనే అనంతపురం జిల్లాలో ఎన్నో ప్రయోగాలు చేసి రైతులు కొత్త కొత్త పండ్ల తోటలను కూడా పండిస్తున్నారు. చివరకు కాశ్మీర్ ప్రాంతంలో పండే యాపిల్ తోటలను కూడా ప్రయోగాత్మకంగా సాగుకు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో పదేళ్లు, 15 ఏళ్లు, కష్టపడి పెంచి పండ్ల తోటలకు ప్రస్తుతం నీరు ఇవకపోతే అవి ఎండిపోతే మాజీ వనం ఎట్లా అని రైతులు ఆవేదనతో ప్రశ్నిస్తున్నారు. ఆ ప్రతిపాదనపై ఇంత వరకు ఎలాంటి స్పందన కానరాలేదు. రాప్తాడు నియోజకవర్గంలోని అన్ని చెరువులకు నీరు ఇవ్వాలని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి గురువారం హంద్రీనీవా కార్యాలయం ఎదుట రైతులతో కలిసి నిరసన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ నెల 21, 22, 23 తేదీల్లో అఖిల పక్షం ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని తహశీల్దార్ల కార్యాలయం ఎదుట తాగునీటి కోసం నిరసన కార్యక్రమానికి రైతులు సిద్ధం అవుతున్నారు. ఈ పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుని పండ్ల తోటలను ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**1,53,776 హెక్టార్లలో పండ్ల తోటలు :**

అనంతపురంజిల్లాలో దాదాపు 1,53,776 హెక్టార్లలో పండ్ల తోటలు ఉన్నాయి. ప్రతి యేటా 42,43,247 మెట్రిక్ టన్నుల పండ్లను రైతులు ఉత్పత్తి చేస్తున్నారు. పెద్ద ఎత్తున దేశ విదేశాలకు ఎగుమతి అవుతున్నాయి. చీనీ పంట 53,331 హెక్టార్లలో, అరటి 16,402 హెక్టార్లలో, మామిడి 55,827 హెక్టార్లలో, బొప్పాయి 4,646 హెక్టార్లలో, పుచ్చకాయ 4,514 హెక్టార్లలో, దానిమ్మ 7,519 హెక్టార్లలో, సపోట 4,537 హెక్టార్లలో, సనిమ్మ 990 హెక్టార్లలో, ద్రాక్ష 1002 హెక్టార్లు, జామ 896 హెక్టార్లలో తదితర పండ్ల తోటలను హెక్టార్లలో సాగు చేస్తున్నారు. ఇతర పండ్ల తోటలను కూడా రైతులు సాగు చేస్తున్నారు. వర్షాభావ పరిస్థితుల్లో రైతులు కష్టపడి పెంచిన తోటలను ఏ విధంగా ఆదుకోవాలనేందుకు పక్కా ప్రణాళికతో రాష్ట్ర ప్రభుత్వం స్పందించాల్సిన అవసరం ఉంది. కేంద్ర, రాష్ట్ర కరువు బృందాలు కూడా పరిశీలించి రైతులకు న్యాయం జరిగే విధంగా చర్యలు చేపట్టాలి.

## సాలూరు మోడల్ మున్సిపాలిటీగా అభివృద్ధికి శ్రీకారం

● పైలెట్ వాటర్ స్కీం పథకం వేగవంతం : మంత్రి సంధ్యారాణి



**పార్వతీపురం (సాలూరు), సెప్టెంబరు 16 ప్రభాతవార్త:** పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు పట్టణ మునిసిపాలిటీ ప్రతి వార్డులో ఉన్న ప్రతి ఇంటికి శుభ్రమైన నీరు చేరేందుకు పైలెట్ వాటర్ స్కీమ్ పథకం వేగవంతం చేస్తున్నామని రాష్ట్రమంత్రి సంధ్యారాణి స్పష్టం చేశారు. అందులో భాగంగా 15 ఇంకా 21 అలాగే 22 తెలగావీధి వార్డుల్లో కొత్తగా నిర్మించిన 4 పైలెట్ వాటర్ స్కీం పథకాన్ని సంధ్యారాణి చేతుల మీదుగా బుధవారం ప్రారంభించారు. అలాగే ఈ పథకం సుమారు రూ.7.20 లక్షలతో పైలట్ స్కీం వాటర్ ట్యాంకులను నిర్మించారు. వీటి ప్రారంభోత్సవానికి వెళ్ళిన మంత్రి సంధ్యారాణికి వార్డు ప్రజలు పూల వర్షం కురిపించగా ఇంకా మహిళలు మంగళ హారతులు పట్టి ఘన స్వాగతం పలికారు.

అనంతరం మంత్రి మాట్లాడుతూ ప్రతీ వార్డులోనూ తాగునీటి అవసరం బట్టి నూతన వాటర్ పైలెట్ స్కీమ్స్ పథకాలు ఏర్పాటుచేస్తున్నామని, అలాగే సాలూరు మోడల్ మున్సిపాలిటీగా అభివృద్ధి చేయడానికి ఇది మొదటి అడుగని మంత్రి సంధ్యారాణి స్పష్టం చేశారు. టిడిపి టౌన్ ప్రెసిడెంట్ నిమ్మాది చిట్టి, పరమేష్, గుల్లా వేణు, హర్ష, కూనిశెట్టి బీమారావు, అశోక్, సతీష్, అప్పయ్యమ్మ, రాధ ఇంకా పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అర్ధరాత్రి రెండు వాహనాలు ఢీ

● తృటిలో తప్పిన ప్రమాదం ● కర్నూలు జిల్లా గోనెగండ్ల వద్ద ఘటన



దెబ్బతిన్న సిఐ కారు,



దెబ్బతిన్న కర్ణాటక భక్తుల వాహనం

**గోనెగండ్ల, సెప్టెంబరు 16 ప్రభాతవార్త:** కర్నూలు జిల్లా గోనెగండ్ల విద్యుత్ సబ్‌స్టేషన్ దగ్గర ఎమ్మిగనూరు ఎక్సైజ్ సిఐ రమేష్ రెడ్డి వాహనం కర్ణాటక కు చెందిన శివభక్తులు ప్రయాణిస్తున్న తుఫాన్ వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రెండు వాహనాలు దెబ్బతిన్నాయి. ఈ సంఘటన మంగళవారం రాత్రి పొద్దుపోయాక గోనెగండ్ల గ్రామ శివార్లలో జరిగింది. ఎక్సైజ్ సిఐ రమేష్ రెడ్డి ప్రయాణిస్తున్న వాహనంలో ఎయిర్ బ్యాగ్స్ తెరుచుకోవడంతో ఆయన ప్రాణాపాయం నుంచి క్షేమంగా బయటపడ్డాడు. విషయం తెలుసుకున్న గోనెగండ్ల పోలీసులు సంఘటన స్థలంను చేరుకొని ప్రమాదానికి గల కారణాలను ఆరా తీశారు. అయితే తుఫాన్ వాహనంలో ఉన్న కర్ణాటక భక్తులు ఎక్సైజ్ సిఐ అతి వేగంగా ట్రాఫిక్ నిబంధనలకు వ్యతిరేకంగా కారు డ్రైవ్ చేసుకుంటూ వచ్చి తమ వాహనాన్ని ఢీకొట్టినట్లు ఆరోపిస్తున్నారు. సల్పగాయాల పాలైన సిఐని పోలీసులు విచారణ చేసి పంపివేసినట్లు తెలుస్తుంది. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నామని గోనెగండ్ల సిఐ చంద్రబాబు తెలిపారు.

## విశాఖలో చిరిగిన నోట్ల కలకలం... వీడిన మిస్టరీ

**విశాఖపట్నం, సెప్టెంబరు 16 ప్రభాతవార్త:** విశాఖ నగరంలో రోడ్డు పై పెద్ద సంఖ్యలో చిరిగిన కరెన్సీ నోట్లు ప్రత్యక్షమవ్వడం తీవ్ర కలకలం రేపింది. అయితే పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేయడంతో మిస్టరీ వీడింది. బుధవారం ఉదయం సెంట్రల్ పార్క్ ఎదురుగా ఉన్న రోడ్డుపై స్థానిక మార్నింగ్ వాకర్స్ ఈ చిరిగిన నోట్ల కుప్పలను గమనించారు. తెల్లవారుజామునే ఈ నోట్లను చూసిన స్థానికులు ఆశ్చర్యపోయారు. సమాచారం అందుకున్న టూటౌన్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ఆ నోట్లను స్వాధీనం చేసుకున్నారు. సిఐ అప్పల నాయుడు ఆధ్వర్యంలో అక్కడ ఉన్న సిసిటివి కెమెరాల ఫుటేజీని పరిశీలిస్తూ ఆ నోట్లను ఎవరు పడేశారనే కోణంలో దర్యాప్తు చేశారు. దర్యాప్తులో కెజిహెచ్ ప్రాంతంలోని తాడివీధికు చెందిన ఆదిమూలం సూర్యారావు రూ.50, రూ.20, రూ.10 విలువైన నోట్లను పారేసినట్టు తెలింది. పోలీసులు సూర్యారావును పిలిపించి ఆరా తీయగా సూర్యారావు కిరాణా దుకాణాలకు సరుకులను సరఫరా చేస్తున్నట్టు తేలిందని సిఐ అప్పలనాయుడు తెలిపారు. ఈ నేపథ్యంలో ఆయన ఇంట్లో ఓ అట్ట పెట్టెలో కొంత కాలంగా డబ్బులు, ఎల్‌ఐసి రసీదులు ఉంచారు. డబ్బులకు చెదపురుగులు పట్టడంతో ఆయన కుటుంబ సభ్యులకు తెలిస్తే వివాదానికి తావిస్తాదని భావించారు. దీంతో మంగళవారం సాయంత్రం సెంట్రల్ పార్క్ ఎదురుగా ఉన్న రోడ్డు పై నోట్లను సూర్యారావు పడేసినట్టు సిఐ తెలిపారు. ఈ మేరకు బుధవారం మధ్యాహ్నం సిఐ అప్పలనాయుడు, చిరిగిన నోట్లతో పాటు ఎల్‌ఐసి రసీదులు, పాన్ కార్డును సూర్యారావుకు అందజేశారు. నోట్లు వినియోగానికి సరిపోనివని భావించి పడేసినట్టు సూర్యారావు తెలిపారు. చిరగిన నోట్ల ధర సుమారు రూ.3వేలు వరకు ఉంటుందని చెప్పారు.

# గన్నవరంలో అన్న క్యాంటిన్ ప్రారంభం

**గన్నవరం(కృష్ణా), సెప్టెంబర్ 16, ప్రభాతవార్త :** గన్నవరం ప్రాంతంలో పేదప్రజల ఆకలితీర్చేందుకు నూతనంగా ఏర్పాటు చేసిన అన్నక్యాంటిన్‌ను ప్రభుత్వవిప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ ప్రారంభించారు. గన్నవరంలోని జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడామైదానం పక్కనే ఏర్పాటు చేసిన క్యాంటిన్‌ను బుధవారం మధ్యాహ్నం కూటమి నాయకులతో కలిసి ప్రారంభించారు. అనంతరం కార్మికులకు ఆహారాన్ని వడ్డించి, ఆటో కార్మికులతో కలిసి అక్కడే భోజనం చేసారు. ఈసందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటి వరకు 276 అన్న క్యాంటిన్‌లు ఏర్పాటు చేయగా గన్నవరంలో 277వ క్యాంటిన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈకేంద్రంలో ప్రతిరోజూ 400 మందికి ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం అందిస్తామన్నారు. ఇక్కడ రాత్రి భోజనం కూడా ఏర్పాటు



అన్న క్యాంటిన్ ప్రారంభిస్తున్న విప్ యార్లగడ్డ వెంకట్రావ్

చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి లేఖ రాసినట్లు యార్లగడ్డ వివరించారు. గన్నవరం నియోజకవర్గంలోని రామవరప్పాడులోనూ అన్నక్యాంటిన్ మంజూరు అయ్యిందని త్వరలో ప్రారంభిస్తామన్నారు. అక్రమాలు, అరాచకాలతో అల్లాడిన గన్నవరం ప్రజలకు కూటమి ప్రభుత్వం రాకతో ఉపశమనం లభించిందని, గన్నవరంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలతో రూపురేఖలు మారిపోతున్నాయన్నారు. రాష్ట్ర రాజధాని అమరావతికి గన్నవరం ముఖద్వారంగా మారుతుందన్నారు. గన్నవరం విమానాశ్రయం ఎదురుగా సీ-డాక్ కేంద్రం ఏర్పాటు చేసేందుకు తాను ప్రతిపా దించగా, ఇదేఅంశంపై ఐటి విద్యాశాఖామంత్రి నారా లోకేష్ కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్‌కు లేఖరాసినట్లు తెలిపారు. ప్రస్తుతం ఇక్కడ పర్యాటకశాఖ ఆధ్వర్యంలో భారీకన్వెన్షన్ సెంటర్ ఏర్పాటుకు అమోదం లభించిందన్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన మాటమేరకు అవినీతికి తావు లేకుండా గన్నవరం అభివృద్దే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు యార్లగడ్డ తేల్చిచెప్పారు. ఈకార్యక్రమంలో భారతీయ జనతాపార్టీ రైతు మోర్చా రాష్ట్ర అధ్యక్షులు చిగురు పాటి కుమారస్వామి, జనసేన నియో జకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్‌బాబు, కూటమినాయకులు పాల్గొన్నారు.

# కరవు సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్

● సెప్టెంబరు 21, 22, 23 తేదీల్లో దీక్షలు ● సమావేశంలో అఖిలపక్షం నాయకుల తీర్మానం



రౌండ్ టేబుల్ సమావేశంలో పండ్లను చూపుతూ పరిస్థితిని వివరిస్తున్న దృశ్యం



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సిపిఐ నేతలు

**అనంతపురం, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త బ్యూరో:** కరువును జాతీయ విపత్తుగా ప్రకటించాలని, కరువు సహాయక చర్యలు చేపట్టాలని కోరుతూ ఈ నెల 21, 22, 23వ తేదీల్లో అనంతపురం జిల్లాలోని అన్ని మండలాల తహశీల్దార్ కార్యాలయాల ఎదుట దీక్షలు, ధర్నాలు చేపట్టనున్నట్టు అఖిలపక్షం నాయకులు తెలిపారు. బుధవారం అనంతపురం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో కరువును జాతీయ విపత్తుగా ప్రకటించాలని కోరుతూ సిపిఐ ఆధ్వర్యంలో అఖిలపక్షం నాయకులతో రౌండ్‌టేబుల్ సమావేశం రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జగదీష్, సిపిఐ జిల్లా కార్యదర్శి పాల్యం నారాయణస్వామి, సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప, వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి రమేష్‌గౌడ్, సిపిఐ ఎంఎల్ న్యూ డెమొక్రసీ జిల్లా కార్యదర్శి ఇండ్ల ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు శంకర్, సిపిఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి వేమన, జిల్లా పండ్ల తోటల సంఘం నాయకులు అనంతలక్ష్మి రాముడు, ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి రాజారెడ్డి, ఆయా పార్టీల రైతు సంఘం నాయకులు మల్లికార్జున, చంద్రశేఖర్‌రెడ్డి, పెద్దిరెడ్డి, వ్యవసాయ కార్మిక సం ఘం జిల్లా కార్యదర్శి కేశవరెడ్డిలు పాల్గొని కరువుపై మాట్లాడారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఎల్‌నినో గురించి శాస్త్రవేత్తలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ముందుగానే హెచ్చరించారని తెలిపారు. కానీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎలాంటి ముందస్తు చర్యలు తీసుకోలేదన్నారు. పశుగ్రాసం కొరతతో పశుసంపద కబేళాలకు తరలిపోతోందన్నారు. వేరుశనగ, కంది, పెసర, అలసంద పంటలు ఎండిపోయాయని చెప్పారు. చీనీ, దానిమ్మ వంటి పండ్ల తోటల రైతులు కూడా బోర్లు ఎండిపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పలు గ్రామాల్లో తాగడానికి నీరు దొరకని దయనీయ స్థితి నెలకొందన్నారు. పశుగ్రాసం లేక మగజీవాలను పోషించడం రైతులకు ఇబ్బందిగా మారిందని చెప్పారు. దారుణమైన కరువు పరిస్థితులు రాష్ట్రంలోను, రాయలసీమ జిల్లాలో నెలకొంటే కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కరువు గురించి చర్చించకపోవడం బాధాకరమని అన్నారు. ముఖ్యమంత్రి కేవలం స్థానిక సంస్థల ఎన్నికల గురించి మాత్రమే పట్టించుకుంటున్నారని, రైతుల సమస్యలపై స్పందించడం లేదన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో లాగా ఇతర రాష్ట్రాల నుంచి పశుగ్రాసం తెప్పించి రైతులకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. రైతుల్లో భరోసా, ఆత్మస్థైర్యాన్ని నింపాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. రైతుల రుణాలను మాఫీ చేయాలన్నారు. తక్షణమే కొత్త రుణాలను మంజూరు చేయాలన్నారు. పక్క రాష్ట్రంలో తెలంగాణా, తమిళనాడులో రైతుల రుణాలను మాఫీ చేశారని గుర్తు చేశారు. అలాగే మన రాష్ట్రంలో కూడా కరువు నేపథ్యంలో రైతుల రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో 90 శాతంపైన హార్టికల్చర్ డ్రిప్‌పై సాగవుతోందని తెలిపారు. వర్షాభావంతో ఆ పంట లు కూడా ఎండిపోయే ప్రమాదం నెలకొందన్నారు. సకాలంలో విద్యుత్ సరఫరా చేయాల్సి ఉందన్నారు. జిల్లాలో వ్యవసాయం బాగుంటేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కూడా బలంగా ఉంటుందని తెలిపారు. వ్యవసాయాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. కరువు సహాయ కర్యలు చేపట్టాలని, కరువును జాతీయ వితపత్తుగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు ఆయా మండలాల్లోని తహశీల్దార్ కార్యాలయాల ఎదుట ప్రతిపక్ష పార్టీల ఆధ్వర్యంలోను, రైతు సంఘాల ఆధ్వర్యంలో దీక్షలు చేపట్టాలని ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో తీర్మానించారు. ఈ కార్యక్రమంలో పెనకచర్ల కృష్ణ, సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రామకృష్ణ, టి.నారాయణస్వామి, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్‌గౌడ్, కార్యవర్గ సభ్యులు రమేష్, రమణ, చెన్నప్ప, మల్లికార్జున, నాగరాజు, రామాంజినేయులు, సిపిఎం నగర కార్యదర్శి రామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు వన్ సైడ్ విక్టరీ రావాలి

● కేడర్ అప్రమత్తంగా ఉండి గొడ్డలి పార్టీ కుట్రలను సమర్థవంతంగా తిప్పికొట్టాలి ● కోవూరు నియోజకవర్గ సమన్వయ సమావేశంలో టిడిపి నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్

**నెల్లూరు, సెప్టెంబర్ 16, ప్రభాతవార్త - వైద్యం:** అక్టోబర్, నవంబర్‌లో స్థానిక సంస్థల ఎన్నికలు జరగబోతున్నాయి. స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు వన్ సైడ్ విక్టరీ రావాలి, రాష్ట్రవ్యాప్తంగా ఎన్ డిఎ జెండా ఎగరాలని తెలుగుదేశం పార్టీ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ పార్టీ కేడర్‌కు పిలుపునిచ్చారు. కోవూరు అసెంబ్లీ నియోజకవర్గ పార్టీ కార్యకర్తల సమన్వయ సమావేశంలో నారా లోకేష్ మాట్లాడుతూ ఎన్నికల్లో గెలిస్తే కార్యకర్తలకు న్యాయం, ప్రజలకు మరింత సేవ చేయగలమని అన్నారు. వైసిపి నాయకులు ఫస్ట్ గ్రేడ్ క్రిమినల్స్ రాజకీయ ముసుగులో కుల, మత విభేదాలు రెచ్చగొడతారు. మనం అప్రమత్తంగా ఉండాలి. వారి దుష్ప్రచారాన్ని సమర్థవంతంగా తిప్పికొట్టాల్సిన బాధ్యత కార్య కర్తలపై ఉంది. కోడికత్తి డ్రామా చూశాం. సొంత బాబాయిని లేపేసి బాబుగారి చేతిలో కత్తిపెట్టి నారాసుర రక్తచరిత్ర అని రాశారు. ఇటీవల ఈడి అవినాష్‌ను పిలిచింది. ఎన్నికల సమయంలో జగన్ గులకరాయి డ్రామా చూస్తే ఆశ్చర్యమేసింది. ప్రతిదీ చంద్రబాబు, లోకేష్ చూసుకోవడం సాధ్యం కాదు. మనకు వారి మాదిరి దొంగ పేపర్లు, టివిలు లేవు. అయితే కోటిమంది కార్యకర్తలు ఉన్నారు. మనమంతా మాట్లాడటం మొదలు పెడితే వారు ఎన్నిరాసినా ప్రజలు నమ్మరు.

**చేసిన మంచితోపాటు**

**గొడ్డలి పార్టీ కుట్రలను తెలియజేయండి..**

ఈ సందర్భంగా విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ భారతదేశంలో ఎవరూ ఇవ్వని విధంగా పెన్షన్లు ఇస్తున్నాం. ఇంట్లో ఎంతమంది చదువుకునే పిల్లలు ఉంటే అందరికీ తల్లికి వందనం ఇస్తున్నాం, స్త్రీశక్తి కింద ఉచిత బస్సు కల్పిస్తున్నాం. రైతులకు అన్నదాత సుఖీభవ, చేనేతల సేవలో, ఆటోవాలా సేవలో, మత్స్యకారుల సేవలో వంటి పథకాలు అమలు చేస్తున్నాం. 16వేల టీచర్ పోస్టులు, 6వేల కానిస్టేబుల్ పోస్టులు భర్తీ చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిది. గూగుల్, రాయల్ ఎన్ ఫీల్డ్ వంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టుల ను రాష్ట్రానికి రప్పించాం. అభివృద్ధి, సంక్షేమం జోడెడ్ల బండిలాంటివి. వాటిని సమర్థమంతంగా ముందుకు తీసుకెళ్తున్నాం. వైసిపి హయాంలో రోడ్లపై పడిన గుంతలు పూడ్చడానికి 2వేల కోట్లు ఖర్చయ్యాయి. ప్రజాప్రభుత్వం గత రెండేళ్లలో చేసిన మంచిపనులతోపాటు గొడ్డలిపార్టీ కుట్రలను ప్రజలకు తెలియజెప్పాల్సిన బాధ్యత కేడర్ పై ఉందన్నారు.

**డిఎస్సీ అంటే జగన్‌కు డ్రగ్స్,**

**శాండ్, చీప్ లిక్కర్ గుర్తొస్తాయి**

డిఎస్సీకి, ఎపిపిఎస్సీకి తేడా తెలియని వ్యక్తి నన్ను ప్రశ్నిస్తున్నారు. దేశ చరిత్రలో అనేక మంది సిఎంలను చూశా, గత అయిదేళ్లలో సైకోని చూశా. గొడ్డలిపార్టీ అధినేతకు డిఎస్సీ అంటే డ్రగ్స్, శాండ్, చీప్ లిక్కర్ గుర్తొస్తాయి. వారు అధికారంలో ఉన్న సమయంలో ఒక్క టీచర్ పోస్టు ఇవ్వలేదు. మనం 16వేల టీచర్ పోస్టులు ఇస్తే ప్రశ్నిస్తున్నారు. డిఎస్సీపై తప్పుడు ఆరోపణలతో సిబిఐ ఎంక్వయిరీకి ఆదేశించాలని హైకోర్టులో వాళ్లు పిటిషన్ వేయగా, కోర్టు మొట్టికాయలు వేయ డంతో పిల్ వేస్తే విత్‌డ్రా చేసుకున్నారు. ఏ తప్పు చేయని చంద్రబాబును 53రోజులు జైలులో పెడితే సింహంలా తిరిగి వచ్చారు. ఆయన ఎప్పు డు భయపడలేదు. నేను మళ్లీ చాలెంజ్ చేస్తున్నాను.

**డిఎస్సీపై చర్చకు నేను, సిద్ధం, జగన్ సిద్ధమా...**

అరిగిపోయిన రికార్డులా డిఎస్సీలో అవకతవకలు అంటూ లేనిపోని విమర్శలు చేస్తున్నారు. ఎటువంటి తప్పు జరగకపోయినా ప్రజలను నమ్మించేలా వాళ్లు అబద్ధాలు చెబుతున్నారు. మనం నిజాన్ని ఎక్కువ సార్లు ప్రజలకు చెప్పాలి. ఇటీవల 10వేల టీచర్, పోలీసు, ఇతర పోస్టులతో నోటిఫికేషన్ ఇచ్చాం. అదీ మన చిత్తశుద్ధి.

**కేడర్ అంతా ప్రజలతో మమేకం కావాలి..**

కార్యకర్తలు ప్రజల వద్దకు వెళ్లి, వారితో మమేకం కావాలి. వారితో అనుబంధం చాలా ముఖ్యం. ప్రజలతో బంధం ఏర్పడటం వల్లే మంగళగిరి ప్రజలు నన్ను 91వేల మెజారిటీతో గెలిపించారు. కార్యకర్తలంతా ప్రజలతో అనుసంధానం అవ్వాలి. ప్రజలకు దగ్గర కావాల్సిన అవసరం ఉంది. క్లస్టర్, యూనిట్ పనిచేయకపోతే దండం పెట్టి మార్చుకుంటాం. డోర్ టు డోర్ కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా 8వేల బూత్ లలో ఇన్చార్జిలు తిరగలేదు. 75ఏళ్ల వయసులో బాబు గారు తిరుగుతుంటే మనం వెళ్లకపోతే ఎలా? పార్టీ కార్యకర్తలంతా సీరియస్‌గా తీసుకొని పనిచేయండి.

## సాయికృష్ణ అదృశ్యం కేసులో ముగిసిన కస్టడీ

**విజయవాడ,సెప్టెంబరు 16, ప్రభాతవార్తప్రతినిధి:** రౌడీ షీటరు గాదె సాయికృష్ణ అదృశ్యం కేసులో నిందితులైన హెడ్‌కానిస్టేబుల్ అశోక్, హోంగార్డు వెంకటరాజుల రెండు రోజుల పోలీసు కస్టడీ ముగిసింది. బుధవారం సిట్ అధికారులు వీరిని విచారించి, వైద్య పరీక్షల అనంతరం న్యాయస్థానంలో హాజరుపరిచారు. ఆ తర్వాత ఇద్దరినీ రిమాండ్ ఖైదీలుగా జైలుకు తరలించారు. గాదె సాయికృష్ణ కేసును సిట్ విచారిస్తోంది.సాయికృష్ణ కేసులో నిందితులందరిని సిట్ దశల వారిగా కోర్టు అనుమతితో కస్టడీలోకి తీసుకుని విచారిస్తుంది.సిట్ నిందితుల రిమాండ్ రిపోర్టులో సాయికృష్ణ లాకప్‌డెత్ అయినట్లు పేర్కొంది.ఈ కేసులో సస్పెండయిన కృష్ణలంక సీఐ నాగరాజు కీలక నిందితునిగా ఉన్నాడు

## విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

**సైదాపురం (నెల్లూరు), సెప్టెంబర్ 16, ప్రభాతవార్త :** విద్యుత్ షాక్‌కు గురై ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన సైదాపురం మండలంలో చోటు చేసుకుంది. మండల పరిధిలోని తురిమెర్ల గ్రామానికి చెందిన కాకాణి నాగరాజు(37) తండ్రి పరుశురామయ్య(లేటు)అనే వ్యక్తి మంగళవారం రాత్రి సుమారు 12.30 గంటల సమయంలో తన ఇంటి బయట ఫ్యాన్ పెట్టుకుని ఉన్నాడు. అయితే నాగరాజు ఇంటిలోకి వెళ్లి నీళ్ల తాగి తిరిగి తలు పులు వేస్తున్న సమయంలో మధ్యలో ఉన్న విద్యుత్ వైరు తెగిపోవడంతో ఆ వైరును సరిచేసే క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిసిందని ఎస్సై దుర్గాప్రసాద్ తెలిపారు. మృతి చెందిన నాగరాజుకు భార్య ప్రమీల, ముగ్గురు ఆడ పిల్లలు ఉన్నట్లు ఎస్సై తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు దుర్గా ప్రసాద్ తెలిపారు.

17-09pg10exHNWMJQEV:17-09pg10exHNWMJQEV.qxd 9/17/2026 12:23 AM Page 1



## వెస్టిండీస్‌తో వన్డే సిరీస్:
# ముగ్గురు ఐపిఎల్ కెప్టెన్‌లు రీఎంట్రీ



**న్యూఢిల్లీ:** వెస్టిండీస్‌తో ఈ నెల 27న తిరువనంతపురం వేదికగా ప్రారంభం కానున్న మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ కోసం భారత జట్టు ఎంపిక ప్రక్రియ అత్యంత ఆసక్తికరంగా మారింది. అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ తుది జట్టును ఎంపిక చేయడంలో పలు కీలక అంశాలను పరిశీలిస్తోంది. ఫిట్‌నెస్ సాధించిన స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా. వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్ పునరాగమనంపై ప్రధానంగా చర్చ జరగనుంది. ఆసియా క్రీడలు షెడ్యూల్ కారణంగా పలువురు ప్రధాన ఆటగాళ్లు జపాన్ పర్యటనలో ఉండటంతో, వన్డే జట్టు కూర్పు సెలక్టర్లకు పెద్ద సవాలుగా పరిణమించింది. ఇదే సమావేశంలో అగార్కర్ పదవీకాలాన్ని 2027 వన్డే ప్రపంచకప్ వరకు పొడిగించే అంశంపై బోర్డు పెద్దలతో చర్చలు జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రధానంగా టీమిండియాను పేస్ ఆల్‌రౌండర్ల కొరత సెలక్టర్లను వేధిస్తోంది. నితీశ్ కుమార్‌రెడ్డి ఆసియా క్రీడల్లో పాల్గొంటుండగా, సూర్యాన్ష్ షెడ్గే, వెంకటేశ్ అయ్యర్ గాయాల పాలయ్యారు. దీంతో పాండ్యా నేరుగా 50 ఓవర్ల మ్యాచ్‌లలో బౌలింగ్, ఫీల్డింగ్ చేయగలరా అనే అంశంపైనే ఆయన ఎంపిక ఆధారపడి ఉంది. మరోవైపు ఇషాన్ కిషన్ గైర్హాజరీతో పంత్‌కు 15 మంది సభ్యుల జట్టులో చోటు దక్కే అవకాశాలు మెరుగయ్యాయి. అయితే కేఎల్ రాహుల్ మొదటి ఎంపిక వికెట్ కీపర్‌గా ఉంటారు. శ్రేయస్ అయ్యర్ అందుబాటులో లేకపోవడంతో కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు రాహుల్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు. ఒకవేళ పంత్ జట్టులోకి రాకపోతే ధ్రువ్ జురెల్‌ను ఎంపిక చేసి, పంత్‌ను ఇరానీ కప్ లో రెస్ట్ ఆఫ్ ఇండియా జట్టు సారథిగా పంపే వీలుంది. టాప్ ఆర్డర్‌లో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ల తర్వాత నాలుగో స్థానంలో రుతురాజ్ గైక్వాడ్ బరిలోకి దిగే ఛాన్స్ ఉంది. రజత్ పటీదార్, యశస్వి జైస్వాల్ రిజర్వ్ బ్యాటర్లుగా ఉండే అవకాశముంది. స్పిన్ విభాగంలో హర్ష్ దూబే గాయపడటం, అక్షర్ పటేల్ ఆసియా గేమ్స్ వెళ్లడంతో రవీంద్ర జడేజా లేదా మానవ్ సుతార్ కు పిలుపు రావొచ్చు. పేస్ విభాగంలో విశ్రాంతి అనంతరం మహమ్మద్ సిరాజ్‌తో పాటు. ప్రసిద్ధ్ కృష్ణ, గుర్నూర్ బ్రార్, ప్రిన్స్ యాదవ్ జట్టులో చోటు దక్కించుకోనున్నారు.

# తొలి టి20లో శ్రీలంక ఓటమి
## 119 పరుగులతో ఇంగ్లండ్ రికార్డు విజయం



**న్యూఢిల్లీ:** హాంప్‌షైర్ (ఇంగ్లాండ్) సౌతాంప్టన్ వేదికగా శ్రీలంకతో జరిగిన తొలి టీ20లో ఇంగ్లండ్ ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ 20 ఓవర్లలో 4 వికెట్లకు 254 పరుగుల భారీ స్కోరు చేసింది. ఇక లక్ష్య ఛేదనలో శ్రీలంక 19 ఓవర్లలో 135 పరుగులకే కుప్పకూలింది. దీంతో ఇంగ్లండ్ 119 పరుగుల తేడాతో గెలిచి మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో నిలిచింది. ఇంగ్లండ్ భారీ స్కోరుకు కెప్టెన్ హ్యారీ బ్రూక్ ప్రధాన కారకుడిగా నిలిచాడు. కేవలం 49 బంతుల్లోనే 114 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. మరోవైపు బ్రూక్ కు జోస్ బట్లర్ కూడా అద్భుతంగా సహకరించాడు. వీరిద్దరూ రెండో వికెట్‌కు 128 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. బట్లర్ 44 బంతుల్లో 80 పరుగులు చేశాడు. వీరి దూకుడుతో ఇంగ్లండ్ పవర్‌ప్లే ముగిసేసరికి 90 పరుగులు చేయగలిగింది. ఈ మ్యాచ్‌లో ఇంగ్లండ్ 254 పరుగులు చేయడం ద్వారా శ్రీలంకపై టీ20ల్లో తన అత్యధిక స్కోరును నమోదు చేసింది. అంతేకాకుండా వరుసగా రెండో టీ20లో 250కుపైగా పరుగులు చేసింది. 255 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన శ్రీలంకకు ఆరంభం నుంచే ఎదురుదెబ్బలు తగిలాయి. పాతుమ్ నిస్సాంక 12, కమిల్ మిశారా 10, లహిరు ఉదారా 5, చరిత్ అసలంక 10 పరుగులకే వెనుదిరిగారు. దసున్ శనక 24, దునిత్ వెల్లాలగే 33 పరుగులతో పోరాడినా జట్టును గెలిపించలేకపోయారు. చివరకు శ్రీలంక 19 ఓవర్లలో 135 పరుగులకు ఆలౌటైంది. ఇంగ్లండ్ బౌలర్లలో సోనీ బేకర్ కేవలం 12 పరుగులు ఇచ్చి 3 వికెట్లు పడగొట్టాడు. అతనికి తోడుగా లియామ్ డాసన్, జేమీ ఓవర్టన్ చెరో రెండు వికెట్లు తీశారు. జోష్ టంగ్, విల్ జాక్స్, ఆదిల్ రషీద్ తలో వికెట్ దక్కించుకున్నారు. ఇక శ్రీలంకను 119 పరుగుల భారీ తేడాతో ఓడించడం ద్వారా ఇంగ్లండ్ రికార్డు విజయాన్ని నమోదు చేసింది.




## వరల్డ్ టి20 ర్యాంకింగ్స్‌లో..
# నం.1 కిషన్
### రెండో స్థానానికి అభిషేక్

**న్యూఢిల్లీ:** ఆఫ్ఘానిస్తాన్‌తో జరుగుతున్న టీ20 సిరీస్‌లో భారత్ సాధించిన అద్భుతమైన ఆరంభం ప్రభావం, తాజా ఐసిసి పురుషుల టీ20 ఆటగాళ్ల ర్యాంకింగ్స్‌లో స్పష్టంగా కనిపిస్తోంది. ఈ మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 2-0తో తిరుగులేని ఆధిక్యాన్ని సాధించింది. ఈ రెండు మ్యాచ్‌లలోనూ పలువురు భారత ఆటగాళ్లు అద్భుతమైన ప్రదర్శన కనబరిచారు. ఈ సిరీస్ మొదటి మ్యాచ్‌లో భారత ఓపెనింగ్ బ్యాటర్ అభిషేక్ శర్మ 82 పరుగులతో అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడారు. దీంతో పాకిస్థాన్‌కు చెందిన సాహిబ్‌జాదా ఫర్హాన్‌ను అధిగమించి, తాజా బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో ఒక స్థానం ఎగబాకి రెండో స్థానానికి చేరుకున్నారు. తాజా ర్యాంకింగ్స్‌లో అభిషేక్ కంటే ఇషాన్ కిషన్ ముందున్నాడు. ఈ ఇద్దరు భారతీయ ఆటగాళ్ల మధ్య 51 రేటింగ్ పాయింట్ల తేడా ఉంది. రెండో మ్యాచ్‌లో అర్ధశతకం సాధించిన సంజు శాంసన్ గణనీయమైన పురోగతిని సాధించి, నాలుగు స్థానాలు ఎగబాకి 30వ స్థానానికి చేరుకున్నాడు. ఇక బౌలర్ల ర్యాంకింగ్స్‌లో ఆఫ్ఘనిస్థాన్ సిరీస్ మొదటి రెండు మ్యాచ్‌లలో అద్భుత ప్రదర్శన కనబరిచిన వరుణ్ చక్రవర్తి, రెండు స్థానాలు ఎగబాకి ఐదవ స్థానానికి, జస్ప్రీత్ బుమ్రా ఏడు స్థానాలు మెరుగుపరుచుకుని 10వ స్థానానికి, అర్ష్‌దీప్ సింగ్ 11 స్థానాలు ఎగబాకి 14వ స్థానానికి, అలాగే అక్షర్ పటేల్ ఆరు స్థానాలు పైకి ఎగబాకి 27వ స్థానానికి చేరుకున్నారు. ఆల్ రౌండర్ల ర్యాంకింగ్స్‌లో ఆఫ్ఘనిస్తాన్‌కు చెందిన అజ్మతుల్లా ఒమర్జాయ్ గణనీయంగా ముందుకు దూసుకెళ్లాడు. ఈ 26 ఏళ్ల ఆటగాడు సిరీస్ ఆరంభ మ్యాచ్‌లో అజేయ అర్ధశతకం సాధించాడు.

## వరల్డ్ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్:
# సుజీత్ విజయం

**లక్నో:** అక్టోబర్ 24 నుండి నవంబర్ 1 వరకు కజకిస్తాన్‌లోని అస్తానాలో జరగనున్న ప్రపంచ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌ల కోసం లక్నోలో జరిగిన జాతీయ ఎంపిక ట్రయల్స్‌లో, ప్రపంచ నంబర్ 1 సుజీత్ కల్కల్ పురుషుల 65 కేజీల విభాగంలో గెలుపొందాడు. హోరాహోరీగా సాగిన ఈ పోరులో ఫైనల్‌లో అనుజ్ కుమార్‌ను 8-3 తేడాతో ఓడించి విజయం సాధించాడు. అలాగే పురుషుల 74 కేజీల విభాగంలో యశ్ అద్భుత ప్రదర్శన కనబరిచి ఫైనల్‌లో దీపక్‌ను 10-4 తేడాతో ఓడించాడు. 57 కేజీల విభాగంలో అక్షయ్ ధేరేపై 11-4 తేడాతో గెలుపొంది రాహుల్ అగ్రస్థానాన్ని కైవసం చేసుకోగా, 86 కేజీల ఫైనల్‌లో పుష్పేందర్ దలాల్, హిమాంశు అంటిల్‌పై 10-4 తేడాతో విజయం సాధించాడు. ఇక 97 కేజీల బౌట్‌లో విక్కీ 3-2 తేడాతో పర్వీన్ కుమార్‌ను ఓడించగా, 125 కేజీల విభాగంలో జస్పూరన్ సింగ్ 5-1 తేడాతో రోహిత్‌ను ఓడించి విజేతగా నిలిచాడు. గ్రీకోరోమన్ విభాగంలో, 60 కేజీల కేటగిరీలో హర్ష్ లలిత్‌పై 9-0 తేడాతో ఘన విజయం సాధించాడు. ఉత్కంఠభరితమైన 67 కేజీల ఫైనల్‌లో సచిన్, కరణ్‌జిత్ సింగ్‌పై 6-5 తేడాతో, 77 కేజీల విభాగంలో లవ్‌ప్రీత్ సింగ్, వికాస్‌పై 10-8 తేడాతో గెలుపొందగా. 87 కేజీల విభాగంలో రోహిత్, రోహిత్ బురాను 5-2 తేడాతో ఓడించగా, 97 కేజీల విభాగంలో అభిమన్యు, వీరేంష్ కుండుపై 123 తేడాతో విజయం సాధించాడు. అలాగే 130 కేజీల ఫైనల్‌లో గుర్సేవక్‌పై జోగిందర్ ఫాల్ ద్వారా గెలుపొందాడు.




## మహిళల ప్రీమియర్ లీగ్..
# కొచ్చిలో అక్టోబర్ 28న ప్లేయర్ల వేలం

**ముంబై:** మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపిఎల్) ఐదవ ఎడిషన్ 2027 జనవరి 14 నుండి ఫిబ్రవరి 7 వరకు జరగనుంది. భారత క్రికెట్ నియంత్రణ మండలి రాబోయే సీజన్‌కు సంబంధించిన కీలక తేదీలను బుధవారం ప్రకటించింది. కొత్త సీజన్‌కు ముందు మొదటి ప్రధాన గడువు సెప్టెంబర్ 28న జరిగే ప్లేయర్ రిటెన్షన్ గడువుగా పేర్కొంది. దీంతో తమ ప్రస్తుత స్క్వాడ్‌ల నుండి ఏ ఆటగాళ్లను నిలుపుకోవాలనుకుంటున్నారో నిర్ణయించుకోవడానికి ఐదు ఫ్రాంచైజీలకు అప్పటి వరకు సమయం ఉంటుంది. జట్టు కూర్పులో తదుపరి దశ అక్టోబర్ 28న గ్రాండ్ హయత్ కొచ్చిలో జరిగే డబ్ల్యూపిఎల్ ప్లేయర్ వేలంలో జరగనుంది. ఫ్రాంచైజీలు తమ జట్లలోని ఖాళీలను పూరించి, ఐదవ సీజన్ కోసం తమ జట్ల కూర్పును ఖరారు చేసుకుంటాయి. 2026 సీజన్‌లో ఫైనల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌ను ఓడించి రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తమ రెండవ డబ్ల్యూపిఎల్ టైటిల్‌ను గెలుచుకుంది, దాని తర్వాత 2027 ఎడిషన్ జరగనుంది. ఈ లీగ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, ఢిల్లీ క్యాపిటల్స్, ముంబై ఇండియన్స్, గుజరాత్ జెయింట్స్, యూపీ వారియర్స్ ఐదు ఫ్రాంచైజీలు కొనసాగుతున్నాయి. ఇవి అంతర్జాతీయంగా పేరుపొందిన ఆటగాళ్లతో పాటు, వర్ధమాన భారతీయ ప్రతిభకు కూడా ఒక వేదికను అందిస్తున్నాయి. ఈ వేలానికి ముందు ఫ్రాంచైజీలు తమ స్క్వాడ్‌లను సమీక్షించుకునేందుకు, ఆటగాళ్లను నిలుపుకునే విండో వారికి ప్రత్యేకంగా కీలకం కానుంది. సెప్టెంబర్ 28న వారు తీసుకునే నిర్ణయాలు, నెల రోజుల తర్వాత జరిగే కొచ్చి వేలం కోసం వారి వ్యూహాలను రూపొందిస్తాయి. షెడ్యూల్ ఖరారు కావడంతో ఫ్రాంచైజీల దృష్టి ప్లేయర్ల రిటెన్షన్‌పై కేంద్రీకృతంకానుంది.



# నష్టాలకు బ్రేక్.. ఈక్విటీ బుల్‌రన్




**ముంబయి, సెప్టెంబరు 16:** రెండు రోజుల పాటు పతనమైన భారతీయ స్టాక్ మార్కెట్లు బుధవారం నాటి ట్రేడింగ్ ముగింపు సమయానికి బలమైన కొనుగోళ్ల మద్దతుతో లాభాల్లో ముగిసాయి. ఉదయం పూట ఆరంభ ట్రేడింగ్‌లో మూడో రోజు కూడా పతనం తప్పదేమోనన్న ఆందోళన ఇన్వెస్టర్లలో వ్యక్తమైనప్పటికీ, రోజు గడిచేకొద్దీ బ్యాంకింగ్, ఫైనాన్షియల్, ఎఫ్ఎంసిజీ రంగాల షేర్లలో తక్కువ ధరల వద్ద వెల్లువెత్తిన కొనుగోళ్లు సూచీలను ఆదుకున్నాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి బిఎస్ఇ సెన్సెక్స్ 333 పాయింట్లు పుంజుకుని 74,336 వద్ద స్థిరపడగా, ఎన్ఎస్ఇ నిఫ్టీ50 సూచీ 99 పాయింట్లు పెరిగి 23,218 స్థాయికి చేరుకుని, అత్యంత కీలకమైన 23,200 మద్దతు స్థాయిని నిలబెట్టుకోగలిగింది. అమెరికా సెంట్రల్ బ్యాంకు ఫెడరల్ రిజర్వ్ జారీ చేయబోయే ఎఫ్ఓఎంసి వడ్డీరేట్ల నిర్ణయంపై ఉత్కంఠ నెలకొనడంతో పెట్టుబడిదారులు అచితూచి వ్యవహరించారు. దీనివల్ల మార్కెట్ ముగింపు వద్ద పెరిగిన మరియు తగ్గిన షేర్ల సంఖ్య దాదాపు సమానంగా నమోదు కావడంతో మార్కెట్ ధోరణి తటస్థంగా ముగిసింది. లార్జ్‌క్యాప్ సూచీలు కోలుకున్నప్పటికీ మిడ్‌క్యాప్ విభాగం నిరాశపరిచింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ సూచీ 4 పాయింట్ల స్వల్ప క్షీణతతో 60,874 వద్ద ముగిసింది. ముఖ్యంగా మిడ్‌క్యాప్ విభాగంలో ప్రీమియర్, కళ్యాణ్ జ్యువెలర్స్, నిప్పన్ లైఫ్ మరియు సోనా బిఎల్‌డబ్ల్యు షేర్లు తీవ్ర అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొని నష్టాల్లో ముగిశాయి. మరోవైపు, మార్కెట్‌ను పతనం నుండి గట్టెక్కించడంలో బ్యాంకింగ్, ఫైనాన్షియల్ రంగాలు కీలక పాత్ర పోషించాయి. నిఫ్టీ బ్యాంక్ సూచీ ఏకంగా 498 పాయింట్లు ఎగబాకి 56,292 స్థాయి వద్ద ముగిసింది. నిఫ్టీకి ప్రధానంగా ఐటిసి, ఎస్‌బిఐ, యాక్సిస్ బ్యాంక్ షేర్లు అతిపెద్ద కంట్రిబ్యూటర్లుగా నిలిచాయి. ఇవే కాకుండా, దిగువ స్థాయిలలో హెచ్‌డిఎఫ్‌సి లైఫ్, ఎస్‌బిఐలైఫ్ వంటి ఇన్సూరెన్స్ షేర్లు 3 శాతం వరకు లాభపడగా, గోల్డ్ లోన్ రంగానికి చెందిన ముత్తూట్ ఫైనాన్స్ షేరు 2 శాతం లాభాన్ని నమోదుచేసింది. బ్యాంక్, ఎఫ్ఎంసిజీ రంగాల ర్యాలీకి ఐటీ రంగానికి చెందిన షేర్లు ప్రతిబంధకంగా మారాయి. నిఫ్టీ పతనమైన టాప్ ఐదు స్టాక్‌లలో నాలుగు ఐటీ రంగానికి చెందిన కంపెనీలే కావడం గమనార్హం. టీసీఎస్, విప్రో, ఇన్ఫోసిస్ మరియు టెక్ మహీంద్రా షేర్లలో సాగిన తీవ్ర విక్రయాలు మార్కెట్ మరింత ఎత్తుకు చేరకుండా లాభాలను పరిమితం చేశాయి.

# జిఎస్‌టి 2.0లో ప్రక్రియల సంస్కరణలు
## అక్టోబర్ 7న జిఎస్‌టి కౌన్సిల్ భేటీ..



**బెంగళూరు, సెప్టెంబరు 16:** వస్తు సేవల పన్ను వ్యవస్థలో తదుపరి దశ సంస్కరణలపై అక్టోబర్ 7న జరిగే జిఎస్‌టి కౌన్సిల్ సమావేశంలో చర్చించనున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బుధవారం తెలిపారు. ఈ ఇన్వాయిసింగ్, ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ నిబంధనలకు సంబంధించిన ప్రక్రియల సంస్కరణలు ప్రధానంగా చర్చకు రానున్నాయని ఆమె వెల్లడించారు. ఈ సంస్కరణలను 2.0లోనే ఇవి చేస్తున్నామని సీతారామన్ స్పష్టం చేశారు. కంపోజిషన్ స్కీమ్‌లో ఉన్న వ్యాపారులను సహా అన్ని పన్ను చెల్లింపుదారులకు ఈఇన్వాయిసింగ్‌ను విస్తరించడం, ఐటిసి నిబంధనలను హేతుబద్ధీకరించడం వంటి అంశాలు కూడా ఈ ప్రక్రియలో భాగం కావచ్చని తెలిపారు. బెంగళూరులో ఇంటర్నేషనల్ ట్యాక్స్ రీసెర్చ్ అండ్ అనాలిసిస్ ఫౌండేషన్ నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. గత జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో పన్ను రేట్ల హేతుబద్ధీకరణపై ప్రధానంగా దృష్టి పెట్టామని, ప్రక్రియల సంస్కరణలను తదుపరి సమావేశానికి వాయిదా వేసినట్లు ఆమె తెలిపారు. పరిశ్రమ నుంచి సూచనలు రావాలిసదస్సులో ప్రస్తావించిన పలు అంశాలను ప్రక్రియల సంస్కరణల అజెండాలో పరిశీలిస్తామని సీతారామన్ చెప్పారు. జిఎస్‌టి వ్యవస్థలో ప్రభుత్వం ఇప్పటివరకు పరిష్కరించలేక పోయిన లోపాలు లేదా అసమానతలపై పరిశ్రమలు నిర్దిష్ట ప్రతిపాదనలు, సూచనలు పంపాలని ఆమె కోరారు. పన్ను నిపుణులు, పరిశ్రమ సంఘాలు, పరిశోధకులు కేవలం తక్కువ పన్ను రేట్లు, మినహాయింపులు, రాయితీల కోసం మాత్రమే డిమాండ్ చేయకుండా ఆధారాలతో కూడిన పన్ను విధాన రూపకల్పనకు మరింతగా సహకరించాలని సూచించారు. ప్రస్తుతం పన్ను వ్యవస్థకు ఉపయోగపడని నిబంధనలను గుర్తించి వాటిపై చర్చ జరపాలని ఆమె అన్నారు ఆర్థిక వేత్తలు, పన్ను న్యాయవాదులు, చార్టర్డ్ అకౌంటెంట్లు, విద్యావేత్తలు, పరిశ్రమ నిపుణులను ఒకే వేదికపైకి తీసుకువచ్చే సంస్థలు దేశానికి అవసరమని ఆమె అన్నారు. ఇలాంటి పరిశోధనలకు ప్రజా విధానాల రూపకల్పనలో మరింత ప్రాధాన్యం లభించాల్సిన అవసరం ఉందన్నారు.

డిజిటల్ ఆర్థిక వ్యవస్థపై పన్నుల విధింపునకు సంబంధించి నిర్ణయాలు తీసుకునే ముందు వాటి ప్రభావాలను పూర్తిగా పరిశీలించాలని ఆర్థిక మంత్రి సూచించారు. అంతర్జాతీయ ఒప్పందంపై నమ్మకాన్ని పెంచేందుకు డిజిటల్ కంపెనీలపై విధించిన రెండు పన్నులను భారత్ ఉపసంహరించుకుందని తెలిపారు. డిజిటల్ కంపెనీలపై పన్నుల అంశాన్ని భారత్ పన్ను ఆదాయాన్ని కోల్పోతుందా లేదా అనే కోణంలో మాత్రమే చూడకూడదని, ఇది విస్తృతమైన అంతర్జాతీయ చర్చలో భాగమని స్పష్టం చేశారు. క్రిప్టోకరెన్సీకి సంబంధించిన అంశాలు భారత్‌లోని భాగస్వామ్య వర్గాలతో పాటు ఇతర దేశాలతోనూ చర్చల్లో ఉన్నాయని సీతారామన్ తెలిపారు.

టైగర్ గ్లోబల్ కేసులో సుప్రీంకోర్టు తీర్పు, మారిషస్ మార్గంలో భారత్‌లోకి వచ్చే పెట్టుబడులపై దాని ప్రభావానికి సంబంధించిన ఆందోళనలపై కూడా మంత్రి స్పందించారు. 2014 నుంచి ప్రభుత్వం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల పరిమితులను క్రమంగా పెంచుతూ వచ్చిందని సీతారామన్ తెలిపారు. భద్రతకు సంబంధించిన అంశాలు ఉన్న కొన్ని రంగాలను మినహాయిస్తే, ప్రస్తుతం చాలా పెట్టుబడులు ఆటోమేటిక్ రూట్ ద్వారా వస్తున్నాయని చెప్పారు. దేశంలో డిజిటల్ చెల్లింపుల మౌలిక వసతులు గణనీయంగా విస్తరించినప్పటికీ, వాటి వినియోగం అన్ని వర్గాల్లో సమానంగా లేదని మంత్రి తెలిపారు. చిన్న దుకాణాలు, ప్రధాన రహదారుల వెంటఉన్న వ్యాపార సంస్థలు డిజిటల్ చెల్లింపు సదుపాయాలు అందుబాటులో ఉన్నప్పటికీ ఇప్పటికీ నగదు చెల్లింపులకు ప్రాధాన్యం ఇస్తున్నాయని ఆమె పేర్కొన్నారు.


## అదానీని వెనక్కినెట్టేసిన
# టిక్‌టాక్ బిలియనీర్



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 16:** ఆసియా కుబేరుల జాబితాలో అగ్రస్థానం మారింది. భారత పారిశ్రామిక దిగ్గజం గౌతమ్ అదానీని వెనక్కి నెట్టి, ప్రముఖ సోషల్ మీడియా యాప్ టిక్‌టాక్ మాతృసంస్థ బైట్‌డ్యాన్స్ వ్యవస్థాపకుడు జాంగ్ యిమింగ్ ఆసియాలోనే అత్యంత ధనవంతుడిగా అవతరించారు. ఆయన నికర సంపద ప్రస్తుతం 105 బిలియన్ డాలర్లను దాటింది. కొన్నేళ్లుగా జాంగ్ సంపద అనూహ్యంగా పెరుగుతూ వస్తోంది. 2019 మార్చిలో కేవలం 13 బిలియన్ డాలర్లుగా ఉన్న ఆయన ఆస్తి విలువ, ఇప్పుడు ఏకంగా ఎనిమిది రెట్లకుపైగా వృద్ధి చెందడం గమనార్హం. డౌబావో చాట్‌బాట్, సీడ్యాన్స్ వీడియో జనరేషన్ టూల్ వంటి ఎఐ ఉత్పత్తుల విజయంతో కంపెనీ విలువ భారీగా పెరిగింది. ఈ నెలలోనే బ్లాక్‌రాక్, ఫిడెలిటీ వంటి అంతర్జాతీయ ఇన్వెస్ట్‌మెంట్ సంస్థలు బైట్‌డ్యాన్స్ వాల్యుయేషన్‌ను సవరించడంతో జాంగ్ సంపద మరో 12 బిలియన్ డాలర్ల మేర పెరిగింది. మరోవైపు గౌతమ్ అదానీ సంపద ఈ యేడాది జూన్‌లో దాదాపు 120 బిలియన్ డాలర్ల గరిష్ఠ స్థాయికి చేరినప్పటికీ ఇటీవలి కాలంలో కొంతమేర క్షీణించింది.

ఎంఎస్‌సీఐ ఇండెక్స్‌లో స్టాక్ రీబ్యాలెన్సింగ్, పెరుగుతున్న ముడిచమురు ధరలు, బాండ్ యీల్డుల వంటి అంతర్జాతీయ మార్కెట్ ఒత్తిళ్లు ఆయన సంపద తగ్గడానికి కారణమయ్యాయి. ఈ పరిణామం ఆసియాలో సంపద సృష్టి స్వరూపాన్ని మారుస్తోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇంధనం, మౌలిక సదుపాయాల వంటి సంప్రదాయ రంగాలను టెక్నాలజీ, ఎఐ ఆధారిత కంపెనీలు అధిగమిస్తున్నాయనడానికి ఇది నిదర్శనమని వారు పేర్కొంటున్నారు.

# లిస్టయిన కొత్త కంపెనీల ర్యాలీ
## ఇష్యూ ధరకు ప్రీమియంతో ట్రేడింగ్



**ముంబయి, సెప్టెంబరు 16:** స్టాక్ మార్కెట్‌లో కొత్తగా లిస్టయిన కంపెనీలు అనూహ్యంగా రాబడులు సాధిస్తున్నాయి. ఐపిఒల్లో ప్రకటించిన ఇష్యూధరకంటే ప్రీమియం ధరలకు ట్రేడ్ అవుతుండటంతో కంపెనీలకు లాభాలు దౌడుతీస్తున్నాయి. కనోహార్ ఎలక్ట్రికల్స్ షేర్లు ఇష్యూ ధరతో పోలిస్తే 18.88 శాతం ప్రీమియంతో ముగిశాయి. బిఎస్ఇలో షేరు రూ.751.30 వద్ద ముగిసింది. కంపెనీ ఐపిఒ ఇష్యూ ధర రూ.632గా ఉంది. బిఎస్ఇలో షేరు రూ.672.05 వద్ద ప్రారంభమైంది. ఇది ఇష్యూధరపై 6.34 శాతం ప్రీమియం. ట్రేడింగ్ సమయంలో గరిష్ఠంగా రూ.786.95, కనిష్ఠంగా రూ.672.05 నమోదైంది. బిఎస్ఇలో కంపెనీకి చెందిన 23.80 లక్షలకు పైగా షేర్లు చేతులు మారాయి. గ్లాస్ వాల్ సిస్టమ్స్‌కు 18.32 ప్రీమియంగ్లాస్ వాల్ సిస్టమ్స్ షేర్లు కూడా లిస్టింగ్ రోజున మంచి లాభాలను నమోదు చేశాయి. బిఎస్ఇలో షేరు రూ.215.35 వద్ద ముగిసింది. ఇది ఇష్యూ ధర రూ.182తో పోలిస్తే 18.32 శాతం ప్రీమియంతో కొనసాగింది. షేరు బిఎస్ఇలో రూ.190.10 వద్ద లిస్టైంది. ఇష్యూ ధరపై ఇది 4.45 శాతం ప్రీమియం. ట్రేడింగ్‌లో గరిష్ఠంగా రూ.228.10, కనిష్ఠంగా రూ.185.05 నమోదయ్యాయి. బిఎస్ఇలో 45.11 లక్షలకు పైగా షేర్లు ట్రేడ్ అయ్యాయి. ప్రాసోల్ కెమికల్స్ షేరు 0.58 డిస్కౌంట్‌తో ముగింపు ప్రాసోల్ కెమికల్స్ షేర్లు మాత్రం ఇష్యూ ధర కంటే స్వల్ప డిస్కౌంట్‌తో ముగిశాయి. బిఎస్ఇలో షేరు రూ.672.05 వద్ద ముగిసింది. కంపెనీ ఇష్యూ ధర రూ.676 కాగా, ముగింపు ధర 0.58 శాతం తక్కువగా ఉంది. లిస్టింగ్ సమయంలో షేరు రూ.611 వద్ద ప్రారంభమైంది. ఇది ఇష్యూ ధరపై 9.62 శాతం డిస్కౌంట్. ట్రేడింగ్‌లో గరిష్ఠంగా రూ.672.05, కనిష్ఠంగా రూ.600.50 నమోదయ్యాయి.

# హీరోమోటార్స్‌కు అనూహ్య స్పందన




**న్యూఢిల్లీ, సెప్టెంబరు 16:** ఈవారంలో మొత్తం 11 కంపెనీలు ఐపిఒలకు వస్తున్నాయని ముందే సెబీ ప్రకటించింది. అనుకున్నట్లుగానే ఈ వారం మార్కెట్‌లోకి వచ్చిన ఐపిఒలన్నింటికంటే హీరోమోటార్స్‌కు మంచి స్పందన లభించింది. స్టాక్ ఎక్స్ఛేంజీల వద్ద అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం, ఇతర కంపెనీల ఐపిఒలకు ఇన్వెస్టర్ల నుంచి మంచి స్పందన లభించింది. ఐపిలన్నింటిలోను రూ.1000 కోట్ల నిధుల సమీకరణకు వచ్చిన హీరోమోటార్స్ ఐపిఒలో ఆఫర్ చేసిన 8,86,07,596 షేర్లకు గాను 12,26,40,042 షేర్లకు బిడ్లు వచ్చాయి. దీంతో ఈ ఇష్యూ 1.38 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. ఈ ఐపిఒ 16న బిడ్డింగ్‌కు ప్రారంభమై, 18న ముగియనుంది. ఒక్కో షేరు ధరల శ్రేణిని రూ.130 నుంచి రూ.140గా నిర్ణయించారు. ఇన్వెస్టర్లు కనీసం 107 ఈక్విటీ షేర్లకు, ఆ తర్వాత అదే గుణిజాల్లో బిడ్లు వేయవచ్చు. మణికా ప్లాస్టెక్ ఐపిఒకు భారీ స్పందన లభించింది. ఆఫర్‌లో ఉన్న 2,13,86,919 షేర్లకు వ్యతిరేకంగా 60,14,82,852 షేర్లకు బిడ్లు నమోదయ్యాయి. దీంతో ఇష్యూ 28.12 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. ఈ ఇష్యూ 11న ప్రారంభమై, 16న ముగిసింది. ఐపిఒ ధరల శ్రేణిని ఒక్కో షేరుకు రూ.40-రూ.43గా నిర్ణయించారు. కనీసం 348 ఈక్విటీ షేర్లకు, ఆ తర్వాత వాటి గుణిజాల్లో బిడ్లు వేయవచ్చు. జిందాల్ సుప్రీమ్ (ఇండియా) ఐపీలో ఆఫర్ చేసిన 93,99,600 షేర్లకు గాను 7,07,73,346 షేర్లకు బిడ్లు వచ్చాయి. దీంతో ఇష్యూ 7.53 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. ఈ ఐపిఒ 16న ప్రారంభమై 18న ముగియనుంది. ఒక్కో షేరు ధరల శ్రేణి రూ.130-రూ.140గా ఉంది. కనీసం 107 ఈక్విటీ షేర్లకు బిడ్ వేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత 107 షేర్ల గుణిజాల్లో బిడ్లు వేయవచ్చు. ఎస్ఎస్ రిటైల్ ఐపిఒకు ఆఫర్ చేసిన 87,93,884 షేర్లకు గాను 1,26,74,480 షేర్లకు బిడ్లు వచ్చాయి. దీంతో ఈ ఇష్యూ 1.44 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. ఈ ఇష్యూ 16న బిడ్డింగ్‌కు ప్రారంభమై 18న ముగియనుంది. ఒక్కో షేరు ధరల శ్రేణిని రూ.130-రూ.140గా నిర్ణయించారు.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.



# చిట్లిన జుట్టు !

వాతావరణ కాలుష్యం మన కురులపై చూపే దుష్ప్రభావమెంతో ! దానితోడు రసాయనాలు ఎక్కువ. ఉండే షాంపూలను వాడితే జుట్టు మరింత పాడవుతుంది. మరేం చేద్దామంటారా? తలస్నానానికి ముందు ఈ చికిత్సలు ప్రయత్నిస్తే సరి. కప్పు నీటిలో కొన్ని వేపాకు లు, 10-15 తులసి ఆకులు వేసి మరిగించాలి. గోరువెచ్చగా అయ్యాక నీటిని వడకట్టి పక్కన ఉంచాలి. ఆకులను మిక్సీ పట్టి, ఆ మిశ్రమంతో పాటు 3 స్పూన్ల కలబంద గుజ్జును ఆ నీటికి కలపాలి. ఆపై మాడు నుంచి కురుల వరకు దీన్ని పట్టించి, పావుగంట య్యాక తలస్నానం చేస్తే సరి.ఇది తలపై ఇన్‌ఫెక్షన్లను తగ్గించడంతోపాటు కురులు చిట్లడాన్నీ నివారిస్తాయి. శీకాయ, ఉసిరి ప్యాక్ కూడా కురులకు దివ్యౌషధం. అయితే దీని తయారీకి రెండు రోజులు కేటాయించాలి మరి. ఒక ఇసుప కడాయి తీసుకొని సమపాళ్లలో రెండు పొడులనూ తీసుకొని నీటిలో నానబెట్టాలి. రెండోరోజు మాడు, కురులకు పట్టించి, మృదువుగా రుద్దాలి. పావుగంట అయ్యాక గోరువెచ్చని నీటితో తలస్నానం చేసి చూడండి.మెరిసే కురులు సొంతమవుతాయి.ఇవి చుండ్రునీ నివారిస్తాయి. ముల్తానీ మట్టి మోముకి చేసే మేలెంతో మనకు తెలుసు. మాడునీ ఆరోగ్యంగా ఉంచుతుందని తెలుసా? రెండు స్పూన్ల ముల్తానీ మట్టికి మజ్జిగను కలిపి మెత్తని మిశ్రమంలా చేసుకోవాలి. అయిదు నిమిషాలు పక్కన పెట్టి, తర్వాత తలకు రాసుకోవాలి. ఆరాక చల్లని నీటితో తలస్నానం చేయాలి. జుట్టు బరకగా, పొడిబారుతున్నట్లు కనిపిస్తోంటే దీన్ని ప్రయత్నించండి. వాటికి తేమను అందించి మృదువుగా చేయడమే కాదు.. చెమట కారణంగా ఏర్పడే దురద, దద్దుర్లనూ తగ్గిస్తుంది.

# మోము మిలమిల !



ఎక్కడ చూడూ జ్వరాలే! రోగనిరోధకశక్తి పెరుగుతుందనో, ప్లేట్‌లెట్స్ సంఖ్య పెరగాలనో బొప్పాయి తినేవారి సంఖ్యా ఎక్కువే కదూ! మరి వాటి గింజలనేం చేస్తున్నారు? పడేస్తున్నారా! వద్దండీ బాబూ.. వాటితో అందాన్ని పెంచుకోవచ్చు. ఎలాగంటే..

✦.బొప్పాయి గింజ లను మెత్తగా మిక్సీ పట్టాలి. దానికి కాస్త తేనె చేర్చి, కడిగిన ముఖానికి పట్టించి అయిదు నిమిషాలు వదిలేయాలి. ఆపై చేతిని తడి చేసుకుంటూ మరో అయిదు నిమి షాలు మృదు వుగా రుద్ది, గోరువెచ్చని నీటితో కడిగేయాలి. ఇది మంచి స్క్రబ్‌లా పనిచేస్తుంది.

✦ బొప్పాయి గిజంల్ని బాగా ఎండబెట్టాలి. తరవాత మెత్తగా చేసుకుని పొడిగా, శుభ్రంగా ఉండే సీసాలో భద్రపరచుకోవాలి. అవసరమైనప్పుడు స్పూను పొడికి తగినంత తేనె, పాలు కలిపి పేస్‌ప్యాక్‌లా చేసుకుంటే సరి మెరిసే మోము మీ సొంతం.

✦ స్పూను బొప్పాయి గింజల పొడికి అరచెంచా చొప్పున బొప్పాయి గుజ్జు, పెరుగు, తగినన్ని నీళ్ల కలిపి, ముఖానికి పట్టించండి. ఈ ప్యాక్ ముడతలను దరిచేరనీయదు.

✦ ఈ గింజల్లో యాంటీ ఆక్సిడెంట్లు, ఎ,సి,ఇ విటమిన్లు వృద్ధాప్య ఛాయల్ని దరిచేరనీయవు. ఆల్ఫా హైడ్రాక్సీ యాసిడ్స్ చర్మకణాల ఆరోగ్యాన్ని కాపాడతాయి. దీనిలోని పపైన్ అనే ఎంజైమ్, మినరల్స్ ఇన్‌ఫ్లమేషన్‌ని తగించ డమే కాదు. ఆక్సిడేటివ్ స్ట్రెస్ నుంచీ చర్మాన్ని కాపాడతాయి. అయితే ఎంత సహజసిద్ధమైనవైనా ప్యాచ్ టెస్ట్ చేసుకోవడం మాత్రం తప్పని సరి.

# పొదుపు ప్రణాళిక ఇలా!

నెలనెలా కొంత పొదుపు చేయాలి... అనుకోవడం వరకూ సరే! పొదుపు చేయాలనే ఉంటుంది కానీ చేద్దాంలే అని ఆలోచించడంలోనే సమయం మించిపోతుంది. ఖాతా ఖాళీ అవుతుంది. కాబట్టి, రికరింగ్, సిప్, చిట్... ఇలా ఏదైనా పెట్టుకోండి. ఆటోమెటిగ్గా డబ్బులు కట్ అయ్యేలా చూసుకోండి. జీతం పడినరోజే కట్ అయ్యేలా పెట్టుకుంటే మరీ మంచిది. నెలకి ఎంత ఖర్చు పెడుతున్నారు? దేనికి ఎక్కువ మొత్తం వెచ్చిస్తున్నారు? వీటిని గమనించుకోవాలి. అప్పుడే అనవసర ఖర్చు ఎక్కడవుతుందో తెలుస్తుంది. చదవాలి, ఆన్‌లైన్ వ్యాయామం, గేమ్స్ అంటూ బోలెడు యాప్ డబ్బులు కట్టి, సబ్‌స్రైబ్ చేస్తాం. కానీ, ఉపయోగించడం. అలాంటివి రివ్యూ చేసుకోవచ్చు. అనవసరమనిపిస్తే ఆపొచ్చు. అంటే అవసరమైన వరకే ఉపయోగించే వీలన్నమాట. డిజిటల్ స్టేట్ మెంట్‌లు వచ్చాక బడ్జెట్ వేయడమే మర్చిపోతున్నాం. అవసరమైతే యూపీఐ బ్యాంకు ఖాతా తెరిచి చూస్తాం. అలా కాకుండా... స్వయంగా రాయండి. వ్యక్తిగత ఖర్చులు, సేవింగ్స్, ముఖ్యమైనవి విభజించి రాయాలి. దానికి కట్టుబడి ఉండాలి. తెలివిగా ఖర్చు పెట్టడం అలవాటు అవుతుంది. తక్కువలో వ్యాపకాలు, పర్యటనలు ఎంటర్టైన్మెంట్ వగైరాకి డబ్బు కేటాయించు కోవడమూ తెలుస్తుంది. పెళ్లి, ఆసుపత్రి, బంధువులకు పెట్టుబడులు.. ఇలా అనుకోని ఖర్చులు చాలానే వస్తుం టాయి. కాబట్టి, ఎమర్జెన్సీ ఫండ్స్ సిద్ధం చేసుకోవాలి. 'రేపు' ఎలాంటి పరిస్థితులైనా ఎదుర వ్వొచ్చు. కాబట్టి, సిద్ధంగా ఉండాల్సిందే. అలాగని సంతోషాలను త్యాగం చేయనక్కర్లేదు. ఆనం దాల్నీ, భవిష్యత్తునీ సమన్వయం చేసుకోవాలి. అందుకు ఈ అలవాట్లు సాయపడతాయి. చేసుకుంటారుగా మరి?

# వ్యథ



ఎన్.బి.సుధాకర్‌రెడ్డి
సైకాలజిస్టు

## సన్నగా ఉంటే సమస్యలు వస్తాయా ?

ప్రశ్న: నా వయస్సు 22 ఏళ్లు. ఎత్తు 5 అడుగుల 6 అంగుళాలు. బరువు 40 కిలోలు. నేను ఎంబీఏ రెండవ సంవత్సరం చదువుతున్నాను. నాకు థైరాయిడ్, ఇతర హార్మోన్ సమస్యలు లేవు. రెండు నెలల క్రితం వ్యక్తిగత సమస్య కారణంగా తీవ్రమైన భయం, ఆందోళనకు గురయ్యాను. డాక్టర్ ఇచ్చిన మందులు వాడడంతో ప్రస్తుతం తగ్గింది. నేను సన్నగా ఉండటంతో కొందరు భవిష్యత్తులో హార్మోన్ సమస్యలు వస్తా యని, మరికొందరు నాకు అనోరెక్సియా నర్వోసా ఉందని, పెళ్లి తర్వాత పిల్లలు పుట్టరని భయపెడుతున్నారు. బరువు తక్కువగా ఉంటే ఇన్ని సమస్యలు వస్తాయా? - కవిత (పేరు మార్చాం) చిత్తూరు

జవాబు: మీ ఎత్తుకు, వయస్సుకు సంబంధించి మీ బరువు సాధారణ స్థాయి కంటే గణనీయంగా తక్కువగా ఉంది. మీ బాడీ మాస్ ఇండెక్స్ (బిఎంఐ) సుమారు 14.2గా ఉంది. పెద్దల్లో సాధారణ బిఎంఐ సాధారణంగా 18.5 నుంచి 24.9 మధ్య ఉంటుంది. కాబట్టి మీ బరువు తక్కువగా ఉండటానికి కారణాన్ని ఒకసారి వైద్యపరంగా పరిశీలించుకోవడం మంచిది. అయితే సన్నగా ఉండటం ఒక్కటే ఒక వ్యాధికి సంకేతం కాదు. కొందరు సహజంగానే సన్నగా ఉంటారు. కుటుంబ లక్షణాలు, ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ, జీవనశైలి, ఒత్తిడి, ఆందోళన తదితర అంశాలు కూడా బరువుపై



ప్రభావం చూపుతాయి.మీరు ఇటీవల తీవ్రమైన భయం, ఆందోళ నకు గురయ్యారని, చికిత్సతో ప్రస్తుతం తగ్గిందని చెప్పారు. ఇది మంచి పరిణామం. "కేవలం బరువు తక్కువగా ఉందని అనోరెక్సియా నర్వోసా ఉందని చెప్పడం సరైంది కాదు. బరువు పెరుగుతామనే తీవ్రమైన భయం, కావాలనే ఆహారాన్ని పరిమితం చేయడం, బరువు తక్కువగా ఉన్నప్పటికీ తాము లావుగా ఉన్నామని భావించడం, శరీరాకృతిపై అసాధారణమైన ఆందోళన వంటి లక్షణాలను కూడా వైద్యులు పరిశీలిస్తారు.అలాగే "పెళ్లి తర్వాత పిల్లలు పుట్టరు" అని భయపెట్టడం కూడా సరైనది కాదు. బరువు తక్కువగా ఉండటం ఒక్కటే భవిష్యత్తులో సంతానలేమికి కారణమవుతుందని చెప్పలేం. అయితే చాలా తక్కువ బరువు ఎక్కువకాలం కొనసాగితే శరీరానికి అవసరమైన పోషకాలు అందకపోవడం వల్ల బలహీనత, రక్త హీనత, ఎముకల ఆరోగ్యం దెబ్బతినడం వంటి సమస్యలు రావచ్చు. మహిళల్లో నెలసరి క్రమం తప్పడం లేదా కొంతకాలం ఆగిపోవడం, అండోత్పత్తి తగ్గడం వంటి సమస్యలు కూడా రావచ్చు. దీనివల్ల సంతానోత్పత్తి సామర్థ్యం తాత్కాలికంగా ప్రభావితమయ్యే అవకాశం ఉంది. కాబట్టి డాక్టర్ ద్వారా పరీక్షలు చేయించుకొని జాగ్రత్తలు పాటించడం మంచిది. నిపుణుల సలహాతో సమతుల ఆహారం తీసుకుని క్రమంగా బరువుపెరగడం మంచిది. అలాగే మానసిక ఒత్తిడి, ఆందోళన తగ్గించుకోవడం అవసరం.

# పూజలో పుస్తకాలు !



వినాయక శబ్దం లోని 'వి' అనేది విశ్వం, విశిష్టత, విశాలతలకు ప్రతీక. వినాయకుడు నాయకులలో విశిష్టుడు, విశ్వ పూజనీయుడు, 'శుక్లాంబరధరం విష్ణుం' అంటూ గణేశుని విష్ణువుగా భావించి పూజిస్తాం. విష్ణుమూర్తి వలె గణేశుడు వ్యాపన శక్తి కలిగినవాడు. ప్రసన్నత ప్రతిఫలించే గజముఖుణ్ణి 'ప్రసన్న వదన ధ్యాయేత్' అంటూ అర్చిస్తాం. వ్యాసుడు మహాభారతాన్ని వినాయకుడి చేత రాయించదలచుకున్నాడు. అలా చెప్పినప్పుడు 'ఆపకుండా చెబితే రాస్తాను' అంటూ గణేశుడు షరతు పెట్టాడు. బదులుగా వ్యాసమహర్షి అర్థం చేసుకుని రాయాలింటూ ప్రతి షరతు విధించాడు. ఏదైనా వేగంగా సాగాలి అన్నది గణపతి సందేశం. ఏ విషయాన్నైనా అర్థం చేసుకున్న తర్వాతే లిఖించాలి అన్నది మహర్షి ప్రబోధ వినాయకుడు లిఖించిన భారతం పంచమవేదమైంది. తొలి లేఖకుడైన గణపతి పూజలో పుస్తకాలు,కలము ఉంచడం సంప్రదాయమైంది.

# శనగపప్పు పూర్ణం



**కావలసినవి :** శనగపప్పు, మినపగుండ్లు, బెలనం-1, కప్పు చొప్పున, బియ్యం-ఒకటింబావు కప్పు, ఉప్పు-తగినంత, నెయ్యి-చెంచా, యాలకుల పొడి-చిటికెడు,నూనె-వేగడానికి సరిపడా

**తయారీ :** మినపగుండ్లు, బియ్యం, శనగపప్పులను విడివిడిగా నానబెట్టాలి. 4 గంటల తర్వాత ఉప్పు వేసి మెత్తగా గ్రైండ్‌చేసి 2 గంటల తర్వాత ఉప్పు వేసి మెత్తగా గ్రైండ్ చేసి 2 గంటలు పక్కన ఉంచాలి. శనగపప్పును కుక్కర్‌లో 4 విజిల్స్ వచ్చే వరకు ఉడికించి, నీరు వడకట్టాలి. చల్లారాక పప్పు గుత్తితో మెదపాలి లేదా మిక్సీలో బరకగా వచ్చేట్టు గ్రైండ్ చేసుకోవాలి. అదే కుక్కర్‌లో పప్పుతో పాటు బెల్లం వేసి చిన్నమంట మీద కలుపుతూఉడికించాలి. ఇందులో యాలకుల పొడి వేసి, పిండి గట్టి పడుతున్నప్పుడు నెయ్యి వేసి దించాలి. చల్లారాక మనకు కావలసిన సైజులో ఉండలు చుట్టి, తయారు చేసు కున్న పిండిలో ముంచి కాగిన నూనెలో బంగారు రంగు వచ్చే వరకు వేయించాలి.

# 'ది ప్యారడైజ్' థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్:

**: సంపూర్ణేష్ బాబుల**



న్యాచురల్ స్టార్ నాని పాన్ ఇండియా యాక్షన్ ఎంటర్‌టైనర్ "ది ప్యారడైజ్. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో, ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మించారు.

**బిర్యాని క్యారెక్టర్ తో అందరినీ సంప్రైజ్ చేశారు కదా?**

డైరెక్టర్ శ్రీకాంత్ దగ్గర నుంచి కాల్ వచ్చింది. వెళ్లి కలిసాను. అందులో బిర్యాని క్యారెక్టర్ చెప్పిన ప్పుడు నాకు చాలా కొత్తగా అనిపించింది. ఇప్పటి వరకు నేను అలాంటి క్యారెక్టర్ చేయలేదు. చాలా సీరియస్‌గా ఉంటుంది. ఇందులో నానికి బెస్ట్ ఫ్రెండ్ క్యారెక్టర్ చేస్తున్నాను. సినిమా త్రూ అవుట్ నా క్యారెక్టర్ ఉంటుంది.

**మీరు కామెడీ నుంచి ఒక్కసారి ఇలాంటి సీరియస్ రోల్ చేయడం ఎలా అనిపించింది?**

మూడు సంవత్సరాల క్రితం నాకు ఇలాంటి క్యారెక్టర్ వచ్చి ఉంటే నా కెరీర్ లో జరిగిన కొన్నిమిస్టేక్స్ జరిగేవి కావు. నాని అన్న, శ్రీకాంత్‌తో వర్క్ చేయడం చాలా ఆనందాన్ని ఇచ్చింది. నేను ఇంత పెద్ద సినిమా ఎప్పుడు చేయలేదు.

**నానితో వర్క్ చేయడం ఎలా అనిపించింది?**నాని నాకు చాలా కంఫర్ట్ ఇచ్చారు.ఇంతపెద్ద సినిమాలో ఇన్ని రోజులు పనిచేయడం నాకు ఇదే మొదటిసారి.

**ఈ ఆఫర్ రావడం వెనుక సాయి రాజేష్ ఉన్నారు అని విన్నాం?**

అవునండి. నాకు సాయి రాజేష్ ఫోన్ చేసి నీకు శ్రీకాంత్ ఆఫీస్ నుంచి ఫోన్ వస్తుంది చక్కగా మాట్లాడి క్యారెక్టర్ చేయమని చెప్పారు.

**మీరు మోహన్ బాబు బ్యానర్ లో ఒక సినిమా చేశారు.. ఇప్పుడు ఆయనతో కలిసి నటిస్తున్నారు ఎలా అనిపిస్తుంది?**చాలా హ్యాపీ అండి. నేను మోహన్ బాబుతో నటించడానికి చాలా కాలం ఎదురు చూశాను.

**క్యారెక్టర్ చేయడానికి ఫిజికల్‌గా ఎలాంటి ఛాలెంజ్ ఎదుర్కొన్నారు?**

ఈ పాత్ర కోసం బరువు తగ్గమని చెప్పారు. తగ్గాను. అలాగే జట్టు గడ్డం కూడా పెంచాను. డైరెక్టర్ ఏం చెప్తే అది ఫాలో అయ్యాను.

**నిర్మాత సుధాకర్ గురించి ?**

ప్రొడ్యూసర్ చాలా కంఫర్ట్‌గా చూసుకున్నారు. సినిమాని చాలా గ్రాండ్‌గా నిర్మించారు. వరల్డ్ బిల్డింగ్ చాలా అద్భుతంగా వుంటుంది

# తెర

## 'పాటకు ప్రాణం' ఘనంగా ప్రారంభోత్సవం..

హెచ్.టీ సినిమాస్ ఎల్.ఎల్.పి బ్యానర్‌పై హేమల్ తుమ్మపూడి స్వీయ దర్శకత్వంలో తెరకెక్కనున్న తొలి చిత్రం "పాటకు ప్రాణం" హైదరాబాద్‌లోని ప్రసాద్ ఫిల్మ్ ల్యాబ్‌లో ఘనంగా ప్రారంభమైంది. ఈ చిత్ర ప్రాజెక్ట్‌ను చాలా అంకితభావంతో



ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రముఖ దర్శకులు సురేందర్ రెడ్డి, ప్రముఖ హీరో నిఖిల్ ముఖ్య అతిథులుగా హాజరై చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. సంగీత దర్శకుడు శేఖర్ చంద్ర సంగీతం అందిస్తున్నారు. ఈ మ్యూజికల్ ఫిల్మ్‌లో యువ నటులు సుదర్శన్, సాత్విక జంటగా నటిస్తున్నారు. సీనియర్ నటుడు తనికెళ్ల భరణి కీలక పాత్రలో కనిపించ నున్నారు. వీరితో పాటు రాజీవ్ కనకాల, అనితా చౌదరి, రఘు కారుమంచి, బ్రహ్మాజీ తదితరులు ముఖ్య పాత్రల్లో నటిస్తు న్నారు...దర్శకుడు హేమల్ తుమ్మపూడి మాట్లాడుతూ.. ముందుగా మా లాంటి యువ ప్రతిభను ప్రోత్సహించేందుకు ఇక్కడికి విచ్చేసిన మీడియా మిత్రులందరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు. తనికెళ్ల భరణి మాట్లాడుతూ.. ,ఈ సినిమాపై ఎంతో ప్యాషన్ తో, నమ్మకంతో పనిచేస్తున్న ఈ యువ దర్శకుడి కాన్ఫిడెన్స్ మీకు కూడా కనిపిస్తుందని అనుకుంటున్నాను. ఆయన ఎన్నారై అయిన ప్పటికీ, సినిమా చేయాలనే తపనతో ఈ తెరకెక్కిస్తున్నారు. హీరో సుధర్శన్ వంగల మాట్లాడుతూ.. ,మా కార్యక్రమానికి విచ్చేసి మమ్మల్ని ఆశీర్వదించిన మీడియా మిత్రులందరికీ, ముఖ్య అతిథులుగా వచ్చిన నిఖిల్‌కి, సురేందర్ రెడ్డిరికి నా హృదయపూర్వక ధన్యవాదాలు. ..హీరోయిన్ సాత్విక మాట్లాడుతూ.. ,మా సినిమాకు మద్దతుగా వచ్చి ప్రోత్సహిస్తున్న మీడియా మిత్రులందరికీ, ప్రతి ఒక్కరికీ నా హృదయ పూర్వక ధన్యవాదాలు..రాజీవ్ కనకాల మాట్లాడుతూ.. ,భరణి ఈ సినిమా చాలా చక్కగా వివరించారు. జెన్‌జెడ్ ప్రేక్షకుల కోసం ఇలాంటి సినిమా తీసుకొస్తున్న దర్శకుడు హేమల్‌కు ముందుగా అభినందనలు.

## 'ఏ నిమిషానికి ఏమి జరుగునో' నుంచి 'ఏదో బాగుందే..' పాట విడుదల



రాజు వెడ్స్ రాంబాయ్ చిత్రంతో హీరోగా గుర్తింపు తెచ్చుకున్న అఖిల్ రాజ్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం'ఏ నిమిషానికి ఏమి జరుగునో'. ఒక విభిన్నమైన సస్పెన్స్ థ్రిల్లర్ రూపొందిస్తున్న ఈ సినిమాలో రతిక హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ చిత్రానికి సాయితేజ దర్శకుడు. లక్కీ మీడియా, కేడీ అండ్ కో బ్యానర్స్ పై బెక్కెం వేణు గోపాల్, దీవెల శ్రీనివాసరావు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం నిర్మాణనంతర పనులు జరుపుకుంటోన్న ఈ చిత్రం అక్టోబర్ 2న ప్రేక్షకుల ముందుకు రానుంది. కాగా ఈ చిత్రం నుంచి కృష్ణకాంత్ రచించిన ఏదో బాగుందే అనే లిరికల్ వీడియోను ప్రముఖ యువ కథానాయకుడు శ్రీవిష్ణు విడుదల చేశారు. ఈ సందర్భంగా శ్రీ విష్ణు మాట్లాడుతూ సాంగ్ చాలా ఫ్రెష్‌గా ఉంది.. విజువల్స్ బాగున్నాయి. సాంగ్ అందరికి నచ్చుతుంది. సంగీత దర్శకుడు శశాంక్ మంచి ట్యూన్ అందించాడు. ఈ సినిమా టైటిల్‌తో సహా అన్ని ఫ్రెష్‌గా ఉన్నాయి. టైమ్ లూప్ థ్రిల్లర్‌గా ఈ సినిమాను రూపొందించారని తెలిసింది. ఇలాంటి సినిమాలు చాలా అరుదుగా వస్తుంటాయి. తప్పకుండా ఈ సినిమా విజయం సాధించి ఈ సినిమాకు పనిచేసిన అందరికి మంచి పేరు తీసుకరావాలని కోరుకుంటున్నాను అన్నారు.అఖిల్ రాజ్, రతిక, షైనింగ్ ఫణి, రాజేష్ ఉల్లి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి మ్యూజిక్: శశాంక్ తిరుపతి, కో ప్రొడ్యూసర్: ఠాగూర్, నితీష్, నిఖిల్, డీవోపీ: రవికిరణ్ బోయడపు, నిర్మాతలు: బెక్కెం వేణుగోపాల్, దీవెల శ్రీనివాసరావు, రచన దర్శకత్వం: సాయితేజ.

## 'కాగితం పడవలు' 18న రిలీజ్



వర్ధన్, కృష్ణప్రియ హీరో హీరోయిన్లుగా ఎంజీఆర్ తుకారాం దర్శకత్వంలో తెరకెక్కుతున్న రా అండ్ రస్టిక్ లవ్‌స్టోరీ 'కాగితం పడవలు'. ఎస్ఎల్ఎన్ సినీ క్రియేషన్స్, ప్రణధి క్రియేషన్స్, నవ నారాయణ సినీ క్రియేషన్స్ బ్యానర్లపై కీర్తన నరేష్, టి.ఆర్. ప్రసాద్ రెడ్డి, వెంకట్రాజుల, గాయత్రమ్మ అంజనప్ప నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, టీజర్, ట్రైలర్‌కు అద్భుతమైన స్పందన వచ్చింది. సెప్టెంబర్ 18న ఈ చిత్రం ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్ ద్వారా గ్రాండ్‌గా ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రీరిలీజ్ ఈవెంట్‌లో మాస్ కా దాస్ విశ్వక్ సేన్ మాట్లాడుతూ.. నేను ఈ వేడుకకు రావడానికి కారణం డైరెక్టర్ తుకారాం. ఫలక్‌నుమా దాస్ అసిస్టెంట్ డైరెక్టర్స్ కావాలని కాస్టింగ్ కాల్ పెట్టాను. అప్పుడు వచ్చిన డైరెక్టర్ తుకారాం. తనకి ఇష్టమైన సినిమా "ఒసేయ్ రాములమ్మ అని చెప్పాడు. నిజంగా అలాంటి ఆన్సర్ నేను ఎవరి దగ్గర వినలేదు. తర్వాత కొంతకాలం పని చేశాక తను సొంతగా డైరెక్టర్ చేసుకోవాలని ప్రయత్నాలు మొదలు పెట్టాడని నాకు అర్థమై, తన ప్రయత్నాలు చేసు కోమని పంపించాను. హీరో వర్ధన్ మాట్లాడుతూ.. విశ్వక్ అన్న ఈ వేడుకకు రావడం చాలా ఆనందంగా ఉంది. ఈ సినిమాకి ఎన్నోసార్లు ఎన్నో అడ్డంకులు వచ్చాయి. అడ్డంకులన్నిటినీ ప్రొడ్యూసర్లు అధిగమిం చారు. ఈరోజు ఎక్కడ వరకు వచ్చి ఈ వేడుక చేస్తున్నామంటే, దీనికి ప్రధాన కారణం మా నిర్మాతలు. ప్రొడ్యూసర్ కీర్తన మాట్లాడుతూ.. సెప్టెంబర్ 18న సినిమా ఆడియన్స్ ముందుకు వస్తుంది. అందరికీ నచ్చుతుంది. తప్పకుండా చూస్తారని భావిస్తున్నాను. విశ్వక్ రావడం చాలా ఆనందంగా ఉంది. డైరెక్టర్ తుకారాం మాట్లాడుతూ.. విశ్వక్ అన్న నమ్మిన వారి వెంట నిలబడతారు. నానాజీ మాట్లాడుతూ.. విశ్వక్ సేన్ తో పాగల్, గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి సినిమాలు చేశానా. రెండిట్లో ఆయన నన్ను చితక్కొట్టారు. ఆయన ఈ వేడుకకు రావడం చాలా ఆనందంగా ఉంది. వేదవ్యాస్ మాట్లాడుతూ.. మా సినిమాని సపోర్ట్ చేయడానికి వచ్చిన విశ్వక్ అన్నకి థాంక్యూ. మాకు ఈ అవకాశం ఇచ్చిన "డైరెక్టర్ కి, నిర్మాతలకు ధన్యవాదాలు.

## 'బా బా బ్లాక్ షీప్' అక్టోబర్ 9న రిలీజ్



అన్ని వర్గాల ప్రేక్షకులను మెప్పించేలా డిఫరెంట్ కాన్సెప్ట్‌తో రూపొందుతోన్న న్యూ ఏజ్ క్రైమ్ కామెడీ 'బా బా బ్లాక్ షీప్'.దోనేపూడి చక్రపాణి సమర్పణలో చిత్రాలయం స్టూడియో పై వేణు దోనేపూడి నిర్మిస్తున్న ఈ మూవీకి గుణి మంచికంటి దర్శకత్వం వహిస్తున్నారు. అక్టోబర్ 9న సినిమా రిలీజ్ అవుతుంది. టిను ఆనంద్, ఉపేంద్ర, జార్జ్ మరియన్, అక్షయ్ , విష్ణు, కార్తికేయ, విస్మయశ్రీ, మాళ్వీ మల్హోత్రా, కశ్యప్, రాజారవీంద్ర తదితరులు ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. మేఘా లయా రాష్ట్రంలో పూర్తిగా చిత్రీకరణను జరుపుకున్న తొలి దక్షిణాది సినిమా ఇదే కావటం విశేషం. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా టీజర్, రీసెంట్‌గా రిలీజైన "ఆజా మేరీ జాన్ని సాంగ్‌కు అమేజింగ్ రెస్పాన్స్ వచ్చింది. ఈ నేపథ్యంలో మేకర్స్ ఈ సినిమా నుంచి సెకండ్ సాంగ్ 'వెవెలా ఊహలే చూపినా..'నురిలీజ్ చేశారు. హిట్ మెషిన్ అనిల్ రావిపూడి ఈ పాటను విడుదల చేసి చిత్ర యూనిట్‌కు అభినందనలు తెలిపారు. వెవెలా ఊహలే చూపినా.. సాంగ్ నేపథ్యం విషయానికి వస్తే..తమకు కావాల్సిన ఓ అరుదైన బాక్స్ కోసం విలన్ గ్యాంగ్ వెతుకుతుంటుంది. అది హీరో, హీరోయిన్ దగ్గర ఉందని వారు భావిస్తుం టారు. అదే సమయంలో వాళ్ల విలన్స్ కంటపడతారు. మరోవైపు హీరో చేతిలో గన్ ఉంటుంది..అది ఊహించని రీతిలో పేలుతుంది. ఎలక్ట్రానిక్ కిలి, ఆర్కాడో సంగీత సారథ్యంలో ఈ సాంగ్‌ను కిట్టు విస్సాప్రగడ రాయగా..శ్రీ సాగర్ పాడారు. పాటను మళ్లీ మళ్లీ వినాలనిపించేలా డిఫరెంట్ బ్యాక్ డ్రాప్, మ్యూజిక్‌తో ఆసాంతం ఆకట్టుకుం టోంది. ఈ సందర్భంగా..చిత్ర నిర్మాత వేణు దోనేపూడి మాట్లాడుతూ ఇప్పటి వరకు రిలీజైన మా బా బా బ్లాక్ షీప్ మూవీ టీజర్, అజా మేరీ జాని సాంగ్‌కు సూపర్బ్ రెస్పాన్స్ వచ్చింది. ఇప్పుడు

## 'ఆస్మాన్' టీజర్ విడుదల..



శ్రీమతి. కొండారు శ్రీనివాసరావు సమర్పణలో శ్రీ క్లీంకార సెల్యూలాయిడ్ బ్యానర్ మీద మేఘాంశ్ శ్రీహరి హీరోగా రామ్ నందన్ తెరకెక్కిస్తున్న చిత్రం ఆస్మాన్ ఈ సినిమాని వెంకటేష్ కొండారు, శ్రీకాంత్ మన్నెం నిర్మిస్తున్నారు. శ్రీహరి జయంతి సందర్భంగా రిలీజ్ చేసిన మూవీ ఫస్ట్ లుక్, మోషన్ పోస్టర్‌కి మంచి స్పందన వచ్చింది. తాజాగా మేఘాంశ్ శ్రీహరి పుట్టిన రోజు సందర్భంగా బుధవారం నాడు టీజర్‌ను విడుదల చేశారు. మీరు ఇప్పుడు గొంగలి పురుగు దశలో ఉన్నారు.. అది దాటి సీతాకోక చిలుక దశలోకి మారాలి.. దానికి మార్గం నేనే.. మీరందరూ కూడా కనిపించే చీకట్లో ఉన్నారు.. అదే నిజం అంటూ అద్భుతమైన డైలాగ్స్, హీరో వాయిస్ ఓవర్‌తో ఉన్న ఈ టీజర్ ఆద్యంతం ఉత్కంఠ భరితంగా సాగింది. ఇక ఈ టీజర్‌లోని విజువల్స్, యాక్షన్ సీక్వెన్స్, ఎమోషన్స్ అన్నీ కూడా ప్రేక్షకుల్ని కట్టి పడేసేలా ఉన్నాయి. అన్ని వర్గాల ఆడియెన్స్‌ని ఆకట్టుకునేలా కట్ చేసిన ఈ టీజర్‌లో హీరో మేఘాంశ్ శ్రీహరి సరికొత్తగా కనిపించారు.ప్రశాంత్ ఆర్ విహారి మ్యూజిక్, షోయబ్ కెమెరా వర్క్ ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. ఇక ఈ మూవీని తెలుగు, తమిళ, మలయాళం, కన్నడ, అరబిక్ భాషల్లో విడుదల చేయనున్నారు.

17-9Pg8exHMNWJQE:17-9Pg8exHMNWJQE.qxd 9/17/2026 12:32 AM Page 1



# ధరలకు కళ్లెంతోనే ద్రవ్యోల్బణం కట్టడి

- మార్కెట్ ఇంటర్వెన్షన్‌తో ధరల నియంత్రణ
- హైరిస్క్ ఉద్యాన పంటల రక్షణకు రూ.190 కోట్లు
- వ్యవసాయం, అనుబంధ శాఖల సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు



**విజయవాడ, సెప్టెంబరు 16 ప్రభాతవార్త ప్రతినిధి:** నిత్యావసరాల ధరలు సామాన్యుడికి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, ద్రవ్యోల్బణాన్ని నియంత్రించేందుకు ముందస్తు అంచనాలతో పంటల సాగు, ఉత్పత్తి, మార్కెట్ నిర్వహణపై దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. వ్యవసాయం, అనుబంధ శాఖలపై ముఖ్యమంత్రి బుధవారం క్యాంపు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ద్రవ్యోల్బణం పెరగడానికి గల కారణాలను అంచనా వేయాలని సీఎం సూచించారు. ఉత్పత్తి డిమాండ్ కు తగ్గట్టు ఉందా, సరఫరా పరిస్థితులను.. అనే అంశాలను విశ్లేషించుకుని దానికి అనుగుణంగా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

**ధరల నియంత్రణకు మార్కెట్ ఇంటర్వెన్షన్:** ఎలాంటి చోట్ల, ఏయే పంటలకు మార్కెట్ ఇంటర్వెన్షన్ అవసరమో గుర్తించాలని, ధరలు పెరగకుండా చూడాలని సీఎం స్పష్టం చేశారు. ఈ మేరకు వివిధ పంటలకు కేంద్రం ప్రకటించిన కనీస మద్దతు ధరలను రాష్ట్రంలో అమలు చేయడంతో పాటు, రైతులను ఆయా పంటలు సాగు చేసేలా ప్రోత్సహించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వైపు నుంచి ధరలను నియంత్రణ చేసేలా చూడాలన్నారు. అవసరమైతే రైతుల నుంచి బై బ్యాక్ ఒప్పందాలు చేసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. ఆయిల్ ఫెడ్, మార్క్ ఫెడ్, రైతు బజార్లు, రేషన్ డిపోల వంటి వ్యవస్థలను పూర్తి స్థాయిలో వినియోగించు కోవాలన్నారు. కనీస మద్దతు ధర ప్రకటిస్తే ఉత్పత్తులు ప్రభుత్వం చెంతకే చేరతాయని, తద్వారా ధరల నియంత్రణకు అవకాశం ఉంటుందన్నారు. "ప్రిడిక్షన్ చేశాక.. ప్రొడక్షన్‌కు వెళ్లాలి...ఆ మేరకు మార్కెట్ కూడా అంచనా వేసుకోవాలి." అని సీఎం స్పష్టం చేశారు.

**రైతు బజార్లు, రేషన్ డిపోల ద్వారా సరఫరా:** రైతు బజార్లు, రేషన్ డిపోల ద్వారా దాదాపు 60 రకాల నిత్యావసర సరుకులు సరఫరా చేసేలా చూడాలని సీఎం సూచించారు. ఉల్లి, కంది పప్పు వంటి వాటిని త్వరలో రైతు బజార్లు, రేషన్ డిపోల ద్వారా అందించాలన్నారు. పామాయిల్ ను కూడా రేషన్ డిపోల ద్వారా సరఫరా చేయాలన్నారు. ఉల్లి, మిర్చి వంటి పంటలను ఎప్పుడూ పండించే ప్రాంతాల్లో కాకుండా.. ఇతర ప్రాంతాల్లో కూడా పండించే అంశాన్ని పరిశీలించాలని సీఎం ఆదేశించారు. రైతు సేవా కేంద్రాల వారీగా ఏయే పంటలు పండిస్తున్నారో తెలుసుకోవాలని, ఉల్లి ఎంత అవసరం, ప్రస్తుతం ఎంత అందుబాటులో ఉందో అంచనా వేసుకోవాలని అన్నారు. ధరలు ఏ విధంగా పెరుగుతాయో ముందుగానే అంచనా వేసి, ప్రస్తుత మార్కెట్‌ను నియంత్రణ చేసుకుంటూ అవసరమైన పంటలు వేసేలా చూడాలని సూచించారు. రాయితీ విత్తనాలు, అవసరమైన యంత్ర పరికరాలు ఇచ్చి ఆ పంటలు వేసేలా రైతులను ప్రోత్సహించాలని అన్నారు. రాష్ట్రంలో ఎక్కడా పశుగ్రాసం లేక పాల ఉత్పత్తి తగ్గిందనే మాట రాకూడదన్నారు. పశువుల దాణాకు ఇబ్బంది రాకుండా చూడాలని సీఎం స్పష్టం చేశారు.

**అంచనాల ఆధారంగా పంటల సాగు:** రాష్ట్రంలో పంటల సాగు చేయని 8.61 లక్షల హెక్టార్లలో వర్షాధార పంటలు వేసేలా చూడాలని సీఎం ఆదేశించారు. చిరు ధాన్యాలు, రాగి, కొర్రలు, జొన్న, బాజ్రా వంటి పంటలను సాగు చేయించాలని, మొక్కజొన్న వేసేలా చూడాలని సూచించారు. ఉలవల సాగుపై కూడా దృష్టి పెట్టాలని అన్నారు. నేచరల్ ఫార్మింగ్‌ను ప్రోత్సహించాలన్నారు. ఏయే ప్రాంతాల్లో ఏయే పంటలు వేయవచ్చో గుర్తించి, ఆ మేరకు రైతులతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. రాష్ట్రంలో 3.61 లక్షల హెక్టార్లలో ఉద్యాన పంటలు హైరిస్క్‌లో ఉన్నాయని అధికారులు పేర్కొనగా, హైరిస్క్‌లో ఉన్న ఉద్యాన పంటలను రక్షి ంచేందుకు లైఫ్ సేవింగ్ ఇరిగేషన్ కోసం రూ.190 కోట్ల కేటాయిస్తున్నట్టు సీఎం తెలిపారు. ఈ నిధులను హైరిస్క్‌లో ఉన్న ఉద్యాన పంటలను రక్షి ంచేందుకు అవసరమైన చర్యలకు వినియోగించాలని సూచించారు. ఇందులో భాగంగా వాటర్ ట్యాంకర్లను పంపించడం వంటి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ప్రతి నెలా కేంద్ర ప్రభుత్వానికి తెలియజేయాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టుకు ఐఎస్ఎస్‌సిఎ గ్లోబల్ అవార్డు 2026 రావడంపై అధికారులను సీఎం అభినందించారు. ఈ సమీక్షలో మంత్రులు అచ్చెన్నాయుడు, నిమ్మల రామానాయుడు, నాదెండ్ల



## పాడైన మాంసం.. అపరిశుభ్ర వంటగది

- కుంభకర్ణ రెస్టారెంట్ వంటగది తాత్కాలిక మూసివేత
- ఐపిఎం డైరెక్టర్ అరుణ్‌బాబు స్వయంగా తనిఖీ

**మంగళగిరి, సెప్టెంబరు 16 ప్రభాతవార్త:** ఫ్రీజర్‌లో పాడైన చికెన్, మటన్, తందూరీ చికెన్, కబాబ్‌లు నిల్వ ఉంచడం.. మాంసం, చికెన్ రక్తపు మరకలతో వంటగది అపరిశుభ్రంగా ఉండటం వంటి తీవ్ర లోపాలు బయటపడటంతో మంగళగిరి కాజా టోల్‌ప్లాజా సమీపంలోని కుంభకర్ణ మల్టీ క్యూజీన్ ఫ్యామిలీ రెస్టారెంట్ వంటగదిని అధికారులు తాత్కాలికంగా మూసి వేయించారు ఐపీఎం (ఫుడ్ సేఫ్టీ డిపార్ట్మెంట్) డైరెక్టర్ అరుణ్‌బాబు బుధవారం సాయంత్రం స్వయంగా తనిఖీ చేసి పరిస్థితులను పరిశీలించారు. ఆయనతో పాటు సహాయ ఆహార నియంత్రణ అధికారి ఎన్.పూర్ణచంద్రరావు, ఆహార భద్రత అధికారులు బి.నరసింహుడు, ఎన్.వెంకటేశ్వర్లు తనిఖీలో పాల్గొన్నారు. అనంతరం వంటగది కార్యకలాపాలను తాత్కాలికంగా నిలిపివేస్తూ అధికారులు నోటీసు జారీ చేశారు. ఈ మేరకు అరుణ్ బాబు బుధవారం రాత్రి ఓ ప్రకటన జారీ చేశారు. తనిఖీలో ఫ్రీజర్‌లో పాడైన ముడి బోన్‌లెస్ చికెన్ 500 గ్రాములు, వండిన చికెన్ కూర 500 గ్రాములు, వండిన మటన్ 500 గ్రాములు, తందూరీ చికెన్ 2.5 కిలోలు, చికెన్ తంగ్డీ కబాబ్ 1.5 కిలోలు, ఆటా పిండి 500 గ్రాములు ఉన్నట్లు గుర్తించారు. మొత్తం 6 కిలోల ఆహార పదార్థాలను అక్కడికక్కడే ధ్వంసం చేశారు. తనిఖీలో గడువు ముగిసిన స్కిమ్డ్ మిల్క్ డెయిరీ వైటెనర్ పౌడర్ 3 కిలోలు, కంపౌండెడ్ ఇంగువ పొడి 600 గ్రాములు, పన్నీర్ చీజ్ అనలాగ్ 1 కిలో కూడా గుర్తించారు. సంబంధిత పదార్థాలను స్వాధీనం చేసుకుని తదుపరి పరీక్షలు, పరిశీలనకు చర్యలు చేపట్టారు. ఆహార నాణ్యతను నిర్ధారించేందుకు మొత్తం 13 నమూనాలు సేకరించారు. ఇందులో 3 చట్టపరమైన, 10 పర్యవేక్షణ నమూనాలు ఉన్నాయి. బెల్లం, కారం పొడి, ధనియాలతో పాటు శనగపప్పు, మామిడికాయ ఊరగాయ, కందిపప్పు, మస్టర్డ్ సాస్, స్వీట్ చిల్లీ సాస్, చిల్లీ పొడి, మటన్ మసాలా, పన్నీర్ చీజ్ అనలాగ్, చికెన్ మసాలా తదితర నమూనాలను పరీక్షలకు పంపారు. ఫ్రీజర్‌లో మాంసం, చికెన్ రక్తపు మరకలు, గోడలపై నూనె, పొగ మరకలు, వ్యర్థాలతో మురుగునీటి కాలువలు మూసుకుపోవడం, వంటగదిలో చెత్త పేరుకుపోవడం, ఆహార తయారీలో ఉపయోగించకూడని రంగుల పదార్థాలు, లేబుళ్లు లేని మసాలా పొడులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. లోపాలను వెంటనే సరిచేయాలని, పరిశుభ్రత, ఆహార నిల్వ, వ్యర్థాల తొలగింపు తదితర అంశాల్లో నిబంధనలు పాటించాలని యాజమాన్యాన్ని ఆదేశించారు. లోపాలను సరిచేసినట్లు నివేదిక సమర్పించే వరకు వంటగది కార్యకలాపాలు నిలిపివేయాలని స్పష్టం చేశారు.

## నాంపల్లి కోర్టును ఆశ్రయించిన ఐ బొమ్మ రవి




**హైదరాబాద్, సెప్టెంబరు 16, ప్రభాతవార్త:** టాలీవుడ్, బాలీవుడ్ సినిమాలను విడుదలకు ముందుగా లేదా విడుదలైన మొదటి రోజే పైరసీ చేసి తన వెబ్ సైట్‌లు బప్పం టివి, ఐ బొమ్మలో వుంచిన కేసులో అరెస్టయిన పైరసీ కేటుగాడు ఎన్ఆర్ఐ ఇమ్మంది రవి అలియాస్ ఐ బొమ్మ రవి నాంపల్లి కోర్టును ఆశ్రయించాడు. రెండేళ్లపాటు సినీ రంగాన్ని తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన రవిని గత ఏడాది నవంబర్ నెలలో హైదరా బాద్ పోలీసులు అరెస్టు చేయడం తెలిసిందే. సినీ పైరసీ కేసులో మూడు నెలలకు పైగా జైల్లో వుండి బెయిల్‌పై విడుదలైన రవి పాస్‌పోర్టును కూడా జప్తు చేశారు. ఎపిలోని వైజాగ్‌కు చెందిన రవి భారత పౌరసత్వం వదిలి కరేబియన్ పౌరసత్వం తీసుకోవడంతో అతను ఎన్ఆర్ఐగా మా రాడు. ప్రస్తుతం తనకు తెలిసిన వారి వద్ద వుంటున్న రవికి భార్యతోనూ విబేధాలున్నాయి. అరెస్టు తరువాత అతని బ్యాంకు ఖాతాలను పో లీసులు జప్తు చేయడంతో రోజువారి ఖర్చులకు ఇబ్బందిగా మారిందని రవి నాంపల్లి కోర్టును ఆశ్రయించాడు. పోలీసులు జప్తు చేసిన తన ఖాతా లను వెంటనే నిర్వహణలోకి అనుమతించాలని అతను కోర్టును కోరాడు. దీనిపై విచారణ చేబట్టిన నాంపల్లి కోర్టు కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులను ఆదేశించింది.

## డ్రగ్స్ కేసులో పట్టుబడ్డ నిందితుల రూ.6.55 కోట్ల ఆస్తుల జప్తు

**హైదరాబాద్, సెప్టెంబరు 16, ప్రభాతవార్త:** రాష్ట్రంలో డ్రగ్స్ కేసులో నిందితుల భరతం పడుతున్న ఈగల్ పోలీసులు ఇదే సమయంలో నిందితులు మాద కద్రవ్యాల అమ్మకం వల్ల సంపాదించిన ఆస్తులను వరుసగా జప్తు చేస్తూ పోత ఎన్నారు. వారం రోజుల క్రితం నిజామాబాద్ జిల్లాలో కల్తీ కల్లు తయారీకి వాడే అల్ప్రాజోలం, హైడ్రో క్లోరైడ్ విక్రయాలు జరిపి ఇలా వచ్చిన సొమ్ముతో ఐదుకోట్ల రూపాయలకు పైగా ఆస్తులు సంపాదించిన వారిపై కొరడా ఝుళిపించిన ఈగల్ పోలీసులు వారి ఆస్తులను జప్తు చేయడం తెలిసిందే. తాజాగా బుధవారం సైబరాబాద్ పరిధిలో కొకైన్ సహా పలురకాల డ్రగ్స్ విక్రయాలు జరిపి ఆస్తులు కొన్న ఉగ్వు ఇకెచుక్వు, మహమ్మద్ మతీన్, సయ్యద్ అబ్దుల్ అజీజ్, సయ్యద్ నసీర్, సయ్యద్ యూసుఫ్ హక్, శాంతిలాలన సురేష్ కుమార్ జైన్, ఉత్తంజైన్‌లకు సంబంధించిన ఆరు కోట్ల 55 లక్షల రూపాయల ఆస్తులను ఈగల్ జప్తు చేసింది. ఏడాది క్రితం వీరిని అరెస్టు చేయగా వీరి వద్ద డ్రగ్స్‌తోపాటు ఎనిమిది సెల్‌ఫోన్లు, మూడు లాప్‌టాప్‌లు, రెం డు పెన్ డ్రైవ్‌లు, 45వేల నగదు జప్తుచేశారు. నిందితులపై పలు రకాల సెక్షన్లు నమోదు చేసి జైలుకు తరలించారు. ఈ కేసు లో అక్రమాస్తులను జప్తు చేసేందుకు ఎన్‌సిబి కోర్టు అనుమతి లభించడంతో ఈగల్ అధికారులు వీటిని జప్తు చేశారు. ఎన్‌డిపిఎస్ చట్టంలోని సెక్షన్ 68 (ఎఫ్) కింద వీటిని జప్తు చేసినట్లు ఈగల్ డైరక్టర్ సందీప్ శాండిల్యా బుధవారం మీడియాకు తెలిపారు. రాష్ట్రంలో డ్రగ్స్‌కు సంబంధించి ఎలాంటి సమాచారం వున్నా 1908 లేదా 8712671111కు వెంటనే తెలపాలని ఆయన కోరారు.

## వినాయక నిమజ్జనంలో అపశ్రుతి

### చెరువులో దిగిన ఆరుగురు విద్యార్థులు మృతి

**పటాన్‌చెరు, సెప్టెంబర్ 16, ప్రభాతవార్త:** సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం పెద్దకంజర్ల గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. బుధవారం వినాయక నిమజ్జనానికి వెళ్లి ఆరుగురు విద్యార్థులు మృతి చెందారు. నిమజ్జనం కోసం నేరేడుచెరువులో దిగి విద్యార్థులు మృతి చెందారు. మృతులంతా పెద్ద కంచర్ల చెందిన శిరీష చారిటబుల్ ట్రస్ట్ విద్యార్థులుగా గుర్తించారు. మృతులు నర్సింహా రాజు, సుమంత్ (డిప్లొమా సెకండ్ ఇయర్), గణేష్ (డిప్లొమా సెకండ్ ఇయర్), ఉదయ్ కిరణ్ (డిప్లొమా థర్డ్ ఇయర్), శ్యామ్ కుమార్ (డిప్లొమా ఫస్ట్ ఇయర్), సిద్దార్థ్ (టెన్త్ క్లాస్). విద్యార్థుల మృతి పట్ల పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రాచీన గ్లోబల్ ఆసుపత్రికి వెళ్లి విద్యార్థుల మృతదేహాలకు నివాళి అర్పించారు. గురువారం ఉదయం 10 గంటల లోపు పోస్టుమార్టం పూర్తి చేయాలని, తదనంతరం వారి వారి సొంత స్థలాలకు అంబులెన్స్ లో తరలించాలని అధికారులను ఆదేశించారు. సొంత నిధులతో అంబులెన్స్‌ను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

అదేవిధంగా ప్రాచిన్ ఆస్పత్రికి సైబరాబాద్ డిసిపి శ్రీనివాస్ చేరుకొని ఘటనకు సంబంధించిన వివరాలను సేకరిస్తున్నారు. ఒకేసారి ఆరుగురు విద్యార్థులు చెందడం పట్ల ఆయన తీవ్రంగా కలత చెందారు. శిరీష ట్రస్ట్ శివనగర్ చౌరస్తా పెద్దకంజర్ల. 70 మంది విద్యార్థులు,ఒకటవ తరగతి నుండి పాలిటెక్నిక్, బిటెక్ విద్యార్థులు ఉన్నారు. తల్లిదండ్రులు లేని విద్యార్థులు మాత్రమే ట్రస్టులో చేర్చుకుంటారు. ఆంధ్రకు చెందిన కృష్ణంరాజు అనే వ్యక్తి తన కుమార్తె శిరీష పేరు మీద ట్రస్ట్ నిర్వహిస్తున్నట్లు సమాచా రం. వినాయక నిమజ్జనానికి వెళ్లి ఆరుగురు విద్యార్థులు మృతి చెందడంతో పటాన్ చెరు ప్రాంతంలో తీవ్ర విషాదం నెలకొంది.



# పల్లెల నిండుగ అభివృద్ధి పండగ

- ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దార్శనికత్వంలో మారిన గ్రామీణాంధ్ర రూపురేఖలు
- రెండున్నరేళ్లలో 10 వేల కి.మి బిటి, 9,600 కి.మి. సిసి రోడ్ల నిర్మాణం
- రైతుకు అండగా 1.15 లక్షల పంట కుంటలు
- 2 లక్షల ఎకరాల్లో పండ్ల తోటలు
- రెట్టించిన ఉత్సాహంతో పల్లెపండుగ 3.0కి సిద్ధమైన రూట్ మ్యాప్

**విజయవాడ, సెప్టెంబరు 16 ప్రభాతవార్త ప్రతినిధి:** గ్రామాభివృద్దే రాష్ట్రాభివృద్ధికి, తద్వారా దేశాభివృద్ధికి బలమైన పునాది. పల్లె ప్రగతితో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయి. గ్రామీణ మౌలిక సదుపాయాల విస్తరణతో స్వయం సమృద్ధి సాధ్యపడుతుందన్న ప్రాథమిక సూత్రాలను ప్రణాళికాబద్ధంగా అమలు చేసి దశాబ్దాలుగా సాధ్యం కాని గ్రామీణ ప్రగతిని డీసీఎం పవన్ కల్యాణ్ కేవలం రెండేళ్లలో సాకారం చేశారు పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖల మంత్రిత్వశాఖలు నిర్వహిస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆయన చొరవతో ఏడున్నర దశాబ్దాలుగా రోడ్డు చూడని ఎన్నో మారుమూల గ్రామాలకు తొలిసారి రహదారి సౌకర్యం ఏర్పడింది. నీరు లేక బీళ్లు బారిన భూముల్లో పచ్చదనం చిగురించింది. మూగ జీవాలకు నీడ, నీటి సౌకర్యం ఏర్పడింది. పవన్ కళ్యాణ్ విజన్ పచ్చని పల్లెల్లో అభివృద్ధి పండుగ తీసుకువచ్చింది.

**గ్రామసభల తీర్మానాలతో అభివృద్ధికి అడుగులు:** ఈ అభివృద్ధి మొత్తానికి గ్రామ సభల్లో మొదటి అడుగు పడింది. గ్రామస్తులు కోరుకున్న అభివృద్ధిని పవన్ కళ్యాణ్ వారి ముంగిట నిలిపారు. అందుకోసం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ బాధ్యతలు తీసుకున్న వెంటనే ఏకకాలంలో రాష్ట్రవ్యాప్తంగా 13,326 పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించారు. గ్రామ సభల్లో చేసిన తీర్మానాలను పల్లెపండుగ రూపంలో పనులుగా మలచి పట్టాలెక్కించారు. పల్లెపండుగ, పల్లెపండుగ 2.0 కలిపి రెండు దశల్లో రికార్డు స్థాయిలో 9,600 కిలోమీటర్ల సీసీ రోడ్లు నిర్మించారు. పల్లెల్లో అంతర్గత అనుసంధాన వ్యవస్థను ఈ సీసీ రోడ్లు మెరుగుపర్చాయి. మరో 10,000 కిలోమీటర్ల మేర బీటీ (తారు) రోడ్లు నిర్మిస్తున్నారు. ఇప్పటికే వీటిలో చాలా వరకు పూర్తయ్యాయి. గ్రామాల మధ్య, గ్రామాలు, మండల కేంద్రాల మధ్య అనుసంధాన వ్యవస్థ తారు రోడ్ల నిర్మాణంతో మెరుగుపడింది. ఆంధ్రప్రదేశ్ పల్లెలు రోడ్ల నిర్మాణం పరంగా ఎన్నడూ చూడని అభివృద్ధిని పవన్ కళ్యాణ్ రెండేళ్ల పదవీకాలంలోనే చూశాయి.


**బడి, గుడి, ఆరోగ్య కేంద్రాలు, మార్కెట్లకు మెరుగైన రవాణా:** పవన్ కళ్యాణ్ నాయకత్వంలో గ్రామాల్లో నిర్మించిన ప్రతి రోడ్డుకీ బలమైన నేపథ్యం ఉంది. గ్రామీణాంధ్రవ్యాప్తంగా ఉన్న ఎన్నో ప్రసిద్ధ క్షేత్రాలకు ఉప ముఖ్యమంత్రివర్యుల చొరవతో రహదారి సౌకర్యం మెరుగుపడింది. గత ప్రభుత్వ హయాంలో విగ్రహాల ధ్వంసంతో అపవిత్రం అయిన శ్రీరాముడు కొలువైన క్షేత్రం విజయనగరం జిల్లా రామతీర్థం. ఈ క్షేత్ర గిరి ప్రదక్షిణం మార్గంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో భక్తుల సౌకర్యార్థం రోడ్డును నిర్మించారు. శ్రీకాళహస్తి గిరిప్రదక్షిణ మార్గాన్ని ఏర్పాటు చేసి స్వయంగా ప్రారంభించారు. అంతర్వేది శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి క్షేత్రానికి, కోటప్పకొండ, ఐ.ఎస్. జగన్నాథపురం లాంటి వందలాది క్షేత్రాలకు వెళ్లే భక్తుల ప్రయాణ సౌకర్యాన్ని మెరుగుపరుస్తూ రోడ్లు నిర్మించారు. వాడపల్లి ఏడువారాల శ్రీ వెంకటేశ్వరస్వామి లాంటి ఎన్నో విఖ్యాత ఆలయాలకు సాస్కీ లాంటి పథకాల నిధులతో రోడ్లు నిర్మిస్తున్నారు. పల్లెపండుగ రెండు దశల్లోనూ కలిపి 100కు పైగా క్షేత్రాల్లో రూ.120 కోట్లతో 205 కిలోమీటర్ల మేర రోడ్ల నిర్మాణం చేపట్టారు. వీటితో పాటు గ్రామీణ ప్రాంతాల నుంచి ఆరోగ్య కేంద్రాలకు చేరుకునేందుకు, విద్యార్థులు పాఠశాలలకు వెళ్లేందుకు అనుగుణంగా రోడ్ల నిర్మాణం చేపడుతున్నారు.

**రోజులు, గంటల వ్యవధిలో రోడ్లు మంజూరు చేసిన ఉప ముఖ్యమంత్రి:** గ్రామాల్లో తీర్మానాలు చేసిన రోడ్లతోపాటు పలు సందర్భాల్లో ప్రజల కోరిక మేరకు అప్పటికప్పుడు రోడ్లు మంజూరు చేసి పవన్ కళ్యాణ్ తన మార్క్ చాటుకున్నారు. నెల్లూరు జిల్లా, ఉదయగిరి నియోజకవర్గం, గజ్జలవారిపల్లి గ్రామానికి చెందిన విద్యార్థులు తమకు స్కూలుకు వెళ్లే రోడ్డు సరిగాలేదని సామాజిక మాధ్యమాల ద్వారా తెలియజేయగా, తక్షణం ఆ గ్రామానికి రోడ్డు నిర్మించారు. ప్రపంచ కప్ గెలిచిన అంధుల మహిళా క్రికెట్ జట్టు కెప్టెన్ టి.సి. దీపిక సన్మాన కార్యక్రమంలో తమ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరగా ఉప ముఖ్యమంత్రి వారి కార్యాలయం నుంచి దీపిక ఇంటికి చేరే లోపు రోడ్డు మంజూరు చేయడంతో పాటు నిర్మాణం కూడా పూర్తి చేశారు. కానిస్టేబుల్ నియామక పత్రాల పంపిణీ కార్యక్రమంలో అల్లూరి జిల్లా లబ్బర్తి పంచాయతీకి చెందిన లాకే బాబురావు తన గ్రామానికి రోడ్డు కావాలని వేదిక మీద కోరగా, వేదిక దిగే లోపే ఈ రోడ్డు మంజూరు చేసి అందర్నీ ఆశ్చర్యపరిచారు. వీటితోపాటు క్షేత్ర స్థాయి పర్యటనల సందర్భంగా వచ్చిన ఎన్నో వినతులు ఆయా గ్రామాల్లో రోడ్లుగా మారాయి. అడవితల్లి బాట కార్యక్రమం ద్వారా డోలీ రహిత గిరిజన గ్రామాలు లక్ష్యంగా వందలాది గిరిజన గ్రామాలను అనుసంధానిస్తూ, వేల కిలోమీటర్ల రోడ్లు నిర్మిస్తున్నారు. ఇప్పటికే రెండు దశల్లో రూ. 2.078 కోట్లతో, 2,310 కిలోమీటర్ల రహదారుల అభివృద్ధి పనులు చేపడుతున్నారు. ఇందులో దాదాపు వెయ్యి కిలోమీటర్లకు పైగా కిలోమీటర్ల రోడ్ల నిర్మాణం పూర్తయ్యింది. ఎన్నో గిరి శిఖర గ్రామాలకు సంక్లిష్ట పరిస్థితులకు ఎదురెళ్లి మరీ రోడ్ల నిర్మాణం చేపడుతున్నారు. ప్రధాన మంత్రి జన్ మన్, జాతీయ గ్రామీణ ఉపాధి హామీతో పాటు వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాల నిధులు, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో అడవితల్లి బాటలు పరుస్తున్నారు. వీటితోపాటు పంట పొలాల మధ్యకు వెళ్లే డొంక రోడ్లు కూడా కొన్ని నిర్మించారు.

**అన్నదాతకు ఉపాధి భరోసా:** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో పల్లెపండుగ రెండు దశల్లో రైతులకు మేలు చేసే కార్యక్రమాలు కూడా పెద్ద ఎత్తున చేపట్టారు. భూగర్భ జలాల వృద్ధితోపాటు వర్షపు నీటిని ఒడిసిపట్టడం ద్వారా రైతుకు సాగు నీటి కష్టాలు తీర్చేందుకు పంట కుంటల నిర్మాణానికి శ్రీ పవన్ కళ్యాణ్ గారు శ్రీకారం చుట్టారు. రాష్ట్రవ్యాప్తంగా 1.15 లక్షల పంట కుంటలు నిర్మించగా, ఒక్క రాయలసీమలోనే ఈ కార్యక్రమం తర్వాత సుమారు 50 వేల ఎకరాల్లో సాగు విస్తీర్ణం పెరగడం గమనార్హం. దీంతో పాటు హార్టికల్చర్ సాగుకు ఊతం ఇస్తూ... ఉపాధి హామీ పథకం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 2 లక్షల ఎకరాల్లో పండ్ల తోటలు సాగు చేశారు. పాడి రైతుల కోసం, పశువులకు నీడ కల్పించేందుకు రాష్ట్రవ్యాప్తంగా 38,000కి పైగా మినీ గోకులాలు నిర్మించారు. వేసవిలో మూగ జీవాల దాహార్తి తీర్చేందుకు 15 వేల నీటి తొట్టెలు నిర్మాణం చేపట్టి తన గొప్ప మనసును చాటుకున్నారు. రోడ్లు, గోకులాలు, పండ్లతోటలు, నీటి కుంటలతో పాటు గ్రామీణ పారిశుధ్యానికి పెట్టపీట వేస్తూ... డ్రెయినేజీ వ్యవస్థకు కొత్త రూపం ఇస్తూ మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణం చేపట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు 54 కిలోమీటర్ల మేర మ్యాజిక్ డ్రెయిన్లు నిర్మించి, దోమలు, దుర్వాసన నుంచి గ్రామీణ ప్రజలకు రక్షణ కల్పిస్తున్నారు. ఇంకుడు గుంతలు, చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాలు తదితర అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారు. పల్లెపండుగ, పల్లెపండుగ 2.0 కార్యక్రమాల ద్వారా పల్లెపండుగ 3.0కి పవన్ కళ్యాణ్ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వంలో, పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న గ్రామీణాభివృద్ధికి మెచ్చి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రతిష్టాత్మంగా తీసుకువచ్చిన వీబీ జీరాంజీ జాతీయ స్థాయి ప్రారంభోత్సవ కార్యక్రమ ప్రారంభోత్సవానికి మన రాష్ట్రాన్ని ఎంపిక చేశారు. రైల్వే కోడూరు నియోజకవర్గం వేదికగా ప్రారంభమైన వీబీ జీ రాంజీతోపాటు సాస్కీ తదితర కేంద్ర ప్రాయోజిత కార్యక్రమాల నిధులను సద్వినియోగం చేసుకుంటూ పల్లెపండుగ 3.0కి శ్రీకారం చుట్టనున్నారు.


# కెసిఆర్ ఫామ్‌హౌస్‌పై విచారణ

**తక్షణమే నోటీసులు ఇచ్చి భూమిని స్వాధీనం చేసుకోండి**



### శుద్ధి చేసిన చోటే దళితులకు భూములిచ్చి యజమానులను చేస్తా..

### అసెంబ్లీ వేదికగా సిఎం రేవంత్‌రెడ్డి అధికారులకు ఆదేశాలు



బుధవారం అసెంబ్లీలో ప్రసంగిస్తున్న సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,సెప్టెంబరు16:** తెలంగాణ శాసనసభ వేదికగా భూ ఆక్రమణలు, 22ఏ నిషేధిత భూముల వ్యవహారంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం సంచలన నిర్ణయాలు ప్రకటించారు. ప్రతిపక్ష బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఫామ్ హౌస్‌ను లక్ష్యంగా చేసుకుంటూ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కేసీఆర్ ఫామ్‌హౌస్ 700 ఎకరాలు, అందులో 388 ఎకరాలకు రికార్డులు లేవని, ఈ ప్రభుత్వ భూమిపై తక్షణమే విచారణ జరిపాలని,సంబంధిత రెవెన్యూ అధికారులు వెంటనే కేసీఆర్‌కు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. కేసీఆర్ ఫామ్‌హౌస్‌లోని భూములపై విచారణను 30 రోజుల్లోగా పూర్తి చేయాలని అధికారులకు స్పష్టమైన గడువు విధించారు. విచారణలో ఆ స్థలం ప్రభుత్వ భూమిగా నిర్ధారణ అయితే, దానిని స్వాధీనం చేసుకుని పేద దళితులకు పంపిణీ చేస్తామని సీఎం అసెంబ్లీలో ప్రకటించారు. ఈ విచారణ ప్రక్రియలో ఏమాత్రం అలసత్వం వహించినా, సకాలంలో ప్రక్రియ పూర్తి చేయకుంటే బాధ్యులైన అధికారులు, మంత్రులపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కేసీఆర్ ధరణి పేరిట వేల ఎకరాలను కొల్లగొట్టారని, ఆ దందాల చిట్టా బయటపడుతుందనే భయంతోనే బబుల్ షూటర్(హరీశ్‌రావును ఉద్దేశించి) సలహాతో కేసీఆర్ సభ నుంచి పారిపోయారని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. 700 ఎకరాల ఫామ్ హౌస్ కేసీఆర్‌కు ఉందో? లేదో తేల్చాలన్నారు. అందులో 388 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని కేసీఆర్ ఎందుకు చెప్పలేదని ప్రశ్నించారు. ఫామ్ హౌస్‌లో ప్రభుత్వ భూమి ఉందని తేలితే 800 దళితుల కుటుంబాలకు అర ఎకరం పంచుతామని ప్రకటించారు. శుద్ధి చేసిన చోటే దళితులకు భూములిచ్చి యజమానులను చేస్తానని ఘంటాపథంగా చెప్పారు. "సిద్దిపేటలో కేసీఆర్ కుటుంబానికి 67.13 ఎకరాలు ఉంది. కేటీఆర్ కుటుంబానికి 123.19 ఎకరాలు, హరీశ్ రావు కుటుంబానికి 30.16 ఎకరాలు, కల్వకుంట్ల కవిత కుటుంబానికి 37.26 ఎకరాలు, జోగినపల్లి సంతోష్‌రావు కుటుంబానికి 79.20 ఎకరాలు, నవీన్‌రావు,కొండల్‌రావు కుటుంబానికి 101.14 ఎకరాలు ఉంది. మొత్తంగా కల్వకుంట్ల కుటుంబానికి 9 జిల్లాల్లోని 24 మండలాల్లో 31 గ్రామాల్లో 439 ఎకరాలున్నాయి' అని చెప్పారు. సత్యం రామలింగరాజు కంపెనీల నుంచి కెటిఆర్‌కు జన్వాడ భూములు వచ్చాయని, కేటీఆర్ జన్వాడ పామ్‌హౌస్‌పై నేనెందుకు బాంబులు వేస్తా? ఆయనేమైనా బిన్‌లాడెనా.. ఆయనను రోడ్డు మీద పిచ్చికుక్క కూడా కరవదు. స్టీఫెన్‌సన్‌కు ఎన్నికల ముందు నజరానా ఇచ్చారు. రూ.50 కోట్ల భూమిని రూ.1.53 కోట్లకే రెగ్యులరైజ్ చేశారు. గంగుల, ఎర్రబెల్లి, సుధీర్ రెడ్డి 650 ఎకరాల ప్రభుత్వ భూమి కొనుగోలు చేశారు. జగదీశ్ రెడ్డి 50 ఎకరాల ఫామ్ హౌస్‌లో 11.5 ఎకరాల ఇనాం భూమి ఎలా వచ్చింది. పైలట్ రోహిత్‌రెడ్డి అజీజ్ నగర్‌లో అసైన్డ్ భూమిలో పామ్ హౌస్ కట్టుకున్నారు. ఒక కుటుంబానికి కుష్కి పొలం 54, తరి పొలమైతే 27 ఎకరాలుండాలి. కానీ, కేసీఆర్‌కు ఉన్నది మొత్తం తరి పొలమే" అని సీఎం వివరించారు.

## ప్రైవేటు భూములు

### 3,73,930 ఎకరాలపైనే వివాదం

**హైదరాబాద్,సెప్టెంబరు16,ప్రభాతవార్త:** ధరణిని అడ్డం పెట్టుకుని భూములను అక్రమంగా కొల్లగొట్టిన వ్యవహారాలపై ప్రత్యేక విచారణ బృందాన్ని సెట్(ఎస్ఈటి) ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి శాసనసభలో ప్రకటించారు. నిషేధిత జాబితా 22ఏపై బుధవారం శాసనసభలో జరిగిన స్వల్పకాలిక చర్చకు ముఖ్యమంత్రి సుదీర్ఘమైన వివరణ ఇచ్చారు. భూములకు సంబంధించి ప్రధానంగా నాలుగు రకాల సమస్యలు కాలక్రమేణా తలెత్తాయని సవివరంగా సభ ముందు ఆవిష్కరించారు. జరిగిన భూ దోపిడీ వ్యవహారాలన్నింటినీ ప్రత్యేక విచారణ టీమ్‌కు రిఫర్ చేస్తున్నట్టు తెలిపారు. నిజాం కాలం నుంచి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, ఆ తర్వాత తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి ప్రస్తుతం ఎదుర్కొంటున్న భూ సమస్యల వరకు వివిధ అంశాలను సభలో వివరించారు. 1908లో ప్రారంభమైన భూ రికార్డుల నుంచి 2011 వరకువివిధ సందర్భాల్లో ప్రభుత్వాలు తీసుకొచ్చిన చట్టాలు, వాటి వల్ల ఉత్పన్నమైన పరిస్థితులను ముఖ్యమంత్రి ప్రస్తావించారు.